ఆంధ్రపత్రిక
సచిత్ర వారపత్రిక




వెల
4 అణాలు


సంపుటము 42 సంచిక 12
నవంబరు 16 1949

**ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY**


★ ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘ సర్వసభ్య సమావేశం ★



శుక్రవారం మధ్యాహ్నం సమావేశానికి హాజరయ్యేందుకు వస్తున్న, రాష్ట్ర కాంగ్రెస్ సంఘ అధ్యక్షుడు ఆచార్య రంగా, కార్యదర్శి గౌతు లచ్చన్న డాక్టర్ కె. వి. స్వామిగార్లు.



రాష్ట్ర కాంగ్రెస్ కార్యవర్గంచేసిన రాష్ట్ర తీర్మానాన్ని పరిశీలిస్తున్న శ్రీ కళా వెంకట్రావుగారు, శ్రీ కల్లూరి సుబ్బారావుగారు, శ్రీ నీలం సంజీవరెడ్డిగారు, మల్లెల శ్రీరామమూర్తిగారు.



మద్రాస్ ప్రతినిధులు లెఫ్టినెంట్ కలనల్ శాస్త్రి, శ్రీ బులుసు సాంబమూర్తి సర్ యస్. వి. రామమూర్తిగార్లు సర్వసభ్యసమావేశానికి హాజరయ్యేందుకు వెళ్తున్నారు.



సమావేశానికి వస్తున్న శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారు, తెన్నేటి విశ్వనాథంగారు, కొమ్మారెడ్డి సూర్యనారాయణగారు.



మధ్యాహ్నం (శుక్రవారం) తిరిగి సమావేశం కాగానే అధ్యక్షుడు ఆచార్యరంగాగారు కార్యవర్గం తయారుచేసిన రాష్ట్ర తీర్మానాన్ని సభ్యులకు వివరిస్తూ, ప్రకాశం పంతులుగారిని ప్రతిపాదింప కోరుచున్నారు.



అఖిలభారత కాంగ్రెస్ సంఘ కార్యదర్శి శ్రీ కళా వెంకట్రావుగారు నాయకత్రయ నివేదికను ఆమోదింపవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.



అఖిలభారత కాంగ్రెస సంఘ కార్యదర్శి శ్రీ కళా వెంకట్రావుగారు, రాష్ట్ర కాంగ్రెస్ సంఘ కార్యవర్గసభ్యుడు శ్రీ యం. పళ్ళంరాజుగారు సర్వసభ్యసమావేశానికి వెళ్తున్నారు.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతిబుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర, యప్రియము తన మనంబున కగు దా


నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

సంపుటము 42

సంచిక 12


Founder : K. NAGESWARA RAO

విరోధి సంవత్సర కార్తిక బహుళ ఏకాదశి బుధవారము



ఆమెరికాలో వ్యవసాయము

భారతప్రధానమంత్రి నెహ్రూగారు చికాగో వెళ్లినప్పుడు అక్కడకు సమీపంలో నున్న వ్యవసాయ కేంద్రాలను సందర్శించారు. ధాన్యం నిల్వచేసే లోహపుతొట్లను నెహ్రూగారు పరిశీలించుట చిత్రంలో కానవగును.



ఆంధ్రపత్రిక

1949–వ సం॥ నవంబరునెల 16–వ తేది బుధవారము

చరిత్రాత్మక నిర్ణయం

అందరు ఆశించినట్లే, మేము విశ్వసించినట్లే ఆంధ్రరాష్ట్రకాంగ్రెస్‌సంఘ సర్వసభ్యసమావేశము, నాయకత్రయ నివేదికను ఆమోదించుచు రాష్ట్రకాంగ్రెస్‌కార్యవర్గము గురువారము చేసిన తీర్మానమును ఏకగ్రీవముగా ఆమోదించినది. రాష్ట్రకాంగ్రెస్ ఇట్టి మహత్తర, సముచితనిర్ణయము చేయుటకు బాధ్యులైన వారందరు అభినందనీయులు. ప్రకాశంపంతులుగారు సర్వసభ్యసమావేశములో తీర్మానమును ప్రతిపాదించుటకుపూర్వము రాష్ట్రకాంగ్రెస్‌సంఘఅధ్యక్షుడు రంగాగారు వెల్లడించినట్లు "ఆంధ్రులు నాయకత్రయనివేదికను ఆమోదించుటకు చెన్నపట్టణము విషయములో నాయకత్రయసంఘము విధించిన షరతులే తీవ్రప్రతిబంధకముగ నుండెను." చెన్నపట్టణమువిషయమున నాయకత్రయనివేదిక విధించిన షరతుల అంతరార్థమును నాయకత్రయసంఘ సభ్యుడును, కాంగ్రెస్‌అధ్యక్షుడును అగు డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు ఇటీవల చేసిన విశదీకరణవలన ఆంధ్రులలో లోగడ ఏర్పడియున్న భయభీతులు తొలగిపోయినవని, నాయకత్రయనివేదికను నిస్సందేహముగ అంగీకరించుట సాధ్యమైనదని రాష్ట్రకాంగ్రెస్‌తీర్మానము ప్రకటించుచున్నది. నాయకత్రయనివేదిక, "ఆంధ్రులు వదులుకొనవలసిన హక్కులు" ఏవి యను విషయములో, కొంత సందిగ్ధముగనె కన్పించును. కాని సందర్భమునుబట్టి విచారించిన లోగడ మేము అనేకపర్యాయములు వివరించినట్లు రాష్ట్రనిర్మాణము సాధ్యముగావలెనన్న "నగరము ఆంధ్రరాష్ట్రభాగము" అను వాదమునుమాత్రమే ఉపసంహరించుకొనవలసియుండును గాని, నగరముపై గల హక్కులను వదులుకొనవసరము లేదని స్పష్టము కాగలదు.

"అగ్ర నాయకత్రయసూచనను విమర్శగ పరిశీలించిన 'చెన్నపట్టణము ఆంధ్రరాష్ట్రములో చేరవలెనను కోరికను ఉపసంహరించుకొనినగాని ప్రత్యేకాంధ్రరాష్ట్రనిర్మాణము సాధ్యముగాదు' అనిమాత్రమే స్పష్టమగును" అని 1949 మే 4 వ తేదీన, "నగరము ఏ రాష్ట్రములో చేరినను నగరమునందున్న ఆంధ్రులకు ఇతరపౌరులకువలెనే హక్కు లుండును. వారట్టి హక్కులను ఎన్నటికిని వదులుకొనజాలరు. వదులుకొనవలెనని ఎవ్వరు చెప్పజాలరు. కనుక ఆంధ్రులు వదులుకొనవలసిన హక్కులు చెన్నపట్టణము ఆంధ్రరాష్ట్ర భాగము కావలెనన్నంతవరకే నని భావింపవలసియుండును." అని మే 11 వ తేదీన తెలిపియుంటిమి. ఇదే వివరణను రాష్ట్రనిర్మాణముపై వ్యాఖ్యానము చేయవలసిన అవసరమేర్పడిన అన్ని సందర్భములందును ఉద్ఘాటించుచుంటిమి. షణ్ముఖంచెట్టిగారివంటి ప్రతిభావంతులు ఎట్లు అన్వయము చేయ ప్రయత్నించినను, అసలు నివేదికయందలివాక్యముల అర్థము మార్పుచెందదు.

గతములో ఏమి జరిగియున్నప్పటికిని, రాష్ట్రకాంగ్రెస్‌సంఘము మాత్రము చరిత్రాత్మకమైన నిర్ణయము చేసినది. సమావేశములో పాల్గొని, ఏకగ్రీవామోదమునకు దోహదమిచ్చిన అఖిలభారతకాంగ్రెసు ప్రధానకార్యదర్శి శ్రీ కళా వెంకట్రావుగారు "రాష్ట్ర కాంగ్రెసు సంఘము జె. వి. పి. నివేదికను ఆమోదించి మన నూతనభారతరిపబ్లిక్ భాగముగ "ఆంధ్రస్టేట్" స్థాపనకు దారి సుగమము చేసినది" అని ప్రకటించుటవలన అఖిలభారతకాంగ్రెస్‌కార్యవర్గము అక్టోబరు 5 వ తేదీ తీర్మానోద్దేశ్యమునకు రాష్ట్రకాంగ్రెస్‌సంఘ తీర్మానము అనుగుణముగ నున్నదని భావింపవచ్చును. కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టరు పట్టాభి సీతారామయ్యగారు కూడ ఆంధ్రరాష్ట్రకాంగ్రెసుసంఘ ఆమోదము లభించిన జె. వి. పి. రిపోర్టుప్రకారము ప్రత్యేకాంధ్రరాష్ట్రము ఏర్పడగలదని ప్రకటించిరి. రాష్ట్రకాంగ్రెసుసంఘము ఆ నివేదికను "నిస్సందేహముగ" ఆమోదించినది. ఇక ప్రత్యేకాంధ్రరాష్ట్రస్థాపన బాధ్యత, భారము అఖిలభారత కాంగ్రెసుకార్యవర్గానిది; కేంద్రప్రభుత్వానిది. వీరు ఆ బాధ్యతా, భారముల నిర్వహించుటకు ఉపయోగపడగల సూచనలు కొన్నిటిని రాష్ట్రకాంగ్రెసు సంఘము చేసెను. ఈ సూచనలలో ముఖ్యమైనవి ఆంధ్రరాష్ట్రము ఏ ప్రాంతములతో ఇపు డేర్పడవలెను, తమిళ, ఆంధ్రరాష్ట్రములు రాజధానులు ఏర్పడువరకు, చెన్ననగరభవిష్యత్తు నిర్ధారణయగునరకు నగరపరిపాలన ఏవిధముగ జరుగవలెను? అను విషయములకు సంబంధించినవి. ఆంధ్రరాష్ట్రప్రాంతములను పేర్కొనుటలో బళ్లారిజిల్లాను కేల్కార్ అవార్డు ప్రకారము విభజించి ఆదోని, ఆలూరు, రాయదుర్గము తాలూకాలను మిగత తెనుగుజిల్లాలను కలిపి ప్రత్యేకాంధ్రరాష్ట్రమును ఏర్పాటుచేయవలెనని రాష్ట్రకాంగ్రెస్ సంఘము చేసిన సూచన ఆంధ్రుల రాజనీతిజ్ఞతనుగాక ఔదార్యమును వెల్లడించును. కర్నాటకులు సరిహద్దు విషయములో పేచీపెట్టిన, తిరిగి రాష్ట్రనిర్మాణము వాయిదాపడగల దను భయమే ఇందుకు కారణమై యుండవచ్చును. నాయకత్రయనివేదిక చెన్నపట్టణమువిషయములోనేగాక, సరిహద్దులవిషయమునకూడ కొన్ని షరతులను విధించియుండెను. ఆ షరతుల ప్రకారము నూత్నభారతరిపబ్లిక్ అవతరణతోబాటు ఏర్పడు ఆంధ్రరాష్ట్రసరిహద్దులు సంశ్లిష్ట ఇతరభాషా ప్రాంతములవారి సమ్మతితో ఏర్పడవలెను. అందువలన రాష్ట్రకాంగ్రెస్‌తీర్మానము 'కేల్కార్ అవార్డు' ప్రసక్తి తెచ్చియుండవచ్చును. కీడెంచి మేలెంచుట కార్యవాదుల లక్షణము గనుక, రాష్ట్రకాంగ్రెస్ సంఘము ఇట్టి తీర్మానమును చేసియుండవచ్చును.

అన్నివిధముల రాష్ట్రకాంగ్రెస్ సంఘము చేసిన తీర్మానము తృప్తికరముగ నున్నదని చెప్పవచ్చును. నవంబరు 10 వ తేదీ విజయవాడలో జరిగిన బహిరంగసభలో ఉపన్యసించుచు "రాష్ట్రకాంగ్రెస్‌సంఘము గత జులైలో ఆంధ్రప్రజాపరిషత్తు చేసిన తీర్మానమునే పునః ఆమోదింపవలెనని, అందుకు భిన్నముగ చేయుట ఆంధ్రులకు ద్రోహము చేయుటే నని అతఃపూర్వ మొక సందర్భమున ప్రకటించిన సర్ యస్. వి. రామమూర్తిగారు "ఇది చాల సంతృప్తికరమైన నిర్ణయము" అని ప్రకటించుటవలన రాష్ట్రకాంగ్రెస్‌తీర్మానము అన్ని వర్గములను తృప్తిపరచినదని భావింపవచ్చును. ఆంధ్రులు, ఆంధ్రనాయకులు ఇంకమీదటకూడ ఇట్టి ఐక్యతనే ప్రదర్శింపగలరని ఆశించుచున్నాము.

చెన్ననగరము విషయమునను, నూత్నఆంధ్రరాష్ట్ర శాసనసభ, ప్రభుత్వము, చట్టములు విషయములో రాష్ట్రకాంగ్రెస్ తీర్మానము చేసిన సూచనలు అన్నియు ఆచరణసాధ్యములే. చెన్ననగరము కొంతకాలము ఉమ్మడిరాజధానిగ వుండక తప్పదు. అట్లున్నకాలమున నగరపరిపాలనావ్యవహారముల నిర్వహణకు రాష్ట్రకాంగ్రెసు సూచించిన మార్గము కంటె భిన్నమైన మార్గము లేదు.

అఖిలభారతకాంగ్రెసుసంఘ కార్యవర్గము 16 వ తేదీన సమావేశమై అక్టోబరు 5 తీర్మానముపై ఆంధ్ర, తమిళకాంగ్రెసుసంఘములు, చెన్నరాష్ట్రప్రభుత్వము వెల్లడించు అభిప్రాయములను పరిశీలించి ఆంధ్రరాష్ట్రనిర్మాణమున కవసరమైన చర్యలను నిర్ణయించును. ఆ నిర్ణయము చేయునపుడు కార్యవర్గమువారు రాష్ట్రకాంగ్రెసుతీర్మానమునందలి సూచనలను ప్రత్యేకశ్రద్ధతో పరిశీలించవలసియుండును.

జనవరి 26 న స్వతంత్రభారతరిపబ్లిక్ అవతరణతో ప్రత్యేకాంధ్రరాష్ట్రముకూడ ఏర్పడగలదు. రాష్ట్రనిర్మాణమున కీవిధముగ దోహదముచేసిన తీర్మానమును చేసినందుకు రాష్ట్రకాంగ్రెస్‌సంఘసభ్యులనందరిని మరొకపర్యాయము అభినందించుచు, రాష్ట్రనిర్మాణము, రాష్ట్రఅభివృద్ధిసాధనలో ఆంధ్రులందరు ఐక్యకృషి చేయవలెనని నిన్న చేసిన విజ్ఞప్తిని తిరిగి చేయుచున్నాము.

జవ్హార్‌లాల్ నెహ్రూ షష్టిపూర్తి

ఈ పదునాల్గవ తారీఖున పండిట్ నెహ్రూషష్టిపూర్తిఉత్సవము జరిగినది. పండిట్ జవ్హార్‌లాల్ నెహ్రూకు మా అభినందనములు. దీర్ఘాయుష్మంతుడై భారతదేశసౌభాగ్యమును, కీర్తి ప్రతిష్ఠలను ఇతోధికముగ వృద్ధిచేయగలడని మా శుభాకాంక్ష.

వ్యక్తిగతముగ జవ్హార్‌లాల్ సర్వజనప్రియుడు. తన రాజకీయ తత్వమును లౌకికరంగమున పరిపూర్ణాచరణములోనికి తతడు తేలేకపోయినాడన్న నేటి ప్రపంచ రాజకీయ సిద్ధాంతములలోని పరస్పర వైషమ్యమే ముఖ్యకారణము. అధికారస్థానమునుండి నిరంకుశత్వము చెల్లించగలుగుట అతని తత్వములో లేదు. సన్నిహితఫల మాశించు రాజకీయ పాక్షికవాదులకు, అది లోపముగా కనిపించినను, నిష్పాక్షికులకు అందు ప్రజాస్వామ్యతత్వసుగుణమే గోచరించును. తాత్కాలికముగ అధికారస్థానములో అది దౌర్బల్య

ముగ భాసించినను, ఆక్షమ, ఓరిమి కాలక్రమమున దేశమునకు క్షేమకరముగనే పరిణమించగలదు.

నేటి భౌతికవిజ్ఞానము, తదనుయాయియైన నాగరికత అందుకొన్న పరిణామమునకు, సామాన్యమానవుని ఆర్థికసాంఘికనైతికజీవనముల పరిణామము, చాల వెనుకబడియుండుటయే, నేటి ప్రపంచ రాజకీయ సిద్ధాంతముల వైరుద్ధ్యమునకు, ప్రపంచయుద్ధముల నిత్యఆస్కారమునకు, ముఖ్యకారణము. మహాత్ముని విధానము లోకము నాకర్షించినది. కాని లోకము భౌతికవిజ్ఞానరీత్యా సంపాదించుకొన్న నవ్యత్వమునకు మహాత్ముని విధానములో స్థానము కొద్ది. మహాత్ముని తత్వమును, పాశ్చాత్య నవీనతతో సమన్వయింప ప్రయత్నించు సాధికారవ్యక్తి నేడు ప్రపంచమున పండిట్ నెహ్రూయొకడే. ఈ మేలుకలయికకు ఆతడు, చిహ్నముకనే, అమెరికా అత్యాకాంక్షతో నెహ్రూపరిచయమునకై ఎదురు చూచినది. కొత్తపాతలకు ఈ సమన్వయమును సాధించగల్గిన పండిట్ నెహ్రూ భారతదేశమునకేకాక సర్వ ప్రపంచమునకు శాంతి సమకూర్చగలవాడగును. ఈ కృషికై భగవంతు డతనికి చిరాయువొసగవలెనని మా శుభాకాంక్ష.



ప్రతిభాజీవులు :

పండితజవ్హార్లాల్ నెహ్రూ

ఆచార్యకృపలానీ

[ఈ నవంబరు 14 వ తారీఖుకు నెహ్రూపండితునికి అరవైయేండ్లు నిండినవి. ఆ షష్టిపూర్తి ఉత్సవము భారతదేశమంతటా జయప్రదముగ జరిగినది. ప్రపంచదేశములలో భారతదేశమున కితోధికముగ ఔన్నత్యము కల్గించు కృషిలో నిమగ్నుడై, భారతదేశమున శాంతిసౌఖ్యములు పండించుచు జవ్హార్‌లాల్ నెహ్రూ దీర్ఘాయువు కావలెనని మా శుభాకాంక్ష. ఈ సందర్భమున, జవ్హార్‌లాల్‌కు ముప్పదిఏండ్లుగా పరిచితుడయి, నెహ్రూ గుణగణములను, స్నిగ్ధస్వభావముతో, నిష్పాక్షికముగ వివరించగల నేర్పరి అయిన మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు, శ్రీ ఆచార్య కృపలానీ, నెహ్రూనుగూర్చి వ్రాసిన వ్యాసమును ప్రకటించుచున్నాము. సం॥]

నేను గతముప్పై ఏండ్లుగా జవహర్లాల్ నెరుగుదును. మన దేశచరిత్రలో మహత్తరమూ, ఉజ్జ్వలమూ, అయిన ఘట్టము పొడుగూనా, మేమిద్దరమూ సన్నిహితంగా సహకరించి కృషి చేయవలసివచ్చింది. అతను దినదినప్రవర్ధనాభిమానంగా నేటి అత్యున్నతకీర్తిశిఖరాల నందుకొంటూ వచ్చినంతవరకూ కూడా, అతిఉత్కర్షతో, అభిమానంతో, అతని పురోభివృద్ధిని చూస్తూ సంతోషించినవాడిని. అతని జీవితపూర్వార్ధంలోనే ఇద్దరమూ ఒకళ్ళతో ఒకళ్లు మరీ సన్నిహితులమై సంచరించాము. నేను అనేకమార్లు "ఆనందభవన" ఆతిథ్య భాగ్యం పొందాను. ఆరోజుల్లో కాంగ్రెసువారిలో అతను తీవ్రవాది. నేను, బాపూనాయకత్వాన్ని, వేదాంతాన్ని, ఏ అరమరలు లేకుండా స్వీకరించిన వాడినైనా, కాంగ్రెస్ సనాతనులలోనే, అనుకూలుడనని పేరుకెక్కాను. అందువల్ల మా కిద్దరికి పరస్పరం, అభిమానం బాగా పెరిగింది. అతని యౌవనోత్సాహము, హృదయమిచ్చి రమ్యంగా మాట్లాడే అతని తీరూ, కాంగ్రెస్‌వాలంటీర్లతో, (ఈనాడు కాంగ్రెస్ వాలంటీర్ అన్న పేరే అపహాస్యానికి నెలవైంది) ఐక్యమైపోయే అతని సహృదయత్వమూ, సామాన్యప్రజల విషయంలో అతనికి గలశ్రద్ధ, సామాన్యులంటే తిరస్కృతితోనూ నిరాదరంతోనూ చూడటానికి ప్రసిద్ధి చెందిన కులంలో పుట్టీకూడా, ప్రజామధ్యంలో ఇట్టే కలిసిపోయే అతని తీరూ— అతని ఈ గుణాలన్నీ నన్ను ముగ్ధుణ్ణి చేశాయి. కొన్ని సమస్యలమీద మాయిద్దరి దృక్పథమూ, 'చుక్క ఎదురు'గానే ఉండేది— కానీ బాపూజీ శిష్యత్వ సామ్యం వల్ల, వేరుపడిపోకుండా మిగిలిపోగలిగాము. ఈనాటికీ నాకు అతనంటే ఆ గౌరవమే ఉంది.

రెండుసార్లు అతను కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు, నేను కాంగ్రెస్ ప్రధానకార్యదర్శిగా పనిచేశాను. అతని పని చేయటం చాలా ఆనందదాయకంగా ఉండేది. క్రమబద్ధంగా, నీతియుతంగా, కష్టపడి పనిచేస్తూ, ఇతరుల విషయంలో చాలా విశాలహృదయంతో ప్రవర్తించేవాడు. ఎ. ఐ. సి. సి. కార్యవర్గ కలాపాలలో తగిన శ్రద్ధ తీసికొని కాంగ్రెస్ కార్యాలయాన్ని సక్రమంగా పని చేయించగలందుకు నెహ్రూ అంతగా శ్రద్ధ తీసికొని కృషి చేసిన కాంగ్రెస్ అధ్యక్షుడు నా ఎరిగినంతవరకూ మరొకరులేరనే చెప్పవచ్చును. అలహాబాదులో ఉన్నప్పుడల్లా అతను నిత్యం కార్యాలయానికి హాజరయ్యేవాడు. కాని కార్యాలయ నిత్యకార్యక్రమానికి సుశిక్షుణకు అంతరాయంగా ఏనాడూ అక్కడి పనిలో అతను జోక్యం కల్పించుకోలేదు. అతనికి చిరాకూ, చిరుకోపమూ మెండని ప్రతివారికీ తెలుసును. కాని నెహ్రూతో ఇంకొంచెం పరిచయం ఉంటే, అది చాలా క్షణిక కోపమనీ, ఇట్టే మెత్తబడి మళ్లీదానికి ప్రాయశ్చిత్తకాండ అంతా జరుపుకొంటాడనీ తెలిసివస్తుంది. విశాలహృదయుడు. "ఎదిరిని తన యట్టులుగా" తలచి "చదురెరిగిన ధర్మసమ్మతుడు." తనది పొరపాటని తెలిసినప్పుడు, వెంటనే ఒప్పుకొని క్షమార్పణ కోరి, ఇంగితజ్ఞత్వము వెలువరుస్తాడు. అయితే ఆ పొరపాటు మళ్లీ జరగకుండా చూసుకోటం అతనికి చేతకాదు. కానీ, వ్యక్తిగతవిషయాలలో పొరపాట్లని ఎంత త్వరితంగా ఒప్పుకొన్నా, రాజకీయంగా తను చేసికొన్న నిర్ణయాలలోని పొరపాట్లనుమాత్రం, సామాన్యంగా ఒప్పుకోడు. అసలు ఒప్పుకోడనే చెప్పవచ్చును.

బహుశా వ్యక్తిగా నెహ్రూకు తనలో తనకున్న నమ్మకము, రాజకీయజ్ఞుడుగా తనలో తనకు లేకపోవడమే ఇందుకు కారణమేమో! బాపూజీకీ, ఇతనికీ ఉన్న ముఖ్యమైన భేదంఇదే. బాపూజీ తనతప్పులను ఒప్పుకోవడమేకాకుండా గోరింతలు కొండంతలుచేసి చాటి చెప్పేవాడు. అయినా రాజకీయజ్ఞుడుగాకన్న, సత్పురుషుడుగా నెహ్రూ మిన్న అవటం, అతనికి వ్యక్తిగతంగా శ్రేయోదాయకమే, కాని బాపూవలె వ్యక్తిగతంగా ఉన్న ఈ దార్ఢ్యం రాజకీయజ్ఞుడుగా కూడా ఉండి ఉన్నట్లయితే, దేశానికి ఇంకెన్నోరెట్లు క్షేమదాయకంగా ఉండేది.


అహ్మద్ నగర్ కోటలో మూడేళ్లపాటు కలిసి బందీలుగా ఉన్నాము. ఇంతటి చలాకి మనిషి, ఇంత ఉద్రేకి, రాజకీయజీవితసంరంభమధ్యంలో నిత్యం బ్రతికేవాడు, ఈ ఖైదులో ఒంటరితనములో ఉండాల్సివస్తే, ఉక్రోషంతో, దిగులుతో, చిరాకెత్తిపోయి ఉంటాడేమోనని అనిపిస్తుంది.

కాని జవహర్‌లాల్ ఇట్టే ఆ నూతనపరిసరాలకు అలవాటుపడిపోయాడు. వాస్తవానికి ఆ కారాగారంలో అలుముకొన్న నైరాశ్యం అతని రాకతో పటాపంచలై, సంతోషమయమయింది.

మా ముఠాకంతకూ అతను ప్రాణంగా ఉండేవాడు. మనస్సుకూ దేహానికీ పని గల్పించుకొంటూ, నిత్యం ఏ కాయకష్టంలోనో, ఏ విద్యావ్యాసంగంలోనో లీనమై ఉండేవాడు. అతని వివిధవిషయ విజ్ఞానవిశేషమూ, నిత్యోత్సాహమూ, మా నిర్బంధసంఘ జీవనానికి, ఉల్లా

(21 వ పేజీ చూడుడు)

నవల



శ్రీ నోరి నరసింహశాస్త్రి

౪

సభానంతరమున శ్రీచాళుక్యవీరభద్రేశ్వరుడు మౌనముగా నిజమందిరము చేరికొనెను. పెద్దకుమారుడగు హరిహరదేవునిగాని చిన్నవాడగు మురారిదేవునిగాని యతడు పలుకరింపలేదు. దాసదాసీజనమందరును హరిహరదేవుల పట్టాభిషేకనిర్ధారణవార్త నేడు విని బహూకృతులు పొందుదుమని సముత్సుకులై నిరీక్షించుచుండిరి. ఎన్నాళ్లుగానో వారా వార్త విందుమని కుతూహలముగా నుండిరి. నేటి కది సిద్ధింపనున్నదని వారికి గలిగిన సంతోషమునకు నంతము లేకుండెను.

వీరభద్రేశ్వరుడు రాకముందే చూచాయగా నిజవార్త వారికి తెలిసినది. కాని వారి యాశ తాము విన్నది నిజమని నమ్మనీయకుండెను. సరిపడనివారు పుట్టించిన ప్రవాద మని వారు సరిపెట్టుకొనుచుండిరి.

వీరభద్రేశ్వరుడు తుదకు వచ్చెను. అతని గంభీరమగు ముఖభంగి చూచి వారు విన్నది నిజమే యని నిశ్చయించుకొని నిరాశావృక్కులతో ఎదురువచ్చిన పరిజనులందరు ఎవరిపనిపై వారు వెడలిపోయి తమ నిర్ణీతకార్యములందు అప్రమత్తులై యుండిరి.

వీరభద్రేశ్వరుడు తన ప్రధానకరణముతో ఒక్క అరగడియపాటు ఏకాంతముగా మాట్లాడి యాపిమ్మట శాంతగంభీరవదనముతో ఆరామములోని కేగెను. ముందంకులో నాతడు నాటించిన విదేశవృక్షములను పరిశీలించి వాని కవసరములగు దోహదాదికములు తోటమాలితో సంప్రతించెను. ఆపై నాతడు యథాచారముగా తన పారశీకాశ్వముపై నెక్కి దూరము స్వారిచేసి బాగుగా చీకటిపడినపిమ్మట నిజమందిరము చేరుకొనెను.

అప్పటికే రుద్రాంబ యంపిన పటపత్రిక తెచ్చిన చేటిక యాతనికై వచ్చి నిరీక్షించుచుండి వాకిటనే దర్శించెను. ఆ వేషముతోడనే యాతడా యుత్తరమందుకొని చదువుకొని పూర్వోక్తమగు ప్రత్యుత్తరము వ్రాసి మరల నా పళ్లెరములో నుంచెను. అప్పుడా పళ్లెరమందలి యశోకపుష్పము లాతని దృష్టి నాకర్షించెను. ఒక్క క్షణ మాతడాలోచించి తన పరిచారిక నొక్కతెను రమ్మని సంజ్ఞ చేసెను. ముందామె నా యశోకపుష్పము తన యభ్యంతరమందిరములో నుంచ నియమించి కేతకీపుష్పములు తెమ్మని యాజ్ఞాపించెను. ఆమె యట్లు చేయగా నా తెచ్చిన కేతకీపుష్పములు తన పటపత్రికపై గప్పి యా పళ్లెరమును రుద్రమదేవికి పంపివేసెను.

అంతట నాతడు స్నానాదిక మాచరించి భోజనము చేసి తన యభ్యంతరమందిరమున నేకాంతముగా కూరుచుండి యేదో ఆలోచింపసాగెను. అతని కప్పుడు మెరపుమెరసిన ట్లొక్కసారిగా తన పూర్వకథ యంతయు స్మృతివీథిలో ప్రసరించెను.

తనది అనాదిగా పవిత్ర మని ప్రసిద్ధిచెందిన చంద్రవంశము తన పూర్వులు కోసలమునుండి దక్షిణాపథమునకు వచ్చి పల్లవరాజుల జయించి పూర్వపశ్చిమసముద్రమధ్యస్థ మగు మధ్యదేశము నేలిరి. అతని తండ్రి ఇందుశేఖరనరేశ్వరుడు చిన్నతనమున గతించగా కళింగగాంగరాజగు అనియంకభీముని సేనాపతి యగు జన్నాజకుడు దండెత్తివచ్చి తన జాతుల కండగా నిలిచినందున తాను రాజ్యభ్రష్టుడై దేశాంతరగతు డయ్యెను. కతిపయ పరివారముతో నాత డుత్తరదేశము సంచరించెను. ఆకాలపు అలజడులచే ధ్వంసములైన సంఘారామములు వదలి నిలువ నీడ లేక పరిభ్రమించు బౌద్ధభిక్షువులు పలువు రాతనికి పరిచితులైరి. అతనికి కళింగగాంగులపై ప్రత్యేక ద్వేష ముండుటచే తురుష్కుల కొలువులో నాతడు కొన్నాళ్లు చేరి వారి దండనాథులు ఉత్తరకళింగముపై చేసిన దండయాత్రలలో పాల్గొనెను. కాని అవి లాభము లేకపోయెను. అందువల్ల ముసల్మానులు పలువురతో నాతనికి మైత్రి కలిగెను. వారి యుద్ధపద్ధతులుకూడ కొంత యవగత మొనర్చుకొనెను. వారితో కొన్నాళ్లు కలసిమెలసి మెలగినపిమ్మట వారి మతాభిమానము సమస్తబంధములను కోసివేయు ననియు వారిలో నేడు మిత్రులుగా సంచరించువారుకూడ వారి అవసరము తీరినపిమ్మట తాను ఇస్లాము నంగీకరింపనిచో తన్నుగూడ త్యజించి శత్రువునుగా పరిగణింతు రనియు గ్రహించెను.

ఎన్నడో తన పూర్వీకు డగు విజయాదిత్యుడు త్రివచనపల్లవునితో యుద్ధములో మడియగా నాతని కుమారుడు విష్ణువర్ధనుడు చళుక్యగిరిపై తపస్సు చేసి నందాభగవతిని తృప్తిగా చేసి సామ్రాజ్యచిహ్నములను బడసి త్రిలోచనపల్లవుని జయించి యాతని కూతు బెండ్లాడి కళింగగాంగాది భూపాలుర వశ మొనర్చుకొని మధ్యదేశమును నిష్కంటకముగా పాలించె నని యాతడు పెద్దలవలన వినియుండెను. తానును మరల నట్లే మహాసామ్రాజ్యమునకు పాలకుడు కావలె నని కలలు గనుచు నా ప్రయత్నములో నుండెను. తన పూర్వీకుడు నందాదేవిసహాయము పొందెను. ఆమె నిజముగా దేవత యైయుండదు. చాళుక్యగిరిసమీపమున న్నొకానొక యాటవికజాతివారి పరిపాలకురాలై యుండును. కాకున్న దేవతలు ఈ లోకమునకు దిగివచ్చి వరాహలాంఛనాదు లిత్తురా? నందాదేవి యొక కిరాతేశ్వరి యైయుండును. తా నిప్పుడు కాలానుగుణముగా తురుష్కప్రభువుల నాశ్రయించితి నని సరిపెట్టుకొనెను.

తురుష్కుల సహాయముపై నమ్మకము పోయినంత మాత్రమున నాతడు బాల్యాదిగా వాంఛించుచున్న సామ్రాజ్యకాంక్ష విడనాడలేదు. అత డంతట దేవగిరిప్రభు వగు జైతుగి నాశ్రయించెను. అప్పటికే గణపతిదేవుడు బందీవిముక్తుడై స్వరాజ్యమును స్థిరపరచుకొనుచు దేవగిరిప్రభువులను గూడ ధిక్కరించు స్థితిలో నుండెను. అట్టి సమయమున దూరదేశపు దేవగిరిప్రభువు నాశ్రయించుటకంటె తూర్పుసముద్రతీరముపై దండయాత్రలు సలుపుచున్న గణపతిదేవు నాశ్రయించుట శ్రేయస్కర మని యాతనికి తోచినది. అంతట నతడు దేవగిరియాదవుల కొలువు వదలి గణపతి నాశ్రయించెను. గణపతిదేవుని దండనాథు డగు కొలని సోమయమంత్రిసహాయముతో తన జ్ఞాతుల బారద్రోలి మరల తన సంస్థానమును సంపాదించుకొనెను. కాని యతడు చిన్ననాటినుండి కన్నకలలు కలలుగానే ఉండిపోయెను. అత డిప్పుడు గణపతిదేవుని మండలేశ్వరులలో చిన్నమండలేశ్వరుడు! అంతే!

అంతలో శ్రీ రుద్రమదేవిస్వయంవరము వచ్చెను. దానికి గణపతిదేవుడు తనకు గూడ నాహ్వాన మంపెను. అత డప్పటికే యొక చోళరాజపుత్రికను వివాహమై పుత్రులగూడ బడసియుండెను. తన సంస్థానపాలనతో చిన్ననాటి కలలుకూడ నెమ్మదిగా విస్మృతిపథము పట్టుచుండెను. ఆ సమయములో వచ్చిన యీ స్వయంవరాహ్వానము అడగియున్న యాతని చిరకాలవాంఛలను ఉద్బుద్ధము లొనర్చెను.

అంతకుముందు చాళుక్యక్షత్రియులు కాకతీయక్షత్రియులతో సంబంధములు చేసి యెరుగరు. వారి ఆంతరంగికసంభాషణలలో కాకతీయులను గుమ్మడితీగక్షత్రియు లని పరిహసించుచుండెడివారు. కాకతీయుల మూలపురుషుడు గుమ్మడితీగకు పుట్టినవాడని యైతిహ్య ముండుటయే దానికి కారణము.

కాని వీరభద్రేశ్వరుడు మిగిలిన చాళుక్యక్షత్రియులవలె నట్టి దురభిమానము కలవాడు కాడు. అతనికి కులభేదమందే అభిమానము లేదు. వర్ణాశ్రమభేదము నిరసించు బౌద్ధభిక్షువులను ముసల్మానుమౌల్వీలను ఎందరనో అతడు చూచియుండెను. వారిలో పలువురు సన్మార్గప్రవర్తకులును, సాధువులును మహానుభావులు నుండిరి. ఈ యగ్రవర్ణములవారిలో నెందరు నీచగుణము గలవారు లేరు! 'కులము ప్రధానమే గుణము లేకున్న?'

అతని సంపర్కానుభవములచే తరతరములుగా నతని రక్తముతో కలసి వచ్చిన యాత్మకులగౌరవము మాయమైనను, అట్లే అతని కిచ్చిన ప్రభుత్వకాంక్షమాత్రము పోలేదు. గణపతిదేవుల యాహ్వానము చూడగా నతనికి గలిగిన సంతోషాతిశయము వయస్సులో ఐదేళ్లు చిన్నవానినిగా మార్చివేసెను. ముప్పదియైదేండ్ల ప్రాయము గల యాతడు ముప్పదేళ్లవానివలె గోచరించెను.

అప్పుడు కాకతీయుల రాజధాని యగు ననుమకొండకు పలువురు రాజపుత్రులు స్వయంవరమున కాహూతులై యరుదెంచిరి. వారిలో చోళులు గాంగులు కదంబులు పల్లవులు చాళుక్యులు కాకతీయులు నుండిరి. వారిలో పలువురకు రుద్రమదేవిని వివాహమాడుట సమ్మతము కాదు. మిగిలిన సంగతు లెట్లున్నను పురుషవేషము ధరించి స్వేచ్ఛగా సంచరించు స్త్రీని వివాహమాడ నే సుక్షత్రియకుమారు డంగీకరించును? అందులో నామె చక్రవర్తికుమార్తె. అట్టివానికి రాజజామాతకంటె హీన మగు నవస్థ పట్టును!

చాళుక్యవీరభద్రేశ్వరుడు వారల మనోగతులు శీఘ్రముగా గ్రహించెను. దానితో నతని కుత్సాహ మెక్కువయ్యెను. గణపతిసామ్రాజ్యమున కంతటికిని తాను ప్రభువు నగుచున్నా నని భావించెను. గణపతిదేవునకు పుత్రులు లేరు. తాను కాకున్న తన కుమారుడైనను తప్పక సామ్రాజ్యాధిపుడు కాగల డనియు చాళుక్యవంశప్రతిభ మరల నొకసారి దేదీప్యమానముగా వెలుగు ననియు నతనికి నిశ్చయము కలిగెను. అతని ఊహాసాధము మిన్నుముట్టెను.

అత డందుచే నా స్వయంవరక్రీడాయుద్ధములలో జిగీషతో పాల్గొనెను. ధనుఃప్రయోగమునను ఖడ్గయుద్ధమునను రుద్రమదేవి మహాచతుర. అయినను వీరభద్రేశ్వరుడు విశేషముగా దేశాటన మొనర్చి బహునిపుణుల ఖడ్గయుద్ధములు తిలకించి యానేకమార్గము లభ్యసించినవా డగుటచే నొకవిధముగ నాతడు రుద్రమదేవికంటె ఖడ్గసాధనలో చతురతరు డనవచ్చునేమో! కాని యాతనికి వయస్సు మళ్లుచుండుటచే యతని యంగములలోని చురుకుదనము ఏ కొంచెమో క్షీణోన్ముఖముగా నున్నది. మరి రుద్రమదేవియో, నిండు యౌవనములో నిజేచ్ఛావశవర్తియైయుండు శరీరసౌష్ఠవముతో నలరారుచుండెను. కాని తాను పురుషుడు. ఆమె వనిత. యౌవనములో గురుతరమగు స్తనజఘనభార మామెకు యుద్ధక్రీడ కాటంకప్రాయముగా నుండెను.

ఆనాడు అనుమకొండలో తనకును రుద్రమదేవికిని జరిగిన క్రీడాఖడ్గయుద్ధ మాతని కన్నుల యెదుట చిత్రితమై యప్పటికిని కనుపట్టుచున్నది. గణపతిదేవుడును సామంతులును దండనాథులును మండలేశ్వరులును రాజబంధువులును మిక్కిలి ఉత్సుకతతో నా రంగస్థలము నవలోకించుచుండిరి.

ఒకవైపున వీరభద్రేశ్వరుడును మరియొకవైపున రుద్రమదేవియు నా రంగములో ఖడ్గహస్తులై ప్రవేశించిరి. ఇరువురు తమ ఖడ్గములు నియమితపరీక్షాధి

(19 వ పేజీ చూడుడు)

నేటిప్రపంచం:

★ మన స్టెర్లింగ్ నిలవల్ని తరగదీస్తారా?
★ ప్రాచ్య-పాశ్చాత్యదేశ వ్యవహారాల చరిత్రలో నూతన ఘట్టం

పండిట్ నెహ్రూ అమెరికాసందర్శనంతో ఆసియా - అమెరికాల వ్యవహార బాంధవ్యాలలో నూతనశకం ఆరంభమయిందని చెప్పవచ్చును. ఇంతవరకూ ఆసియా దేశాలు యూరోపియన్ సామ్రాజ్యవాదుల నిరంకుశపరిపాలనలో పీడించబడినాయి. ద్వితీయ ప్రపంచసంగ్రామంతో బయలుదేరిన జాతీయోద్యమాలఫలితంగా దాదాపు చాలవరకు ఆసియా రాజకీయస్వాతంత్ర్యం పొందినప్పటికీ ఆర్థికంగా నీరసించిపోయి తిరిగి యూరోపియన్ అమెరికన్ పారిశ్రామిక యజమానులపై ఆధారపడవలసి వస్తోంది.

ఇకనుంచి ఆసియా దేశాలకూ అమెరికన్ యూరోపియన్ దేశాలకూ మధ్య ఆర్థికవ్యవహారబాంధవ్యమే రీతిగా ఉండాలో ఒక స్వరూపం కల్పించడానికి విశ్వప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఆసియా భవితవ్యం

సంగ్రామానంతరం ఆసియాలో ఒక నూతన ఆర్థిక వ్యవస్థానిర్మాణంకోసం జరిగిన యత్నాలు అస్తమనస్కంగానే జరిగాయని చెప్పాలి. యూరోపియన్ సామ్రాజ్యవాదులు ఆసియా జాతీయోద్యమకారులు తమ బలాబలాలు కొలిచి చూసుకున్నారు. తత్ఫలితంగా సామ్రాజ్యవాదుల బలం జాతీయ వాదుల బలాన్నెదిరించి నిలువలేదని తేలింది. ఇండో-చీనా, మలయా మొదలైన ప్రాంతాల్లో పోరాటం ఇంకా సాగుతున్నప్పటికీ, ఈ ప్రాంతల్లో సామ్రాజ్యవాదుల ప్రభావం క్షీణదశలో ఉంది. మరొకవైపున చీనా ఇండో చీనాలలో కమ్యూనిజం ఉప్పెనవలె ముంచుకు వస్తోంది. ఆసియా దేశాలన్నిటిలోనూ కమ్యూనిస్టులు జాతీయవాదుల అండవిడిచి వారి నెదిరించి నిలుస్తున్నారు. ఒక పెద్ద యూరోపియన్ సామ్రాజ్యవాదుల ఆర్థిక పీడనవల్లనూ విరోధభావంవల్లనూ ఆసియా దేశాలు ఆర్థికంగా కోలుకోవడానికి ఆటంకాలేర్పడినాయి. ఆర్థికపీడన ద్వారా జాతీయవాదుల్ని సాధించి తిరిగి ఆ దేశాల్ని తమవశంలోకి తెచ్చుకో యత్నిస్తున్న యూరోపియనను, మొన్న మొన్నటివరకూ మన దేశాలలోని వస్తూత్పత్తి వృద్ధితోడ్పడే, ఇప్పుడు నిరోధిస్తున్నారు. ప్రపంచ ఆర్థికస్థితిగతులను గ్రహించిన అమెరికా ఆదినుంచీ ఆసియా జాతీయవాదుల జాతీయవాంఛల్ని తీర్చి ఆ దేశాల ఆర్థికవ్యవస్థకు పుష్టి కలిగించాలని వాదిస్తూనే ఉంది. భారతదేశంప్రాధాన్యతను గ్రహించి అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ మొదటినుంచీ భారతదేశానికి రాజకీయస్వాతంత్ర్యం ఇవ్వవలసిందని బ్రిటిష్‌రాజకీయాలను హెచ్చరిస్తూనే ఉన్నాడు.

ఈనాడు పరిస్థితి మారింది. యూరోపియన్ రాజ్యాలు తమ ప్రభావాన్ని ఆసియాలో స్థిరపరచుకోలేకుండా ఉన్నాయి. ఆర్థిక వ్యవహారాల్లో ఏదోరీతిని ఆసియా యూరప్‌ఖండాలు సహకరిస్తేగాని యూరప్‌కు ముక్తి లేదు. ఇట్టి సహకారవిధానాన్ని సాధించడం అమెరికాకు ఇప్పుడు ప్రధాన కర్తవ్యమయింది.

అమెరికా ముందుగా చీనాలో ఆర్థిక సైనిక సహాయమిచ్చి తన ఆర్థిక సహకారవిధానాన్ని అమల్లో పెట్టింది. కాని అది వాస్తవానికి ఆర్థిక సహకారం కాలేదు. అయ్యవారిని చెయ్యబోతే కోతి అయింది. చీనాజాతీయవాదుల్లో సైనిక నాయకులే పరిపాలకులైనారు.

ముందుగా కమ్యూనిస్టులు - జాతీయవాదుల మధ్య సమాధానంకోసం యత్నించింది. దీనివల్ల మిశ్రమప్రభుత్వం ఏర్పడినట్లయితే చీనాలో కమ్యూనిజానికి తావులేకుండా చెయ్యవచ్చునని ఆశపడింది. అదే మిశ్రమప్రభుత్వంఆధారంతో జాతీయవాదుల బలాన్నీ, అధికారాన్నీ కబళించడానికి అవకాశం లభిస్తుందనే ఎత్తుతో చీనాకమ్యూనిస్టులు సమాధానానికి సంసిద్ధులయే ఉన్నారు. కాని చీనా సైనికనాయకుల శఠంవల్ల సమాధానం కుదరలేదు. ఆ పైన అమెరికా చీనాసైనికనాయకుల పక్షం వహించింది. వారికి ఆర్థిక సైనిక సహాయం ఇవ్వడంవలన చిరకాలంగా ఉత్తరాన స్థిరపడిఉన్న కమ్యూనిస్టుల్ని రూపుమాపవచ్చునని ఆశపడింది. కాని సైనికనాయకులకు చేసిన సహాయం దేశ ఆర్థిక సముద్ధరణకు వినియోగపడలేదు. ఫలితం దేశంలో ఆర్థిక దుర్భిక్షం చెలరేగి కమ్యూనిస్టుల విజృంభణకు తావిచ్చింది.

ఇంక ఆసియాలో నూతన ఆర్థికవ్యవస్థానిర్మాణానికి తోడ్పడితేగాని ఆసియా ఖండమంతా కమ్యూనిస్టుల పాలపడక తప్పదనే అభిప్రాయం ప్రపంచరాజకీయనాయకుల్లో స్థిరపడింది. ఇట్టి నూతన ఆర్థికవ్యవస్థను నిర్మించాలంటే ప్రజాబాహుళ్యమే పునాదికట్టవలసి ఉన్నారు. ఇంక అందువల్ల రాజకీయంగా జాతీయవాదుల్ని బలపరచి వారికి ప్రజాదరం లభించడం పాశ్చాత్యులకు వాంఛనీయమయింది. ఆసియాదేశాలకు పాశ్చాత్యదేశాలతో సమాన వ్యవస్థ లభిస్తేగాని యూరప్ ఆసియాల మధ్యగాని అమెరికా ఆసియాల మధ్యగాని ఆర్థికసహకారం, సైనిక దేశరక్షణవ్యవహారాల్లో సహకారం అసంభవమని అమెరికన్ రాజకీయవేత్తలు గ్రహించారు.

ఇకనుంచి ఆసియాతో పాశ్చాత్య రాజ్యాల ఆర్థికవ్యాపార, రాజకీయ సంబంధబాంధవ్యాలకు నూతనస్వరూపం కల్పించాలని యత్నాలు జరుగుతున్నాయి.

ఈ యత్నాలకు పండిట్ నెహ్రూ అమెరికాసందర్శనం నాందివంటిది.

అయితే వాస్తవంగా ఆసియారాజ్యాలతో, ముఖ్యంగా భారతదేశంతో అమెరికా ఎటువంటి స్నేహబాంధవ్యాలు కోరుతోంది? ఆసియా ఆర్థికసమస్యల్ని ఏరీతిగా పరిష్కరింప చెయ్యాలని అమెరికా యత్నిస్తోంది? ఈ ప్రశ్నలకి సమాధానం త్వరలోనే తెలియవచ్చును. అమెరికన్ విదేశాంగవ్యవహారశాఖానిపుణుడు, ఐక్యరాజ్యసమితిలో అమెరికన్ ప్రతినిధి అయిన ఫిలిప్ జెసప్, అమెరికన్ ఆర్థికశాఖామంత్రి అయిన జాన్ స్నైడర్ తూర్పుఆసియాదేశాల్ని పర్యటించనున్నారు. వ్యవహారాలన్నిటినీ స్థూలంగా పండిట్ నెహ్రూతో అమెరికా అధ్యక్షుడు ట్రూమన్, విదేశాంగమంత్రి డీన్ ఆఛిసన్ చర్చించారు. ఇకనుంచి ఆసియాతో తమ వ్యవహారాల్లో అమెరికా నెహ్రూఆశయాలను అభిప్రాయాలనూ నిరాదరించదు. అందువల్ల ఆసియాభవిష్యన్నిర్ణయంవిషయంలో నెహ్రూపై గురుతరమైన బాధ్యతను పెట్టారని చెప్పాలి.

మన ఆర్థిక వ్యవహారాలు:

ఈ నూతనవ్యవస్థలో భారతదేశఆర్థికసమస్యకు ప్రాధాన్యం ఇవ్వబడింది. ఈసందర్భంలో భారతదేశఆర్థికవ్యవహారాలపట్ల అమెరికా ఏ వైఖరితో ప్రవర్తిస్తున్నదో గమనించవలసిన అవసరం ఉంది. నెహ్రూకు స్వాగతమిస్తూ అమెరికన్ వ్యాపారస్తులు, పారిశ్రామికయజమానుల పక్షాన వాదించే పత్రిక (వీరే అమెరికన్ విదేశాంగ, వ్యాపార, ఆర్థికవ్యవహారాలను నిర్ణయించడంలో ముఖ్యులు) న్యూయార్క్ టైమ్స్ సంపాదకీయంలో ఇలా వ్రాసింది.

"యుద్ధకాలంలో భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వవలసిందని బ్రిటన్‌ను మనం (అమెరికా) ఒత్తిడిచేస్తూ వచ్చాం. బ్రిటన్‌కు మనం ఋణం ఇచ్చినప్పుడు మనం బ్రిటన్‌తో చేసుకున్న ఒడంబడికలో ఒక షరతు విధించాం. స్టెర్లింగ్ నిలవల్ని బ్రిటన్ నిలవేసి ఉంచాలేకాని ఖర్చుపెట్టరాదనీ, ఈ నిలవల ఆధారంతో వ్యాపారాన్నంతనీ లండన్‌వైపుకే మళ్లించుకోడానికి వీల్లేదనీ, మనం షరతు విధించాం. దీనికి ఫలితంగా బ్రిటన్ భారతదేశానికి విపరీతంగా ఋణపడిపోయింది.

"బ్రిటిష్‌వారు ఈ రెండుసూచనలూ (భారతదేశస్వాతంత్ర్యం, స్టెర్లింగునిల్వల బిగింపు) పరస్పరవిరుద్ధమైనవని భావించారు. ఇప్పుడు ఎలాగైనా భారతదేశానికి ఏదో కొంత లబ్ధి చూపి కామన్వెల్తులోనే ఉంచడానికి బ్రిటన్ ప్రయత్నిస్తోంది. భారతదేశంలోని అంతులేని అమ్మకపు వ్యాపారాన్ని తమకే అట్టేపెట్టుకోవాలని వారు కోరడం వారికి సహజమే. అందువల్లనే సర్ స్టాఫర్డ్ క్రిప్సు భారతీయుల్ని అపారంగా స్టెర్లింగ్ నిలవల్ని ఖర్చుపెట్టుకోనిస్తున్నాడు. ఇంతంత మొత్తాలు ఖర్చుపెట్టుకోనివ్వడం చూసి వాషింగ్‌టన్‌లోని సర్వసభ్యాలనారూ బ్రిటిషు ఆర్థికనిపుణులూ నిర్ఘాంతపోయారు. ఇదంతా రాజకీయాలతో కలగలుపైన ఆర్థికవ్యవహారమని చెప్పాలి."ఇప్పుడు బ్రిటిషువారొచ్చి భారతదేశంపట్ల అమెరికా నిర్వచించవలసిన నైతిక బాధ్యత ఉందంటున్నారు. అయితే లబ్ధిలో వాటామాట ఎత్తరు." తరవాత భారతదేశ ప్రస్తుతఆర్థికస్థితి షరుసుగా ఉందనీ, బ్రిటన్‌కు సామ్రాజ్యం పోవడమువల్ల వచ్చిననష్టంకంటె భారతదేశానికి స్వాతంత్ర్యంవల్ల వచ్చిన నష్టం అధికమని ఈ పత్రిక వ్రాసింది. పాకిస్తాన్ ఆర్థికంగా తనంతతాను నిలబడగల స్థితిలో ఉందనీ, భారతదేశం పరిస్థితి క్లిష్టంగా ఉందనీ వ్రాసింది.

"భారతదేశంలో పెట్టుబడికీ, లాభార్జనకూ ఎన్నో అవకాశాలున్నాయి. కాని అక్కడ పరిస్థితులు అమెరికన్ పెట్టుబడిదారుల్ని ఆకర్షించగలగడం సందేహం. బహుశా అధ్యక్షుడు ట్రూమన్ సూచించిన విధానం ఈసమస్యనుపరిష్కరించవచ్చును."అనికూడా ఆపత్రిక వ్రాసింది.

భారతదేశఆర్థికసమస్య పరిష్కరించడానికి స్టెర్లింగునిలవలు తోడ్పడగలవనీ,పండిట్ నెహ్రూ వాషింగ్‌టన్, లండన్ చర్చల్లో ఈ విషయం కూడా ప్రధాన విషయాలలో ఒకటిగా చర్చించబడిందనీ వార్తలు తెలుపుతున్నాయి.

మన స్టెర్లింగ్ నిలవలు:

మన స్టెర్లింగ్ నిలవల్ని తీర్చే బాధ్యతను బ్రిటన్ అమెరికాకు ఒప్పగించాలని కొందరు ప్రయత్నిస్తున్నారు. బ్రిటిష్‌వారు భారతదేశంలో మార్కెట్లు పోగొట్టుకోవడం ఇష్టంలేకనే స్టెర్లింగ్ బాకీలను కొద్ది కొద్దిగానైనా తీర్చడానికి ఇష్టపడుతున్నారు. అమెరికన్ల పోటీభయమే లేకపోతే మన కివ్వవలసిన బాకీలకి బ్రిటిష్‌వారేనాడో సున్నచుట్టే వారే ననేది తెలిసినవిషయమే.

కాని బ్రిటిష్‌వారికి వాస్తవంగా ఈ బాకీల్ని తీర్చగల శక్తి లేదు. ఒక పెద్ద అమెరికా ఆర్థిక సహాయాన్నీ, మరొకపెద్ద స్టెర్లింగ్ వ్యాపార ప్రాంతాల వ్యాపార బలాన్నీ ఆకట్టుకున్న బ్రిటన్ యూరోపియన్ రాజ్యసమైక్యతాయత్నంలో అర్ధమనస్కంగా పాల్గొంటూ, ఒకరీతిగా యూరప్ రాజ్యాల నూతన ఆర్థికవ్యవస్థానిర్మాణాన్ని నిరోధిస్తున్నదని అమెరికన్ల అభిప్రాయం. అంతర్జాతీయ వ్యాపారరంగంలో బ్రిటన్ స్వార్థాశయంతోనే వర్తిస్తున్నదికాని మిగతా దేశాలతో సహకరించాలనే తలపు లేనేలేదని మిగతాయూరోపియన్ రాజ్యాలు నిందిస్తున్నాయి. ఒకవైపు అంతర్జాతీయవ్యాపారంలో పోటీని పెంపొందిస్తూ మరొకవైపు స్వదేశంలో పరిశ్రమలను ప్రభుత్వాధీనం చేసుకోడంలో బ్రిటన్ మగ్నమై ఉంది. మిగతా యూరోపియన్ రాజ్యాలలో అమెరికన్ పెట్టుబడికి అవకాశం లభించగా, మిగతాయూరోపియన్ పెట్టుబడిదార్లు అమెరికన్ పెట్టుబడిదారుల్తో చెయ్యిచెయ్యి కలుపుతుండగా బ్రిటన్‌మాత్రం అమెరికన్ పెట్టుబడిదారులకు అవకాశం ఇవ్వడంలేదు. స్టెర్లింగ్ ప్రాంతాల్లో వ్యాపారంలో అధికభాగాన్ని ఆకట్టుకొని, మార్కెట్లపోటీలో పెట్టుబడిదారులతో పోటీచేస్తూ, ఇంటివద్ద సోషలిజాన్ని అమలు జరుపుతున్న బ్రిటన్ తనవిధానం మార్చుకోవాలని అమెరికా ఒత్తిడి తెస్తూవచ్చింది. అనేకవిధాల వ్యాపారంలో అందరి సహాయం పొందుతున్నప్పటికీ బ్రిటన్ కోలుకోలేకపోతోంది. బ్రిటన్ స్వదేశంలో సోషలిజాన్ని మాని మిగతా యూరోపియన్ దేశాలతోపాటు ఆర్థిక, దేశరక్షణ వ్యవహారాల్లో సహకరిస్తేగాని యూరప్ ఆర్థికసమస్య పరిష్కారం కాదని అమెరికన్లు ఒత్తిడి చేస్తున్నారు. అమెరికా ఒత్తిడి వల్లనే బ్రిటన్ తన డాలామణి మారకపు విలువని తగ్గించవలసివచ్చింది. ఇలా తగ్గించినందువల్ల వ్యాపారం చురుగ్గా జరుగుతున్నమాట వాస్తవమే. కాని బ్రిటన్ భారత దేశాల ఆర్థికవ్యవహారాలు కల్లోలంలో పడ్డాయి.

ఇప్పుడు బ్రిటన్ స్టెర్లింగ్ బాకీల్ని ఇంతింత మొత్తాలుగా తీర్చలేమని చెప్తోంది. బాకీలో కొంతభాగం రద్దుపరచాలని కొందరూ, పూర్తిగా ఎగ్గొట్టాలని కొందరూ అంటున్నారు. అలా చెయ్యబోరని బ్రిటిషుప్రభుత్వం పైకి చెప్పినా త్వరలో ఈ బాధ కొంత వొదుల్చుకోవాలని బ్రిటన్ యత్నించవచ్చును. దీనికి తార్కాణం బ్రిటిషు ప్రధాని, ఆర్థిక మంత్రులు ఈ విషయాన్ని గురించి పౌను మారకం తగ్గింపు అనంతరం పార్లమెంటులో ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వకపోవడమే.

ఇప్పుడు పండిట్ నెహ్రూ భారతఆర్థిక సమస్యను పరిష్కరించడానికి యత్నిస్తున్న సమయంలో మన స్టెర్లింగ్ బాకీల్నిగురించి మళ్లీ బేరాలారంభమైనాయి. బ్రిటన్, అమెరికాలు భారతదేశానికి వెంటనే ఆర్థిక సమస్యాపరిష్కారంలో తోడ్పడగలిగినట్లయితే, భారతప్రభుత్వం స్టెర్లింగ్ బాకీల చెల్లింపు, తరిగింపు విషయమై తుది నిర్ణయమొకటి చేసుకోడానికి సిద్ధపడుతున్నట్లు కొన్ని విదేశపత్రికలూహిస్తున్నాయి.

అమెరికా స్టెర్లింగ్ ప్రాంతంతో (బ్రిటన్ ఒక్కదేశంతో కాదు) వ్యాపారంలో జమాఖర్చుల్లో ఈ స్టెర్లింగ్ బాకీల్ని బ్రిటన్‌ఖాతానుంచి అమెరికాఖాతాకి మార్చే యత్నాలు జరుగుతున్నాయని ఊహిస్తున్నారు. ఈ మార్పువల్ల వేరే బాకీల్లో కొంతభాగాన్ని ఎగబెట్టుతున్నట్లు కనిపించకుండా మారింట $30\frac{1}{2}$వంతులు దానంతటదే తరిగిపోతుంది అంత తరగడానికి పండిట్ నెహ్రూ అంగీకరించకపోవచ్చును. కాని అమెరికన్ బ్రిటిషు ధనం భారతదేశంలో పెట్టుబడి పెట్టడానికీ, నిపుణుల్ని పంపడానికీ ఆదేశాలు అంగీకరిస్తే ఏదో ఒక రేటుని బాకీల్ని తరిగించడానికి అందరిమధ్యనూ ఒప్పందం కుదరవచ్చును. పండిట్ నెహ్రూ ఒప్పందంకోసం ఇంత త్యాగం చెయ్యదలచుకున్నాడంటే ఆశ్చర్యపడనక్కరలేదు. బ్రిటన్, అమెరికాల మధ్య భారతదేశపు మార్కెట్లకోసం జరుగుతున్న ప్రచ్ఛన్నపోరాటంకూడా అంతంకావచ్చును. ఇందువల్లనే స్టెర్లింగ్ బాకీల్ని ఎగబెట్టాలని వాదిస్తూ వచ్చిన బ్రిటిషు కన్సర్వేటివ్ పార్టీవారి ఉపనాయకుడు ఈడెన్ పండిట్ నెహ్రూను "కామన్వెల్తు దేశాల మైత్రి సహకారాలు పండిట్ నెహ్రూలో మూర్తీభవించి ఉన్నాయి" అన్నాడు. మాంచెస్టర్ గార్డియన్ పత్రిక "పండిట్ నెహ్రూయే నూతన కామన్వెల్తు వ్యవస్థ" అని వ్రాసింది.

• [సూర్యం]

ఆంధ్రప్రబంధపురుషులు: శాలీనుడు

శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య

ఆంధ్రప్రబంధపురుషులలో శాలీనుడు ఒక మధుర ప్రకృతి. సూరనార్యుని కావ్యకళా సృష్టిలో నితడొక సురుచిరసన్నివేశము. కళాపూర్ణోదయములో సూరనార్యుని యమృతహస్త సంస్పర్శనముచే నుజ్జీవితము లయిన కావ్యపాత్రములలో నితడు కళాప్రపూర్ణుడు!

మనుచరిత్రములో 'వివిధాధ్వర నిర్మల ధర్మకర్మ దీక్షాపరతంత్రుడు'గా, అనుకూలవతి తన మనసులో వర్తించు కులకాంత సోమిదేవితో సంసారపక్షముగా గాపురము వెళ్ళబ్రోయుచు నతిథిపూజాప్రవణుడుగా, నమరకాంతలే వలచి పయికొని వచ్చినను గన్నెత్తి చూడని ధార్మికుడుగా, పరకాంతాపరాఙ్ముఖుడుగా జిత్రింపబడిన ప్రవరుని ప్రకృతికి, శాలీనుని ప్రకృతికి జాలభేదము కలదు. అసలు ఆ పాత్రల సృష్టికి అభ్యాసనకల్పులు పెద్దన సూరనల దృక్పథములే వేఱు. పెద్దన్నది ధర్మదృష్టి! సూరన్నది కళాసృష్టి! వారి విభిన్న దృక్పథముల మూర్తీభావమే ప్రవరుడును, శాలీనుడును.

శాలీనుడు ఇల్లటపు టల్లుడు. ఇతని తల్లిదండ్రు లెవ్వరో మనకు దెలియదు. సుగాత్రి యితని భార్య. ఆమె కాశ్మీరభూమికి గర్భిక యగు శారదాపీఠమున శారదను భజించు పూజారి బ్రాహ్మణపుత్రి. ఇల్లటపుటల్లుండ్రకు సాధారణముగా నత్తవారింట నెట్టి చనవు సంతనము లుండునో శాలీనునికిని అట్టివే కలవు. అత్తగారికి నోరు కొంచెము పెద్దది. ఆ యింటిలో నామె మాటకు చెలామణీ యెక్కువ. శాలీనునికి ఆమె యొడ చనవు తక్కువ. అందుచేత నితడామె కడ నెన్నడును నోరు పెదపడు. తన కోరికలకు గళ్ళెము పట్టి దానిని లోననే యడచుకొనును గాని వెలికి జెప్పడు. చెప్పినను గాదనువారా యింట నెవ్వరును లేరు. అయినను నతనికి ధైర్యము చాలదు.

నాడు తొలికలయిక ముత్తైదువలు ముచ్చటపడి సుగాత్రిని చక్కగా నలంకరించి పంపిరి. సుగాత్రి 'యలంకారకలిత' యై యరుదెంచినది. శాలీనునికి సహజసౌందర్యమునందు ప్రీతి. బుట్టబొమ్మకు దొడిగినట్లు నిలువున నొక్కచేయలంకారపు దొడుగు అతనికి సరిపడదు. అందుచే 'దద్విభూషణాది మహిమ దలకి' యతడామెను చేరదీయలేదు. పాపము! 'తరుణి యుండి యుండి తిరిగిపోయిన' ది —— రెండు మూడు రాత్రులు గడచినవి. సుగాత్రికి వట్టి రాకపోకలు మాత్రమే దక్కినవి. శాలీనుడు మాత్రము 'అది నేభావమున జూచెనట్లు' చూచు చుండినాడు. మగడొల్లమికి గారణము సుగాత్రి తెలిసికొన జాలకపోయినది. శాలీను డయినను తన కిష్టమిట్టిది యని చెప్పడు. చెలికత్తెలకు దల్లికి విషయ మిట్టిదని బోధపడలేదు. తల్లియును మతిని బ్రియవయస్యలు సుగాత్రితో నేకాంతమున,

'కాంతు డుచితజ్ఞుడైనను
గాంతకు సిగ్గువడ జెల్లుగాక కటకటా?
కాంతుడు సిబ్బితికాడై
కాంతయు నట్లైన నెట్లు కాపుర మింకన్,
నలినవదన! యెన్ని నాళ్ళైన జిన్నకూ
తురవుగావు, నీవ తొడగి పతికి
దగిన సేవసేయ కగునె యూరకయుండ
నాతడేమియు నన డనుచు నిట్లు.
గారాముల దోడ్తోడన
రారమ్మన డనుచు మగుడి రానేటికి? గర్వారంబుతోడి బాగా
లీరాదో? యాకు మడిచి యీరాదో చెలీ!'
యని 'తత్త్వము' నుపదేశించినారు.
జంగలివి గాక నీవో
యంగన! భోగములపంటయామని యగు నీ
బంగారు వంటి ప్రాయము
సంగతియే యకట! రిత్త సేయ్యకు నొసగన్.
యౌవనము గలిగినప్పుడ
పూవుంబోడులకు బత్తుల భోగంబులుగా
కా విభవములకు గొఱయే
యో వనజాతాక్షి! ప్రాయ ముడిగినవెనుకన్'
అని యదనున హెచ్చరిక చేసినారు.

సుగాత్రి తదీయయుక్తుల తెఱగు నొనరించి చూచినది. శాలీనుని ప్రవృత్తిలో సంచలనము లేదు. సుగాత్రికి మగనిపై ననురాగము సడలలేదు సరికదా 'యీయన నింక నేమి ప్రపంచంబు జేసిన నెఱయ నెరసిపోవుటతక్క ప్రయోజనం బేమియు లేదు. నాకును మంగళసూత్రం బీపాటి శుభస్థితి నుండుటయ పదివే' లనుచు నెంచుకొనినది. అంతటితో నూరుకొనలేదు. వేఱొక్కలాగున నుండక యతనికే నాయురభివృద్ధికరంబు లని వివిధాలంకారంబు లెప్పుడు నేమరక తాల్చుచుండినది. శాలీనుడు ఉలుకడు. పలుకడు. తన కది యయిష్టమని తెలుపడు. అత్తగారికి ఓరిమి అంతకంతకు సడలుచుండినది. సుగాత్రి మగనిమీది మమకారముచే దన తల్లి యతని నేమియు నిట్టట్టాడకుండ బ్రార్థించుచుండినది. ఓర్చియోర్చి యోరిమి దిగజాఱగా నొక్కనాడు తల్లి సుగాత్రితో.

'ఇట్టి నిరర్థు నెందు గన,
మేమన బోయిన నీవు మిక్కిలిం
దిట్టెదు, నాకు సంపదకు
దిక్కగుచున్ మగమొల్క నీ కికన్
బుట్టునొ యంటిమే నితని
పోడిమి గంటిమి, కట్టి గొడ్డుతా
కట్టిత గొంత యున్న, నిను
గాజీయపెట్టుట పళ్ళ దోలినన్."

అనినది. పాపము! సుగాత్రికడుపుపండి యొక మగమొలక మొలిచిన జూడవలయునని యా మెబులుపాటము. దానిచే ననుభవమున కధికారులు లేని తన యమూల్యసంపదకు మగడిక్క గలుగునని యా మెయాశ. శాలీనుని యిల్లఱికము వట్టి గొడ్డుతాకట్టుగా నున్నది. పోనీ యతని వెళ్ళదోలెదమన్న గూతురిని గాజీయపెట్టుట యగును. మ్రింగనురాదు క్రక్కనురాదు. అట్టిది యా పెయవన్! కడకొక యుపాయ మాలోచించినది. 'పూవులతోటకైన నటు వోయి విచారముచేసి రమ్మనంగావలయుంగదా' యనుకొనినది. అతని బిలిచి యట్లు కట్టడచేసినది. శాలీనుడును.

'దివిజనుతయైన శారదాదేవిపూజ
కుపకరించు కార్యం బిది యొప్పు ననుచు'
సంతోషముతో నా పనికి మెయికొనినాడు.
మఱియు నతడు——

'నీ రెత్తు వేళల నీ రెత్తు బావుపా
దునకు గాలువలు పొందగ నమర్చి
త్రవ్వటంబుల తఱి ద్రవ్వటంబులు వెట్టు
దగినట్టు కట్టు గుద్దలి గడించి
యెరువు జల్లెడు సావి నెరువు జల్లు గతాభి
మానుడై గంపల దాన తెచ్చి
యంట్లొత్తు పదమున నంట్లొత్తు నెలమి గా
న్పించు లేగొమ్మలు వంచివంచి
నారు వోయగలయుచో నారు వోయు
గొమ్మ నాటంగ దగు నెడ గొమ్మ నాటు
నొకటి విసువక యంతకంతకును హెచ్చు
హాళితో డను శాలీను డవిరతంబు.'

తోటమాలిగా నతడు——

ఎంతయు బ్రొద్దున లేచి ని
తాంతాచరితస్వజాతిధర్ము డగుచు ని
శ్చింతు డయి సురపరంపర
చింతించి తదుక్తజపము చేసి ముదముతోన్.
నియమమున బుష్పములు గోసి నేర్పు మీఱ
బలు తెఱంగుల వింతవింతలుగ మాలి
కలును బొందులు గందుకంబులు రచించి
బ్రహ్మయిల్లాలికిని సమర్పణము సేయు'
చుండినాడు.

మగని కష్టపాటును జూచి యోరువజాలక సుగాత్రి తాను నతనికి దోడుపడదలచును గాని సిగ్గుతెర మఱుగై యామెను మఱలించుచున్నది.

శాలీనుడు తోటకు బోయియుండగా నొక్కనాడు పెనువాన గురిసినది. నాడు సుగాత్రి మగనికై యలమటించిపోయినది. ఆమె తల్లడ మింతింత నరాదు. శారదను ప్రార్థించినది.

'ఈ క్రేహంబున బూర్వదేహములయం
దేనిన్ వ్రతధ్యానదా
నాదిప్రోద్భవ మేమియేమి గలదా
యా పుణ్య మీవర్ష పీ
డా దోషంబును మత్పతిం బొరయకుం
డ న్మానుపుంగాత నే
నాదుం గావుత దన్నిమిత్త పతిపా
పాక్రాంతికిం బాత్రమన్'

అని శారదను ప్రార్థించుచు మగని జూడ బయలుదేఱినది. ప్రాణవల్లభుం డున్న వనంబున గడనయుండి పరికించినది. ఆత్మసంప్రార్థిత బ్రాహ్మీప్రసాదవిశేషంబున నెప్పటియట్ల శుభవర్తనంబున నున్న తన భర్తను జూచినది. సరస్వతిని గొనియాడి యిల్లు చేరినది.

సుగాత్రి లజ్జపెంపున గొన్ని నాళ్ళదనుకఁ గల్లభుని యెడుమపాట్లకు ఓర్చికొనియే యుండినది. ఆ యోరిమి చాలకాలము నిలువలేదు. సిగ్గు జోహారుచేసి తొలగి నిలచినది. అంత 'తల్లిమాట యొక్కింతయు దాను గైకొనక యెప్పటియట్ల యలంకృతాంగియై' ప్రియు డున్న వనంబులోని కరగినది.

'తన సొమ్ములెల్ల నొకముఱు
గున నిడి పిరిచుట్టు చుట్టుకొనిన వలువతోన్'
మగనికి నోడుపడినది. అదను జూచి మదనుడు విల్లు తొడగినాడు. శాలీనుడు తన కిష్టమయిన సౌందర్యమును సుగాత్రిలో జూచినాడు. అతని మనసులో వలపులు కులుకులాడినవి.

అపు డత డిట్లు పేర్చుకును
మాస్తుని యుదతి యాపలేక 'వ
శీపడుచ! యెంత మాన్పిన నె
ఱింగెడు దానవు గావు నీకు దో
టపనుల కెంత దూర మక
టా!' యనుచుం దన యుత్తరీయవ
స్త్రపు మునికొంగునం దుడిచె
దన్వికపోలపు ఘర్మబిందువుల్.

అంతటితో యతని తమి యాగలేదు. ఎక్కుడు తమకముతో సుగాత్రిని దలగ్రుచ్చి కవుంగిలించుకొనినాడు. చిగుళ్ళ జొంపముల సొంపగు పూబొదరింటికి దార్చి సుగాత్రిని మదనమహారాజ్యభోగమహిమయందు దేల్చినాడు. సుగాత్రి తన పుణ్యము పండిన దనుకొనినది. మగడు తన్ను ముట్టినందుకే మురిసిపోయినది. ఇన్ని నాళ్లు మగడు తన్నొల్లమికి గారణ మీమె యడుగలేదు. అతడు చెప్పలేదు. అంతటి పారవశ్యములో వారి తొలికలయిక జరగిపోయినది. వారి యానందములో నీ ప్రశ్నములు అడుగునబడిపోయినవి.

సుగాత్రి 'యివి మిగుల గ్రొత్త లింటికి నేగవలదా' యని ప్రియము జెప్పి విడిపించుకొనినది. మఱుగున దాచిన తన భూషణముల దొడుగుకొని యల్లన నిల్లుచేరినది. సఖులు ఆవులించిన బ్రేవులు లెక్కపెట్టువారు. సుగాత్రిముఖవికాసము జూచి గుట్టు తెలిసి రట్టుచేసిరి. తల్లి ప్రమోదమందినది. శాలీనుని హృదయములో,——

'గతిసంభ్రమంబునం గరము జెదంకుచు
నకనకల్గుడుచు నెన్నడుము సొబగు
గుఱుమాపు దడిమంపు గోకలో దొలికెడు
కంపమాననితంబకాంతిసొంపు
బిగువుపయ్యెదలోన బిక్కటిల్లుచు జాఱ
ద్రుళ్లు చన్నుల నొప్పు మళ్ళి పేరు
జెమట చిత్తడి చిట్టి యమరు కస్తురిచుక్క
బొట్టుతోడి పసపుబట్టెబరియు
గనిపి సొంగు వడకెడు గొప్పుకొప్పు
గులిగి యాకెద న్నొకటియు జలుపనీక
తోడ బరువులువాఱుచు దోటపనులు
సేయు రూపు,——'

హత్తుకొనిపోయినది——

నాటిరాత్రి సుగాత్రి యెప్పటికంటె మిగుల నలంకరించుకొని కేళికాభవనమున కేగినది. ప్రొద్దుటి యనురాగము స్మరించి మగ డాదరించు ననుకొనినది. కాని శాలీనుడు రెప్పలు విచ్చి చూడనైన లేదు. సుగాత్రి చేసికొనివచ్చిన నగల సింగార మతనికి నెక్కసముగా దోచినది. పాపము! గంపెడాసతో వచ్చిన సుగాత్రి కేమియు బాలువోవలేదు. ఇప్పుడైనను మగ డుదయమున దన్నేలుటకు, నిప్పు డొప్పరికించుటకు గారణ మామె యడుగలేదు. కడుందడ వుండియుండి నా చేసిన నేరమేమి యని తలపోసినది. తిరిగి యరుగ దలచినది. అక్కడే మాత్ర మెవ్వరున్నారుగనుక యని యూరడిల్లినది. దైవ మెట్లు పెట్టెనో యట్లగుగాక యని నిబ్బరించుకొనినది. తలుపుకడన నిలిచినది. శాలీనుడు పలుకలేదు. పలుకరించలేదు. ఆట కట్టిపోయినది. ఇరువురు కొంతకాలము మూగనోము పట్టిరి. సుగాత్రికిక లాభములేదని తోచినది. 'సాహసించి శాలీనుని కడ కేగినది.' కడు డ్రిమ్మటచే శ్రమమొందినారు గాబోలును! బోదునా! నిదురవోయెదరే యని కప్పురంపుదాంబూలముతావి భర్తను ముంచుకొనం జెవిదండ బల్కినది. నగల పొరువుచే గన్నులు మూతలుపడి పరాకునుండి యప్పుడప్పుడే తేరుకొని శాలీనుడు 'ఏ కోర్కెని వచ్చి' తని యడిగినాడు. ఇది యేమి ప్రశ్నము? ఈ ప్రశ్నము తోటలో సుగాత్రి తనకడకు వచ్చినప్పుడు తోపలేదేమి? సుగాత్రి యే మనగలదు? ఇక ననుట కేమున్నదిగనుక? అయినను వావిచ్చి 'లోకమువారలు పతికడకే కోర్కెని వత్తు' రని యడిగినది. ఇక నిలుపోపక 'పుణ్యసాధ్వికి గుణంబది గామి యెఱింగియు' తొలిమితూలి,

'అకటా! యేమని దూఱుదాన మిము నా
థా! వేగుజా మయ్యె జొం
దికగా బాదము లొత్త రమ్మనుటగా
నీ, యొంటి యేమోకదా
నికటక్షోణికి నేగుదె మ్మనుటగా
నీ! కొంత నెయ్యంపు బూ
నికతో గన్నులు విచ్చి చూచుటయొకా
నీ లేదొ కింతేనియున్.'

అని తూలనాడినది. శాలీనుని హృదయములో కదలిక లేదు. అతని ముగ్ధహృదయము ఆ తెచ్చిపెట్టుకొన్న సౌందర్యమున కున్ముఖము కాలేదు. కడుపులో లేనిది కౌగలించుకొనిన వచ్చునా? శాలీను డపు డొక చిగిరింత లేని మ్రోడు. అతని హృదయ మొక పలుగుఱాయి.

సుగాత్రియంతరంగమున గంతుసంతాపమంతకంతకు నతిశయించినది.

'రాయైన గొంత మేల్ నా
రాయణ మీ మనసుకంటె రహి నిక నెపుడున్
మీ యంత దడవదరొ' యని
యా యంగన యతని పాద మల్లన బట్టినది.

పానుపుకడ గూరుచుండి యూరువులపై యతని పాదముల నిడి యొత్తుచు గాటపు గూరిమిచే జన్కట్టున గన్నుల జెక్కిట జక్కనద్దికొనినది. అతిడు పరాకు విడువలేదు. సుగాత్రి కొందలపడి మఱల బలికినది.

'చిత్తము వేఱొకరైపయి
జేర్చి మరల్పగ నేరరేమొ! మీ
రత్తరళాక్షి దెచ్చుకొను
నాయక నా వశమైన బంపు జే
దెత్తు నవశ్యమున్ మఱియు
దేవరకుంబలెనె వ్యథాటికిం
దొత్తరుచున్ బనుల్ సలుపు
దున్ నిజ మాడెద దైవసాక్షిగన్.

(15-వ పేజీ చూడుడు)

గనోక్యూర్
రాజమండ్రి

మొన్నటి తుపానుగాలిలో

కృష్ణాగోదావరి జిల్లాల దుస్థితి

శ్రీ దుగ్గిరాల బలరామకృష్ణయ్య

విజయవాడనుంచి శ్రీ ఎ. జి. రంగాగారు,

నేను నవంబరు 1 వ తేదీ ఉదయము బయలుదేరి గుడివాడ ప్రాంతమునకు వెళ్లితిమి. గుడివాడవరకు రోడ్డు కిరువంకల గల పంటలను గమనించుచు, అటనట, కొరునాపి గ్రామములస్థితి – వరదనీటిక్రింద నున్న పంటల గతి, గాలిదెబ్బ తిన్న ఇండ్ల స్థితి విచారించితిమి. ఆకుటిండ్లు పూరిగుడిసెలు, మట్టిగోడలతో కట్టబడిన పెంకుటిండ్లున్నూ నేలకుంగినవి. గాలిదెబ్బచే కప్పులు ఎగిరిపోగా అధికవర్షముచే మట్టిగోడలు కరిగి చదికిలబడిపోయినవి. వరిపొలములకు సామాన్యమయిన దెబ్బ తగిలినది. గాలివలనమాత్రమే కోతకు సిద్ధముగా నున్న బసంగి మున్నగు పంట దెబ్బతిన్నది. పరవళ్లు త్రొక్కుచు ఎడాపెడా కొట్టిన గాలికి పండిన గింజలు రాలిపోయినవి. సుంకు పోసుకుంటూయున్న కంకులకు గాలి తాకిడివలన కొంతనలిగిపోయిన నష్టము కానవచ్చుచున్నది. ఈనవున్న వరి సరిగా ఈననందువలన నష్టము కలుగగలదు. ఈరీతిగ పామర్రు వరకు రోడ్డు కిరువైపులగల వరి పైరు యకరమునకు సగటున 5 బస్తాలనుండి 7 బస్తాలవరకు నష్టముండగలదు. అతివృష్టివలన వరికర్రలు నడుము విరిగి నేల కొరిగినవి. ఇంకను నీరు ప్రవహించుచున్నందున పల్లపుదొడ్లుగల గ్రామములలో యకరము 10 మొదలు 13 బస్తాలపయిన నష్టముండగలదు. నీటిలో పడియున్న వరి కుళ్లిపోవును. కాన పశుగ్రాసమునకు అక్కరకు రాదు. పంచదార చెరకుతోటలు గాలిదెబ్బవలన చిందరవందరగుటచే తగినంతటన్నే జిరాకుండపోగలదు. రోడ్డుప్రక్కవున్న బెజవాడ గన్నవరం తాలూకా గ్రామములు మెట్టపైరులను గోల్పోయినవి. పునాస పసిబిడ్డవంటి పంట యగుటచే పూర్తిగ దెబ్బతిన్నది. కందిపంట మంటగలిసిపోయినది. మిరపతోట ఉన్న ఆకు దూసివేయబడి, పుల్లలతో కళావిహీనమయి నిర్జీవముగా ఆకారమాత్రమునకు నిలచియున్నది. పసిబిడ్డలకంటె నాజూకుగా పెంచవలసిన వర్జీనియా పొగాకుతోటలు గాలి దెబ్బకంటె వర్షాధిక్యతవలన నాశనమయినవి. నాటబడి విలువగల యెరువులు వేయబడిన తోటలన్నియు దుంపనాశనమయినవి.

పొగనారు మళ్లునీరు నిలిచి విషవాయుతాకిడిచే మాడిపోయినవి. కొన్ని కుళ్లిపోయినవి. పొగాకుబారెన్లు అడుసుకట్టుడుతో నున్నవి నేలమట్టమయి అందులో నున్న ఇనుప పొయ్యిలతో సహా నాశనమయినవి. రేకులు గాలిదెబ్బకు ఫర్లాంగులమేరము వాయుమండలమున పయనించి వంకరలు తిరిగి చుట్టలుచుట్టలుగా నేలగూలినవి. సున్నపుకట్టుడుతో నున్న బారెన్ల కప్పులు కూలిపోయి, కొన్ని గోడలుపడి నష్టపడినవి. మామిడితోటలు చాలవరకు గాలిదెబ్బకు నేలకొరిగినవి. హెచ్చుచెట్లు విషపు గాలికి గురియయి ఆకులు మాడిపోయి మోడుబారిపోయినవి. సముద్రపు ఉప్పుగాలితాకుడువలన చెట్లు మాడిపోయినవి. పామర్రునకు సమీపగ్రామములు– బాడవపొలము హెచ్చుగానున్న పెదముద్దాలి–గొరివేపల్లి తాడేపర్రు. కొమరవోలు–అడ్డాడ పైరునష్టమునకు గురియయినవి. పొలములలో పైరులపయి నీరు నిలిచియుండుటచే పంటనష్టము వర్ణనాతీతము. ఈ గ్రామములలో మంచిమంచి విలువగల పశువులు మరణించినవి. కొన్నిచోట్ల పశుశాలలు కూలి నుంచి ఎద్దులు పాడిపశువులు మృత్యువాతను బడినవి. పామర్రునుండి గుడివాడ వరకుగల గ్రామములందలి పాకలు, పేదల నివాసములు కూలి యుద్ధభూమిని శ్మశానవాటికను స్మృతికిదెచ్చుచున్నవి. గట్టిభవంతులకు దెబ్బ లేదనియే చెప్పవచ్చును. పామర్రు–గుడివాడమధ్య కంకరరోడ్డు చాల నష్టమయినది. రమారమి 1 ఫర్లాంగురోడ్డు జలప్రవాహంక్రింద నుండుటచే రాళ్లు బయటపడినవి. రోడ్ల కిరువంకల చచ్చిన పశుకళేబరములు దుర్గంధవాయువుల జిమ్ముచు బాటసారులకు తీరని బాధను, సమీపగ్రామస్థులకు భరించరాని దుర్వాసనను కలిగించుచున్నవి. కొట్టములలో ఆశ్రయమును పొందని బక్కచిక్కిన పశువులు ఎముకలను కొరుకు చలితోగూడిన ప్రచండవాయుప్రహారముచే బాటలపైన పక్కలను బడి చచ్చినవి. లక్షలకొలది పక్షులు కుప్పతిప్పలయిపడి చచ్చినవి. గుడివాడ, గుడ్లవల్లేరు, పెడన, బందరు, కైకలూరు మున్నగు పట్టణములలో గల సినిమాహాలులు రైసుమిల్లులు చాల దెబ్బతిన్నవి. కప్పు లెగిరిపోయినవి. కొన్నింటికి గోడలు కూలినవి. నిలువధాన్యం, బియ్యమున్నూ తడిసి నష్టమయినవి. గుడివాడతాలూకాలోని పల్లపుగ్రామములు పెంజెండ్ర, కలవలపూడి, అంగలూరు, గుడ్లవల్లేరు, చంద్రాల, విన్నకోట, కూరాడ, డింటకుర్రు, కోడూరులలో నూటికి 75 వంతులు బాడవ వరిపొలములన్నియు కుంభవృష్టిచే వరదగా పారు నీటిక్రింద మునిగియున్నవి. పోలరాజుమురుగుకాలవ పొంగి, పంటకాలవలు తెగి పైరులను మరింత పాడుచేసినవి. ఈ కాలవ గుడివాడ, కైకలూరు తాలూకాలలో చాల ముఖ్యగ్రామముల మధ్య ప్రవహించుచున్నది. ఈ కాలువ కట్టలుతెగి ప్రవహించిన వరదనీరంతయు కొల్లేటి సరస్సులోకి ప్రవహించినగాని ఆయా పల్లపు మాగాణిగ్రామములకు చెందిన వరిపొలములలో రొమ్ములబంటి మురుగునీరు చేలబయటికి పోదు. మురుగుకాలువ చీమ నడక నడచుచున్నది. గుడ్లవల్లేరు, అంగలూరు గ్రామములలో చాల హెచ్చుగ పశునష్టమున్నది. గుడివాడ, బందరు, కైకలూరుతాలూకాలలో ప్రతిహరిజనవాడ నేలకొరిగినది. కొన్నిచోట్ల కూలిన హరిజనవాడలు నీటిలో నీదులాడుచుండుటయు కనపడినది. పెంకుటిండ్లు డాబాలున్నూ కొన్ని గ్రామములలో కూలినవి. గుడ్లవల్లేరులో ఇద్దరు, గొరివేపల్లిలో నొకరు చనిపోయిరి. గుడివాడలో 15 మందివరకు మృత్యువాత బడిరి. డాక్టరు నూరపనేని శ్రీరాములుగారి తమ్ముడు చలమయ్యగారి కొత్త డాబా కూలినది. ఇది రాత్రి జరిగినది. ఇంటి పూడికలో ఆయన అత్తగారు, కుమార్తె, మరియొకబంధుస్త్రీ ప్రాణముల గోల్పోయిరి. చలమయ్యగారి వదినెకుమార్తె 16 ఏండ్ల బాలిక, దూలం మీద పడుటచే గాయపడియుండగా దూలము తీసి రక్షించిరి. చికిత్స చేయగా ఆమెకు ప్రాణం వచ్చినది.

ఆ కాళకుహరమునుండి అవిరామముగ బాంబులవర్షము కురియునపుడు కలుగు ధ్వనితో గాలి వీచుటచే ప్రజలు ఎచట నున్నవారచటనే యిండ్లలో దూరి తెల్లవారులు గుండె లరచేత నిడుకొని జాగారము చేసిరి. ఇండ్లలో దాగొన్నవారు ఇండ్లు కూలియు, హెచ్చుమంది మరణింపలేదు. ఒకయింటినుండి మరియొక భద్రగృహమునకు ప్రాణాశతో పోదలంచి యింటి వెలుపలికి వచ్చినవారిని తుపానుగాలి 70 లేక 80 మైళ్ల వేగముతో వీచి వారిని యెత్తుకొనిపోయి వెంటాడి వేటాడినది. వారు చెట్లకు పుట్టలకు పోయి ప్రాణములను దక్కించుకొనిరి. ఎచ్చట గాలించినను ఇట్టి దృష్టాంతములే మాకు కానవచ్చినవి. దుఃఖితగ్రామీణులు యీ హృదయవిదారకమయిన పరిస్థితులను విప్పి చెప్పిరి.

మొత్తముమీద గుడ్లవల్లేరుఫిర్కాలోని గ్రామము లన్నింట పైర్లు తీరని నష్టమునకు గురియయినవి. గుడివాడఫిర్కాలో కొంతభాగము, తుపాను, వరదలకు, చాల నష్టపడినవి. గుడివాడ తాలూకాలోని నందివాడ ఫిర్కాలోగల ఒకటి రెండు గ్రామములుతప్ప, మిగిలిన గ్రామములన్నియు, నీటిలో మునిగి వున్నవి. కుదరవల్లి, విరివాడ, వెన్నెనపూడి, తుమ్మలపల్లి, రామాపురం, పుట్టగుంట, పెదలింగాల, మోపర్రు, వద్దులమరక, తమిరిశ, పల్లపుగొల్వేపల్లి, అనమనపూడి, మున్నగు గ్రామములలోని పేదలయిండ్లు పురాతనపు పెంకుటియిండ్లు సమూలముగ నాశనమైనవి. ముదినేపల్లి ఫిర్కాలోని చాల గ్రామములకు యిదే గతి పట్టినది. మేము గుడివాడనుండి ఏలూరురోడ్డుమీదుగా జొన్నపాడువరకు వెళ్లితిమి. రోడ్డు రమారమి 7 మైళ్లు సర్వనాశనమైనది. బుడమేటివరదలో జొన్నపాటినుండి, ఆరుగొలను మధ్య రోడ్డు 6, లేక 7 మైళ్లు రొమ్ములోతు నీటిక్రింద పడియున్నది. రాకపోకలు నిలిచిపోయినవి. గుడివాడనుండి ఆరుగొలను వరకు రోడ్డున కిరుప్రక్కలగల పైర్లు నీటిలో మునిగి సర్వనాశనమైనవి. రోడ్లప్రక్క, పశుకళేబరములు కుళ్లి కంపెత్తుచున్నవి. ముందునకు సాగిపోవుటకు వీలులేక వెనుదిరిగివచ్చి గుడివాడనుండి, కైకలూరు వైపునకు కారులో బయలుదేరితిమి. గుడివాడనుండి ముదినేపల్లివరకు రోడ్డున కిరుప్రక్కలగల ఇళ్లు తుపాను, వరద, దెబ్బలవలన మట్టుపెట్టబడినవి. పైరులు మాడిపోయి వున్నవి. రోడ్డుపైన రెండుమూడుచోట్ల వరదనీరు ప్రవహించుచు నాశనమైవున్న పైరులపైకి పొంగిపొరలిపోవుచున్నది. పోలరాజు కాలవ వరదనీటివలన పొంగి, ముదినేపల్లి రోడ్డును, గ్రామమును చుట్టుప్రక్కగల వరిపొలములను ఒకసముద్రముగ జేసివేసినది. పెదపాలపర్రు, మోటూరు, చిన్నపాలపర్రు, ముదినేపల్లి, గురజ, గ్రామములలో ఇళ్లు కూలిపోయినవి. ఈగ్రామములకు చెందిన మాలపల్లెలు నామరూపము లేకుండ గాలిదెబ్బకు నేలకూలి, వరదదెబ్బకు నీటగలిసిపోయినవి. రోడ్డుపొడుగున, పశుకళేబరములకు అంతు లేదు. ఈగ్రామములలో వకరు, యిద్దరు, చనిపోయినట్టు, విచారింపగా, తెలిసినది. ముదినేపల్లిలో పది, పన్నెండుగురు, చనిపోయినట్టు వార్త. యిచటగల టూరింగు సినిమా డేరా లెగిరిపోయినవి. గురజగ్రామములో, పదిపన్నెండుగురు మరణించిరి. ముదినేపల్లిరోడ్డు నుండి, బందరుతాలూకాలోని బంటుమిల్లివరకు గల గ్రామములు తుపాను, వరదలకు సర్వనాశనమైనవి. పైరులపైన, నిలిచిన నీరు సముద్రకెరటములవలె, కొట్టుకొనుచున్నది. శింగరాయపాలెం మొదలుకొని, పెదతుమ్మిడిపై వరకుగల మురుగుకాలువలు, రోడ్డు, వరిపొలములు ఏకజలఖండమైపోయినవి. కొరగుంటపాలెములో, పశునష్టముహెచ్చు. నలుగురైదుగురు, మనుష్యులు, మృత్యువాతనుబడిరి. పెదగొన్నూరులో, కాజ ఉమామహేశ్వరరావుగారను భూస్వామి తాలూకు పశుశాల కూలిపోయినది. యెనిమిది జతల యెడ్లను సంరక్షించుటకై చావడిలో ప్రవేశించిన నలుగురు నౌకరులు యెనిమిది జతల యెడ్లు నిలువునా మరణించుట తటస్థించెను. ఈగ్రామములో మరికొందరు మరణించిరి. శింగరాయపాలెంలో పేరరాజుగారను ప్రయివేటు డాక్టరుగారు కట్టించిన షెడ్డులు కూలి 17 గురు పేషంటులు మృత్యుముఖమునబడిరి. మరి యెనమండుగురు యీగ్రామముననే మరణించిరి. ఈప్రాంతమంతయు జలమయమై, రోడ్లు, నీటిలో మునిగియున్నందున రాకపోకల సౌకర్యము లేక గ్రామ గ్రామమున అసువుల బాసిన వారి వివరములు తెలియవచ్చుటలేదు. కాని కర్ణాకర్ణి వచ్చు వార్తలవలన గ్రామ గ్రామమున మృత్యుదేవత తాండవించినట్లు స్పష్టపడుచున్నది.

మేము తిరిగి ముదినేపల్లినుండి కైకలూరు ప్రాంతమునకు బోయితిమి. ముదినేపల్లి పడవల కాల్వలో కొట్టుకొనిపోవు పశుకళేబరములను రోడ్డుమార్జినులో నీటిలో కుళ్లుచున్న పశుకళేబరములను చాల హెచ్చుగా చూచితిమి. రోడ్ల కిరువంకలకాలువ కట్టలపైనగల ముప్పది నలుబదేండ్లవయస్సుగల మహావృక్షములు, నేలగూలుటో, లేక అగ్నికీలల దాకి మాడిపోయినట్లుండుటో తటస్థించుట చూచితిమి. పెద్యేరు, దాకరం, మున్నగు గ్రామములలో, యిండ్లు కూలి పశువులు చచ్చినవి. పంటలు నీటమునిగియున్నవి. ఈప్రాంతమంతయు నూటికి తొంభైపాళ్లు నష్టము. ఈ గ్రామములలో నలుగురైదుగురు మరణించిరి.

కొనుకొల్లు దృశ్యము హృదయవిదారకము. అయిదు వేల జనాభాగల ఈ గ్రామములో అయిదారిండ్లు తప్ప సమస్తగృహములు నేల గూలినవి. గ్రామవీధులన్నింట తొడలలోతున నీరు ప్రవహించుచున్నది. పశుమృతకళేబరములు గ్రామముచుట్టూ నున్నవి. ఈ గ్రామమును వరదకంటె, తుపాను సర్వనాశనము గావించినది. యిండ్లలో దాగినవారిలో వక్కరైనను మరణించలేదు. గట్టి భవంతులలోచేరి తలదాచుకొనదలచిన 26 గురు దిక్కుమాలిన చావు చచ్చిరి. తమ యింటినుండి బయట కాలిడినంతనే వాయుదేవత వారిని అమాంతముగా యెత్తుకొనిపోయి రోడ్డున పెట్టి, చెట్లనుపెట్టి కొట్టి చంపి, వరద నీటిలో దొర్లించివేసినది. ఒక యింటిలోని భార్య, భర్త, బిడ్డ గాలికెగసిపోయి ఊరుబయట పడవల కాలువయొద్దున నున్న సరుకుచెట్లలో యిరుకుకొనిరి. మరొక్క గాలివిసురునకు తండ్రి, బిడ్డ కొట్టుకొనిపోగా తల్లిమాత్రము చెట్ల సందులలో యిరుకుకొని స్మృతితప్పి పడియుండగా, మరునాడు సంరక్షింపబడినది. మొఖాసా కల్వపూడిగ్రామములో తండ్రి, పండ్రెండేండ్ల కుర్రవానిచెయ్యి గట్టిగా పట్టుకొని గట్టియింటికి పోవుటకు యింటి బయట కాలుపెట్టగనే పెనుగాలి బిడ్డనొక్క గుంజుగుంజి యెత్తుకొనిపోయి చంపివేసినది. మండపల్లిలో ఒక తల్లి, చంటిబిడ్డ, పదిసంవత్సరముల కుమారుడు తమ యిల్లు కూలుచుండుట చూచి డాక్టరు ఇంటికి రా ప్రయత్నించగా, కుర్రవానిని పెనుగాలి యెత్తుకొనిపోయి చంపివేసినది. కల్వపూడి పుట్లచెరువు, శింగనపూడి, పేరూరు, వునికిలి, పోటికొండ మున్నగు గ్రామములన్నియు నీటిలో జేలియాడుచున్నవి. ప్రజలు పడవలపై రోడ్లకు చేరుచున్నారు. ఈ ప్రాంతమందలి పైరులు మురుగుకాలువలు కొల్లేరు ఏకమైపోయినది.

పల్లెవాడ మొదలుకొని ఆటపాక, తక్కెళ్లపాడు, పులపర్రు మున్నగు గ్రామములు కొల్లేటిలోగల సమస్తగ్రామములు ఉప్పుటేరు ఒడ్డునగల గ్రామములు జలమయమైపోయినవి. లంకలలోని చావగా మిగిలిన పశువులతో నిరుపేద రైతులు, కూలీలు మండవల్లి గ్రామము మొదలు కైకలూరువరకు రోడ్డుప్రక్కలనే నెత్తిపై మోసికొనిరాగల సామగ్రితో నిన్న పడవలపై వచ్చి ప్రాణముల గాపాడుకొనుచున్నారు. కైకలూరుతాలూకాలో నూటికి యెనుబదిగ్రామములు గాలిదెబ్బకు హెచ్చుగా వరదదెబ్బకు, పంటలతోసహా, అపార పశునష్టముతో మనుష్యప్రాణనష్టముతో ఆహుతిఅయిపోనవి. జిల్లా కలెక్టరు డెప్యూటీ కలెక్టరు డెప్యూటీ పోలీసు సూపరెంటెంటులకు నిరాహారులకు కార్మికులకు నిరుపేదలగురైతులకు తిండికై వెంటనే బియ్యము సప్లయిచేయవలెనని విన్నవించితిమి. ఉద్యోగస్థులు, ముఖ్యముగా జిల్లాకలెక్టరు శక్తికొలది శ్రద్ధగైకొనుట మిక్కిలి సంతోషము. కాని యిది చాలదు. పెదతుమ్మిడిలో 20 మంది చనిపోయిరని తెలిసినది. బందరుతాలూకా గ్రామము లన్నియు కూలిపోయిన పేదల యిండ్లతో, మునిగిపోయిన పైరులతో, పడిపోయిన మాడిపోయిన చెట్లతో, కుళ్లి కంపెత్తుతున్న పశుకళేబరములతో గుడివాడ కైకలూరు తాలూకాలవలెనే బీభత్సముగ నున్నవి. పెడన, బందరుపట్టణములకు అపారనష్టము.

కొల్లేరుపరిసరస్థితి

ఆటపాకనుండి, కొల్లేరుఒడ్డునకు పోయిన తనిఖీచేయగా కొల్లేటియొద్దున నున్న యావత్తు మాగాణిభూములు ఆరేడుమైళ్ల వెడల్పున 20 మైళ్లపొడువున, కొల్లేరైపోయినవి. కొల్లేటికి,

(18 పేజీ-చూడుడు)



తుపాను బాధితులకు సహాయంచేసే విషయంలో రాష్ట్రసంఘంవారు చేసిన సూచనలను సుముఖంగా ఆలోచించగలమని హామీ ఇస్తున్న రాష్ట్ర మద్యనిషేధ మంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారు.



రాష్ట్రకాంగ్రెస్ జాయింటు కార్యదర్శి శ్రీ దుగ్గిరాల బలరామ కృష్ణయ్యగారు కోస్తాజిల్లాల తుపానుపై కార్యవర్గం చేసిన తీర్మానాన్ని సర్వసభ్యసమావేశంలో ప్రతిపాదిస్తున్నారు.

ఆంధ్రదేశంలో తుపాను, వరదలు

కొల్లేరు సరస్సుప్రాంతప్రజల ఇక్కట్లు: ప్రభుత్వకర్తవ్యం

(మా విలేఖరి)

[శ్రీ యం. చంద్రశేఖర్]

పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల రెండింటి మధ్యలు సుమారు 240 చదరపు మైళ్ళ వైశాల్యము నావరించి కొల్లేటి సరస్సున్నది. దీనిని సరస్సు అని వాడుకలో అంటారుగాని అంత కంటే ప్రకృతిలో ఏర్పడిన పల్లపుభూమి అంటే బాగా తెలుస్తుంది.

కృష్ణా పశ్చిమ గోదావరి జిల్లాలలోని అదనపు వర్షపునీరు నైజాం ప్రాంతంలోని, అదనపు వర్షపునీరు అనేక పెద్ద, చిన్న వాగులగుండా ఈ సరస్సులోకి ప్రవహిస్తుంది. మొన్నటి తుపానులో కృష్ణాజిల్లా అంతా బీభత్సంచేసిన బుడమేరువరద, కట్టలు తెగి అఖండంగా ప్రవహించిన చెరువుల నీరు, తమ్మిలేరు, ఎర్రకాలువ మొదలైనవాని వరద లన్నింటినీ, కొల్లేరు తన గర్భంలోకి ఆహ్వానించి పొంగుతుంది. ఈలా బహుముఖాలుగా వచ్చిన అనంతమైన జలసముదాయమంతా జారీచెంబుగొట్టంవలె ఉన్న ఉప్పుటేరు అనే కాలువగుండా సముద్రంలోకి పోవాలి. ఈ కొల్లేరు ప్రాంతంలో అచ్చటచ్చట ఎత్తయిన లంకప్రదేశాలలో సుమారు 50, 60 గ్రామాలు ఉన్నవి. వానిలో నివసించే వారందరూ వడ్డెలు, పల్లీలు అనే చేపలపట్టి జీవించే ప్రజలు. ఈ కొల్లేరు ప్రాంతంలో, ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోనే 31000 ఎకరాలు వరి సాగుచేయబడుతుంది. ప్రతి సంవత్సరం అంతో ఇంతో కొల్లేటికి వరద వస్తుంది కాని కొల్లేటి గ్రామా లన్నిటినీ సాధారణపు వరదలు అట్టే బాధించవు.

కాని ఈ సంవత్సరం వచ్చిన వరద కొల్లేటి నివాసుల స్మృతిపథంలో ఇదివర కెన్నడూ రాలేదు. పి. డబ్ల్యు. డి. వారి లెక్కలప్రకారం కూడా ఇదివరకు 9 అడుగులు (సముద్ర మట్టమునకు) మించి వరద రాలేదు. ఈ సంవత్సరం 10. 5 అడుగులు వచ్చినది. తుపానుగాలివీచిన 27-వ తేదీనాటికి, కొల్లేటిలో అట్టే నీరు లేదు. 5. 6 అడుగుల నీరుమాత్రమే ఉంది. తుపానుకు ఆప్రాంతంలో సర్వజన సామాన్యమైన జమ్ము, రక్కసతో వేసిన యిండ్లలో దాదాపు అన్నీ నేల కూలడమూ కప్పులన్నీ ఎగిరిపోవడమూ జరిగింది. తిరువాత, ప్రజలు మళ్ళీ ఆ ఎగిరిపోయిన జమ్ముతోనే యిండ్లు కప్పుకొనడం, బాగుచేసుకొనడం ప్రారంభించారు. 30-వ తేదీవరకూ, వారికి రానున్న ప్రమాదం తెలియనే లేదు. ఆనాటినుండి, కొల్లేరులో నీటిమట్టం అతిత్వరగా పెరగనారంభించింది. 2-వ తేదీ రాత్రికే 10. 5 అడుగులవరకు వచ్చింది.

ఈ వరదవలన, నష్టపడిన గ్రామ లన్నిటిలోకీ మెరకగ వున్న అగడాల్లంక గ్రామంలో వడ్డీలు, యితర కులాలవారి యిండ్లు సుమారు 350 వరకు ఉన్నాయి. హరిజనులు, క్రైస్తవుల యిండ్లు 150 వరకూ ఉన్నాయి. వీనిలో రెండేరెండు యిళ్లు తప్ప మిగిలిన యిండ్లన్నీ 4 మొదలు 5 అడుగులలోతు నీటిలో ఉన్నవి. తుపానుకు కప్పులు ఎగిరపోతే, ఈ వరదనీటికి, గోడలు నాని, 1(0 కి 90 యిండ్లు కూలిపోయాయి. గ్రామం మొత్తం అంతా యిండ్లను ఖాళీచేసి, 6 గజముల వెడల్పు, 200 గజముల పొడుగూ గల చెరువుగట్టుమీద, అదేవిధంగా మునగకుండా మిగిలియున్న ఆగడాల్లంక కాలవగట్టుమీద కాలంగడుపుతున్నారు. గ్రామజనాభా వెయ్యిపైగా ఉంటుంది.

మేము వెళ్లిన పడవ సరాసరి ఊరి వెలుపల వరిపొలాలగుండా లంకకాలువలోంచి గ్రామంలోకి వెళ్లి గ్రామవీధులగుండా స్వేచ్ఛాప్రయాణం చేసింది. కొల్లేరంతా జలార్ణవ మవడంవల్ల ఎచ్చటా నిలవ నీడ లేనందున ఆప్రాంతంలోని నక్కలూ, పాములూ, ఈ పడిపోయిన యిండ్ల కప్పులమీద స్థావరా లేర్పర్చుకున్నవి. కొన్ని కొడెత్రాచులు ఆకులన్నీ రాలిపోయి పడకుండా మిగిలిన చెట్లకొమ్మలమీద ఎండకు కాగుతూ కనుపించినవి. గ్రామంమొత్తంమీద, రెండు ఇండ్ల యజమానులు తమ యిండ్లలో నివసిస్తున్నారు. వీరు వరద యిండ్లలోనికి జొరబడకుండా యింటి చుట్టూ అధికశ్రమతో గట్టు వేసికొని, రాత్రింపగళ్ళు నిద్రలేకుండా ఆ గట్లనే చూసుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. చుట్టూఉన్న నీటిమట్టం వారి యింటి మట్టానికంటే 3, 4, అడుగుల ఎత్తున ఉంది. ఎక్కడైనా గట్టకు గండిపడిందంటే, అంతటితో ఆ యింటి పని సరి. ఈ రెండిండ్లలోనూ 20 కుటుంబాలవారు తల దాచుకున్నారు. పశువులు నిలుచునేందుకు మిగిలినది గజన్నర వెడల్పుగల, కాలువ రెండవగట్టు. ఇంకా గట్టుమీద గ్రామప్రజలంతా తాత్కాలికంగా నాల్గు గడలు అడ్డు పెట్టుకొని వానిమీద జమ్ము, గడ్డి, పరచి ఒక్కొకదానిలో 5, 6 కుటుంబాల చొ॥ కాలం గడుపుతున్నారు.

ఇక పంట సంగతి వేరే చెప్పనక్కరలేదు. గ్రామం తాలూకు వరిపంటయావత్తూ 3, 4 అడుగుల నీటిలోపల ఉంది. పడవమీద వెడుతుంటే అక్కడక్కడ తేలి కనపడే వరికంకులనుబట్టి అది వరిపొల మనుకోవాలిగాని, లేకపోతే పైకి అంతా జలమయంగానే కనిపిస్తున్నది.

తుపానువల్ల, వరదవల్ల జిల్లాలోని యితర ప్రాంతాలలోని ప్రజలు నానాబాధలు పడ్డారు. బుడమేరువరదయైనా, వచ్చిన వారంరోజులకు తగ్గిపోయింది. మళ్ళీ ఆ ప్రాంతం అంతా పొడినేలగా మారి, ప్రజలు తమతమ కార్యకలాపాలు నెరవేర్చుకోగలుగుతున్నారు. కాని కొల్లేటి గ్రామాల ప్రత్యేకత, ఈ వచ్చినవరదా యింకా నెల, నెలపదిహేను రోజులవరకూ తగ్గదు. రోజుకు అంగుళం, అరంగుళం చొప్పున మాత్రమే తగ్గుతూంది. ఇతర ప్రాంతాల ప్రజల బాధలు గట్టెక్కినవి. ఈ ప్రాంతాల ప్రజల కడగండ్లు ప్రారంభమైనవి. నెలరోజులవరకు, గ్రామంలో అడుగు పెట్టే యోగ్యత వారికుండదు. కూలోగా వారు తమ తాత్కాలిక నివాసంలోంచి అడుగు బయటపెట్టాలంటే పడవలోనో, లేక బుర్రదోనె (తాడిచెట్టు లోపల దొలిచి పడవక్రింద ఉపయోగించుట) లోనే కాలు పెట్టాలి.

ఈయేడు వరిపంట అంతా పూర్తి నష్టమని చెప్పవచ్చును. చివరకు రెండవపంటనిమిత్తం, వారు పండించుచున్న రెండవపంట విత్తనపు చేలుకూడా గంగాప్రవేశం అవడంవల్ల. విత్తనం లేనిదే రెండవపంట పండించడం ఏలా అనే ప్రశ్న ఉదయించింది. ఆగడాల్లంకకూ, బయట ప్రపంచానికీ ఒకే ఒక భూసంబంధమైన త్రోవ యైన లంకకాలువ గట్టుమీద తుమ్మ చెట్లు అడ్డంగా పడిపోయినవి. అవి, కాలువగట్టే కాకుండా, కాలువలోకూడపడి, కాలువకూడా ప్రయాణమున కనుకూలము కాకుండా చేసినవి. ఇప్పటికి, యిదిజరిగి 10 రోజులైనా, ఎవరూ మార్గాన్నిగాని, కాలువనుగాని రహదారి కనుకూలంగా చేసే ప్రయత్నం కన్పడదు.

ఈ లంకల దుస్థితి పరిశీలించుటకూ, వారికి అవసరమైన సహాయం చేయుటకూ, నిన్న ఉదయం ఏలూరు డిప్యూటీకలెక్టరు ఎం. కరియప్ప, ప్రొబేషనరీ డిప్యూటీకలెక్టరు బాలసుబ్రహ్మణ్యం, తహసీల్దార్, కె. వి. రెడ్డినాయుడు, తాలూకా సప్లై ఆఫీసర్, ఎన్. టి. ప్రసాదరావు, పెద్దిరెడ్డి సత్యనారాయణగార్లు ఏలూరునుండి బయలుదేరివెళ్లారు. త్రోవలో పోతునూరు దోసపాడు రైతులు తుపానుదెబ్బకు అదివరకే అధికంగా నష్టపడియున్న తమ వరి చేలన్నీ, కొల్లేటివరదవలన పూర్తిగా మునిగిపోయాయనీ, మిగిలినపంటయైనా, నీటిలో మునిగిన కంకి గురకచేపవలనా, పైనఉన్న కంకి

(18-వ పేజీ చూడుడు)

గర్భ నిరోధిని


శరీరారోగ్యమునకు భంగంలేకుండ కొంత కాలమువరకు గర్భం రాకుండ ఆపుటకు ఔషధం రు. 10 లు. చాలాకాలంవరకు రాకుండ చేయుటకు రు 25 లు. వి. పి. చార్జి రు 1-0-0 లు.

పుంస్త్వ వర్ధని తైలం


నరములు బలహీనత చెంది సంతోష సౌఖ్యములకు దూరమై దుఃఖించువారల పాలిట వరప్రసాదిని మా నపుంసక తైలం. 1 సీసా రు. 10 లు. వి. పి. చార్జీ రు 1-0-0 లు మరియు నేపాళదేశపు కస్తూరి, అంబర్ హేమం కలసి ప్రత్యేకంగా తయారుచేయబడి జగత్ప్రఖ్యాతి వహించిన తైలము గలదు. సీసా 1 కి రు 25 లు. వి. పి. ఛార్జీ రు 1. ఆర్డర్లిచ్చువారు ముందుగా పైకం పంపుచూ జవాబుకు కవరు పంపేది.

డాక్టర్ రత్నం సన్సు,
మలకపేట బిల్డింగ్స్, హైద్రాబాద్, దక్కన్.

కొల్లేటిలంక ప్రజల దీనావస్థ




ఇల్లు ఎగిరిపోగా, స్థలమంతా నీటమునిగిపోగా పశువులు నిలచుండుటకైనా స్థలం దొరకక అల్లాడుతున్న ఆగడాల్లంక గ్రామస్థులు.



పూర్తిగా నీట మునిగిపోయిన ఆగడాల్లంక గ్రామం - గ్రామస్థులు పడవలమీదనూ, దోనెల్లో నివాసాలు ఏర్పరచుకొన్నారు.




తోకపల్లి చిన్నింద్రకొలను గ్రామముల హరిజనవాడలు




ఆముదాలపల్లిలో (తాడేపల్లి తాలూకా) పశువులశాలలు-పడి 12 పశువులు మరణించినవి.



కొల్లేటి లంకలో, ముంపువలన బాధితులగు కుటుంబముల స్థితిగతులు విచారించి, వారికి సహాయమును సమకూర్చుటకు మునిగిపోయినవరిపొలముల మీదుగా బోటులో వెళ్లుచున్న అధికారులు. శ్రీ ఎం. కరియప్ప, ఏలూరు డిప్యూటీ కలెక్టరు, ఎస్. బాలసుబ్రహ్మణ్యం, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్, కె. వి. రెడ్డినాయుడు తహసీల్దార్, ఎల్. టి. ప్రసాదరావు, తాలూకా సప్లయి ఆఫీసర్, పెద్దిరెడ్డి సత్యనారాయణ, జిల్లాబోర్డు మెంబరు.



6 రోజులుగా నీటిలో మునిగియున్న కేదారం గ్రామం.



కొల్లేరు తోకపల్లి గ్రామములు ఈ జలరాశిక్రింద వరిపైరులున్నవి.



చావగా మిగిలిన పశువులు నిలువనీడలేక అల్లాడుతున్నవి.

★ తెలుగుదేశంలో




ఆరుగొల్లు—పడని పూరికొంపలేదు—పగిలిపోని కుండలేదు—నీరు ప్రవేశించని స్థావరములేదు.
అచ్చటచటా కాలువెట్టుటకు రోడ్లు ఉపకరించినవి. అచటనే సంసారములు.



నిరాధారులై గుడివాడచేరిన ఇరవైవేలప్రజకు శ్రీ అడుస




తుపాను తర్వాత ఆరుగొల్లు (గుడివాడ, ఏలూరురోడ్డు) ప్రళయశోభ



గుడివాడ-నూజివీడు రోడ్డుపైనున్న ఆరుగొల్లులో మంత్రి చంద్రమౌళికి కనుపడినదల్ల
ఆలగోడు, శాలగోడు.





విశాఖపట్నంలో వెలంపేట, హార్బరురోడ్డు, చౌదారోడ్డుప్రాంతాల్లో ఆరడుగుల నీరు రావడంవల్ల దాదాపు 5000 మంది ప్రజలు నిరాశ్రితులైనారు. ఒకధాన్యం మిల్లులోపల నాలుగడు


తుపాను నష్టాలు ★




ల్లి వెంకటసుబ్రహ్మణ్యంగారు అన్నదానం చేస్తున్న దృశ్యం.



ఆరుగొల్లు—నిలువ 'నీడలేదు'



అఖిలభారత కాంగ్రెసు కార్యదర్శి శ్రీ కళావెంకట్రావుగారు ఈ నెల 2, 3, 4 తేదీలలో తుపానుకు గురియైన తూర్పుగోదావరిజిల్లా ప్రాంతాల పర్యటించి, నష్టవివరములను తెలుసుకొని సహాయపు కార్యక్రమంగూర్చి స్థానికప్రముఖులతో చర్చలు జరిపిరి.



బందరు రైల్వేస్టేషన్ సమీపంలో వరదవల్ల కొట్టుకొనిపోయి, వంతెన. స్టేషన్ నైపునుంచి మరమ్మతు చేయుటకై బాలస్టుబండికూడా దాపుకు వచ్చుటకు వీలులేకుండా ధ్వంసమైనది.




నిలచిపోవడంవల్ల ధాన్యంబస్తాలు చాలాపాడైపోయినవి.



నర్సాపురంలో తుపానువల్ల మార్కెటు కూలిపోయింది. ఉప్పుగాలికి చెట్ల ఆకులు మాడిపోయి మోడులైపోయినాయి.


తెలుగుదేశంలో తుపాను నష్టాలు




24 గురి ప్రాణములను బలిగొనిన పేరవల్లి చెరువుకట్టకు పడినగండి.




ముదినేపల్లిలో తుపానుచేసిన విధ్వంసము—ఇక్కడ 24 మంది అభాగ్యులు మరణించిరి.




గుడివాడ—కైకలూరు రోడ్డు రాకపోకలను స్తంభింపజేయుటకూడా
తుపానుశక్తియొక్క దుశ్చర్యలలో నొకటి.




కైకలూరు-గుడివాడ తాలూకాలలో ఇటువంటి దృశ్యాలు
అడుగడుగునా కనుపడినవి.



ఇచట గ్రాండుట్రంకు రోడ్డుకూడ రూపులేకుండ పోయినది.



గుడివాడలో—



గుడివాడలో—ఇంటిపై కప్పు ఎగిరిపోయి, గోడ కూలినది.



నర్సాపురంలో సముద్రకెరటంవల్ల దెబ్బతిన్న యిళ్లు—కెరటం నీరు.

కథానిక



'ఇదుగో! ఇక నీయిష్టం. ముందుగానే చెబుతున్నా. మంచిగా వెళ్ళు. వెళ్లకుంటే బయటికి గెంటేశక్తి, అధికారం వుందన్న సంగతి మర్చిపోవాకు. ఎక్కడికన్నా - ఎవడితోనన్నా లేచివెళ్లినా నా కిష్టమే. ఫలానావాడి భార్య లేచివెళ్లిందంటే వెళ్లిందని గుంపులు, గుంపులుగా కూడి, చెప్పుకొని నవ్వినా, నాకు చిన్నతనం లేదు. ఎంతగా మొత్తుకున్నా పిల్లవాణ్ని యిచ్చేది కాదు. ఇప్పుడు నా క్కావాల్సింది నీవు ఈ యింట్లో లేకపోడమే. బ్రతుకుని బజారుపాలు చేసుకోక, అధికంగా కోపం తెప్పించక మంచిగా వెళ్లు. ఊఁ! వెళ్లు'

కొప్పుపట్టుకొని ఒక్క నెట్టు నెట్టాడు సూర్యనారాయణ నీచుడు ఎంతకు తెగించాడు.

పాపం! నాంచారమ్మజీవితం ఈ రూపంలోకి వచ్చింది. గోడ తగిలి బలంగా దెబ్బతగిలినమాట వాస్తవమేకాని, అంచక్కగా నుద్దుబు మూటకట్టే మేమంతా ఎర్రగాకంది, నొసలుకు చిన్నరాయి తగిలి నెత్తురు కారుతోన్నా, ఆమెకు నొప్పనిపించకపోడానికి, ఈకొట్టడాలూ, తిట్టడాలూ, తను తరుచూ యిటువంటి దెబ్బలు తినటాలూ దాదాపు రెండు నెల్లనుంచి జరుగుతున్న రభసేగాబట్టి, ఒకవేళ నొప్పి పుట్టినా, పుట్టినట్టు అనిపించలేదనొచ్చు.

సూర్యనారాయణకళ్లు చింతనిప్పుల్లాగ, కుంకుమపువ్వులాగ వెలుగుతున్నాయ్! చిత్రమేమంటే, అంత మహోగ్రంలో అతను చేయదలచుకున్న పని మర్చిపోతాడు. కాలం వెనక్కు నడుస్తున్నట్టు గమనిస్తాడు. జీవితం ఎదురు తిరుగుతున్నట్టు భ్రమిస్తాడు.

ప్రధానంగా అతను వూహించిం దేమంటే, ఏదో విధంచేత ఈ భార్యను కాస్త వదలి మరొకక్కని కళత్రాన్ని చూసుకుందామని. ఈ వూహ రెండునెల్లక్రితమే జనించింది. అప్పటినుండీ భార్యను చెండుకు తినడం మొదలెట్టాడు. ఏ భర్తా కొట్టలేనన్ని, కొట్టటానికి చేతులు రానన్ని దెబ్బలు కొట్టడం, భేదరించుకోడం ఆరంభించి, అప్పుడు పూర్తిగా చంపేందుక్కూడా వెనుకాడని స్థితిలో వున్నాడంటే అతన్ని దేంతో పోల్చి చెప్పాలి?

అకారణంగా వెళ్లగొట్టేందుకు అతని మనస్సు ఒప్పనిమాట నిజమే కావచ్చు. అంతమాత్రంచేత, ఆవరసని, చచ్చేదీ బ్రతికేదీ ఎరక్కుండా భార్యని చావమోదటం ఆ వూళ్ళో ఏఒక్కడూ కనీసం అతను 'తనవేపు, తనకు ఊతంయిస్తో, అండగా వుంటున్నారని అనుకొనే కొందరు కూడా ఈ పైశాచికదారుణకృత్యానికి హర్షించలేరు. అలాగని 'ఇది తప్పురా! ఎవడన్నా అకారణంగా భార్యని చావమోదుకుంటాడుట్రా, పిచ్చివాడు గాకపోతే,' అని అనన్నా లేదు. ఇది మరీ విపరీతంగా తోచినా విపరీతమని అనుకొనేవాళ్లు లేరు. చెప్పినా వినడనుకొని చెప్పకపోడం సమంజసం కాదనుకొనేవాళ్లు యిదంతా మన కెందుకు, వాళ్లు క్రింద పడితే మన కెందుకు, పైన పడితే మన కెందుకు అని తలపోస్తారు.

ఇందరి చేతుల్లో ఆమెజీవితం దుఃఖప్లావితమౌతోందని అనుకోటానికి వీల్లేదుకాని, భర్త చేతుల్లో - అని అనడం సుళువు.

'ఈ అష్టకష్టాలూ పడేకన్నా, నానాతిట్లూ తినేకన్నా వాడిదగ్గర్నుంచి పోతే యేం' అనేవాళ్లూ వున్నారు, 'అసలు చస్తే యేం' అనేవాళ్లూ వున్నారు. నిజానికొస్తే ఆమె యిక్కడనుంచి వెళ్లి బావుకొనేది ఏమీ లేకపోగా జీవితం దుర్భర మవుతుంది. అసలు ఆమాటకొస్తే ఎక్కడికి కెళుతుంది? అమ్మా నాన్నా చనిపోయి

శ్రీమతి సులోచన

దాదాపు పదిసంవత్సరాలు కావస్తోంది. అప్పలుగాని, చెల్లెళ్లుగాని, అన్నలుగాని, తమ్ముళ్లుగాని, మరెవ్వరైనాగాని 'నా'అనే వాళ్లు లేరు. అటువంటి క్లిష్టపరిస్థితుల్లో చావే మేలో, బ్రతకటం ఎందుకు మేలు కాదో ఆమె విచారించలేదు. ఆమెకు 'చావు' మీద భయం లేదు. కాని అక్కడొక కిటుకు వుంది. తన కుమారుణ్ణి, ముద్దుల కుమారుణ్ని, మూడు సంవత్సరాలు ముచ్చటగా పెరిగిన కుమారుణ్ని, అంచక్కగా... ఆ పాలబుగ్గలవాణ్ని చంపేస్తానంటున్నాడు. గొంతు పిసికి బావిలో పడవేస్తానంటున్నాడు. రాత్రిపూట రైలుక్రింద తలకాయ పెడతా నంటున్నాడు. అలా చంపేందుకు తనకి భయం, జాలి లేదంటున్నాడు. అందుకు ఆమె బ్రతకాలని కోరేది. అంతేగాని భావిలో ఆశలు దాచుకొని గాదు. తన పిల్లవాణ్ని రక్షించుకొనేందుకే. పిల్లవాణ్ని యిస్తే, ఈ యింట్లో క్షణంసేపు వుండదు.

కాని పిల్లవాణ్ని ఈయ నంటున్నాడు. ఇంకా యిప్పుడు బాగా అడ్డు రాకపోయినా, ముందు వాడు అడ్డు రాక తప్పదుగనక...... అసలు వాడుంటే చాలావిధాలుగా చిక్కట: తల్లిదగ్గరుంటే పెంచలేదట, తనదగ్గర అసలు పనికేరాడట, తను చేసుకొనే పిల్లకి వీడు ఆటంకమట: పిల్ల నివ్వరట— ఎంత స్వార్థం.

బాల్యమైతే అతనికీ, ఇకా ఇతరులకీం మంచిచెడలు తెలీకపోవచ్చు—కాని లోకంలో 'మంచి' అనేది మరుగుపడకుండా తరుచూ తీవ్రంగా బయటపడుతో, ప్రజలకు జీవితంలో, మానవత్వంలో ఒక గట్టి నమ్మకం కలిగిస్తోంటే, 'చెడు' అనే పదార్థం ఎంతదాకని దాగుతుంది.

పాపం! పిల్లవాణ్ని తీసుకెళ్లడానికే ఆమె యిన్ని తన్నులూ, గుద్దులూ తినడం. కాని ఆ కఠినుడు ఈయనంటున్నాడు. పైగా: వాడివల్ల నీకు సుఖం వుండదు. ఒక్కదానివైతే హాయిగా ఒంటరిజీవితం అడుక్కుతినైనా గడపొచ్చు. నా మాట విను. ఏదో అనుకొంటున్నావుగామోను, అవేమీ చెల్లవు' అనికూడా అన్నాడు.

దాని కామె చేసే దేమీ లేదు—మళ్ళీ మళ్లీ విచారించడంతప్ప. మసకమసగ్గా జాలి జూపే విషయాల సత్యాలకోసం మెదడుకు పనిగల్పించటం ఆమెకు నచ్చదు.

నవమాసాలు గర్భం మోసి, కష్టంతో కని, ముద్దులుతో మూడు సంవత్సరాలు పెంచి, పిల్లవాడి భావినిగూర్చి అనంతంగా కలలు కని, సంతృప్తి చెంది, ఇవాళో రేపో—పొగలు కక్కుకొంటూ రాక్షసిలాగ వొచ్చే రైలు... పట్టాలమీద పిల్లవాడు... కొద్ది క్షణాల్లో ముక్కలు ముక్కలుగా మారే పిల్లవాడు... నా ముద్దుల బిడ్డ... మూడు సంవత్సరాలు మురిపెంతో పెరిగిన పిల్లవాడు... భావించుకొని చాలా కష్టపడ్డది. కన్నీళ్లు బొటబొటా కార్చింది. ఏది ఎలాగున్నా కన్నకడుపాయెను. ఆ మమత ఎక్కడకు పోతుంది.

తిరిగితిరిగి సాయంత్రం అయ్యేప్పటికి యింటికి వచ్చాడు సూర్యనారాయణ. అతని ముఖంలో మార్పేమీ లేదు. పూర్వం వున్న గాంభీర్యమే. ఆమెకూడ కొంచం మార్పులతో అలాగే వుంది. కారినంతసేపు ధారాళంగా కారి, గాలికి ఎండి నల్లగా గడ్డకట్టుకొని వుంది నెత్తురు. మొఖమంతా అసహ్యంకొడుతోంది. జుత్తు చింపిరిచింపిరిగా వుంది. అలాగే అన్నం వండింది. కూరలుమటుకు చేయలేదు. ఏదో పచ్చడేసి పిల్లవాడికి పెట్టింది,

భర్తకి అన్నం పెట్టి, ఆవకాయపచ్చ డేసింది. రెండు ముద్దలు తినేప్పటికి, ఏదో అడ్డు వచ్చినట్టు ఆగి అన్నాన్ని వాసనచూశాడు. ఆపళంగా లేచి అన్నం కలిపిన చేత్తోనే, తడీ బిడీ—జుడ్డు వంగదీసి......ఆడదంటే ఎంత చులకన?

చుట్టుప్రక్కలవాళ్లందర్నీ పిలచి అన్నంలో మందు కలిపిందని చూపించాడు. నన్ను చంపాలని, చస్తే చూడాలని కుట్ర పన్నుతోందని అన్నాడు. ఆమె కిదేమీ అర్థంకాలేదు. తెలివిగల ఒకళ్లో యిద్దరో ఆఅన్నాన్ని పిల్లవాడికి పెట్టినా, ఆమె చూస్తూనే వుంది, ఊఁ!, అనలేదు ఆఁ! అనలేదు, వాడు సలక్షణంగా, నవ్వుతోనే వున్నాడు.

పెద్దమనుషులు వాణ్ని యిదే పీలన్నట్టు చెడబడా తిట్టారు. ఆమెను నాశనం చేస్తున్నావన్నారు. కాని సూర్యనారాయణ విచారపడ్డాడు, తన యెత్తు విఫలమైనందుకు. తను యింత మందికి అలుసు అయ్యానని.

సంవత్సరం గడిచింది. కాని వాళ్ల దాంపత్యం అలాగే వుంది. నాంచారమ్మ కష్టాలు కాష్టాల్లో కలితేగాని గట్టెక్కేట్టు లేవు. సూర్యనారాయణలో ఏమీ మార్పు రాలేదు. కాని రెండో పెళ్లి చేసుకోవాలనే ఆశక్తి నశించినట్టు కన్పడుతుంది. కాని కొట్టటం మానలా! పిల్లవాడు ఎదుగుతూనే వున్నాడు.

ఆంధ్రప్రబంధ పురుషులు

శాలీనుడు

(8-వ పేజీ తరువాయి)

తుద జిక్కు లేల? మీ మది
కొద దీటిన జాలు నమ్మకొనవలసిన వ
చ్చెద నమ్మకొనుడు నన్నో
హృదయేశ్వర! యేమి-చింతయిది? దెల్పదగున్

సుగాత్రిపత్యనురాగము, పాతివ్రత్యము, పరాకాష్ఠ చెందినవి. తమ చిత్తము మెచ్చిన తొత్తునకు దొత్తునయ్యెద ననినది. అది తనచేతిలోని పనియే యయిన దానే యాయక దెచ్చి యిచ్చెద ననినది. తుద కతని మది కొద తీఱునెడల దన్నే యమ్మకొను మనినది. ఇంతకంటె నే మనగలదు? ఇంతకంటె దానేమి చేయగలదు? ఆమె పాదసంవాహనము చేయుచునే యున్నది. అత డవునని కాని కాదని కాని తన కోరిక యిట్టిదని కాని చెప్పలేదు. ఇంతలో దెల్లవాఱినది.

మఱునాడు తొలునాటియట్ల తోట కేగినది. మగనికి దోటపనులలో దోడుపడినది. పతి యాదరించినాడు. పరవశమున నిరువురు మయి మఱచినారు. సుగాత్రికి 'కిటుకు' తెలిసిపోయినది. మగనికి 'అట్టి సొంపులేగాని భూషణాలింపుగాను' తెలిసికొనినది. మగడు చెప్పి తాను తెలిసికొనలేదు. తా నడిగి తెలిసికొనలేదు. తన యనుభవముతో దెలిసికొనినది. వారి చిత్తములు బొరల తెరలు వీడినవి. అనురాగరసమున వారి చిత్తములు రంజించినవి. వారి దాంపత్య జీవనము తిన్నగా సాగిపోవుచుండినది.

ఇందు సుగాత్రిపతిశీలత ప్రవ్యక్తముగుటతో శాలీనుని మధుర ప్రకృతి యడుగడుగున గోచరించుచునేయుండును. శాలీనుని మధురప్రకృతికి సుగాత్రి సాధనము. సుగాత్రిపతిశీలతకు శాలీనుని మధురప్రకృతి యొరగల్లు! సుగాత్రిపతిశీలత ప్రవ్యక్తము. శాలీనుని మధురప్రకృతి మబ్బులోని మెఱపు దీగ.

ప్రవరుడు పయికొనివచ్చిన వరూధిని నొల్లని ధార్మికతపస్వి. శాలీనుడు కులకాంతయెడనే సహజసౌందర్యము నభిలషించి తదనుభవము పడసిన కళాతపస్వి. పెద్దన ప్రవరునికి బయిచేయిగా నొకపాత్రమును సృష్టింప దలపే సూరన్నచే శాలీనుని సృష్టికి దోహదమయినది. సాహిత్యాకాశమున శాలీనుని మధురప్రకృతి యొక ధ్రువతార!



ఉబ్బసపురోగము చిటికలతోనూ మంత్రములతోనూతదితర విధములైన ఔషధములతోనూ అప్పటికప్పుడు తగ్గినట్లు కనిపించినా ఈ మందులవలన అది దీర్ఘరోగముగామారుట తప్ప ఏమియు లాభము లేదు.

పురోహిత శ్వాసహారి అనేక సంవత్సరములుగా వైద్య శాస్త్రమునకు తెలిసినదే. ఉబ్బసమునకు సరియైన శాస్త్రయుక్తమైన మందు యిదే అని అందరికీ తెలిసినదే. చక్కగా జీర్ణం అవుతుంది. క్రమక్రమంగా ఆరోగ్యం చేకూరుతుంది. ఊపిరితిత్తులు బలపడుతవి. ఉబ్బసం శాశ్వతంగ నివారణ మగునుమంచి కెమిస్టు లందరివద్ద 3.టా 6. టా.12. టా.ల సీసాలలో రు. 3/8.రు 6/-. 10/- లకు దొరకును. లేదా డాక్టర్ పురోహిత్ ఫార్మసీ కొల్హాపూర్, యస్. యమ్. సి. గారికి వ్రాయుడు.

పురోహిత శ్వాసహారి

మద్రాసు స్టాకిస్టులు: అప్పా అండ్ కో. చైనా బజారు (2) జే. బాలాభాయ్ అండ్ కో, 260 చైనా బజారురోడు, (3) దాదా అండ్ కంపెనీ, నైనియప్ప నాయకన్ వీధి; రాజమండ్రి, ఈశ్వర్ దాస్ అండ్ కో. బెజవాడ. బెజవాడ మెడికల్ స్టోర్సు; విశాఖపట్నం; వైజాగ్ మెడికల్ స్టోర్సు; సికింద్రాబాద్. పండలిక్ అండ్ కో, సుబ్రిక్ వీధి; నెల్లూరు, సి. ఆర్. గోపాల్ బ్రదర్సు, ట్రంకురోడు; ఒంగోలు. ధన్వంతరి మెడికల్ స్టోర్సు. గుంటూరు. మెడికల్ అండ్ ఆప్టికల్ ఎంపోరియం; గుడివాడ. గుడివాడ మెడికల్ స్టోర్సు: ఏలూరు. రావ్సు మెడికల్ స్టోర్సు; కాకినాడ. లక్ష్మినారాయణ అండ్ కో: మచిలీపట్నం, మెడికల్ స్టోర్సు.



మాతృ పితృ భక్తి

శ్రీ కొక్కొండ వాసుభాస్కరరావు

పూర్వకాలంలో అంటే మన భారత దేశాన్ని స్వతంత్రరాజులు పరిపాలించే రోజులలో, ఒక రాజ్యాన్ని ధర్మపాలుడు అనే రాజు పరిపాలించుచుండేవాడు. అప్పటికే విదేశీయులు మన దేశంలోనికి ప్రవేశించడం ప్రారంభించారు. అప్పటివరకు సుఖంగా జీవించుచున్న ప్రజలు రోజులు గడచినకొలదీ కష్టాలకు గురి కాజొచ్చారు.

ఆరాజుపరిపాలనలో ప్రజలు దేశభక్తి, రాజభక్తి కలిగి తోడివారి కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ పరస్పరసహకారంతో జీవించేవారు సుఖంగా. అంటే ఆ రాజ్యం. మనమందరం యిప్పుడు కలలుగంటున్న రామరాజ్యంవలె ధర్మపరిపాలనతో ఉండేది. కాని సుఖాలు వాటితోపాటే కష్టాలు చక్రంలా తిరుగుతుంటాయి గాబట్టి ఆ రాజ్యంలో కరువు వొచ్చి దరిద్రం తొంగిచూడడం మొదలెట్టింది. దొంగతనా లెక్కువయ్యాయి.

సాధారణంగా దొంగతనాలు ఎక్కువగా ఉంటాయి దరిద్రం ఎక్కువగా ఉన్న దేశాలలో. ఆకలితో మాడలేక బీదవాళ్లు దొంగతనాలు చేసి బ్రతుకుతూవుంటారు. ఈవిధంగా రాజ్యంలో దొంగలు ఎక్కువ అవడం చూసి ప్రజలందరూ రాజువద్దకు వచ్చి, మహాప్రభో! తమ రాజ్యంలో దొంగ లెక్కువయ్యారు. మేము వారి బాధ పడలేకుండా వున్నాము. రక్షించండి అని మొరబెట్టుకున్నారు. రాజు వారికి అభయమిచ్చి రాజ్యమంతటా దొంగలను పట్టుకున్న వారికి బహుమానమియ్యబడును' అని దండోరా వేయించాడు.

ఆ వూళ్ళో పాపం ఒక బీదవాడున్నాడు. వాడికి రాముడు, కృష్ణుడు, గోవిందుడు అని ముగ్గురు కొడుకులు. వాళ్లు చిన్నతనంనుంచీ తల్లితండ్రులంటే భక్తిగా ఉండేవారు. ఆ పిల్లలకు చదువుకోడానికి డబ్బు లేదు. తినడానికి తిండి లేదు. ఉండడానికిమాత్రం ఒక పూరిగుడిసె ఊరికి మారుమూలగా వుంది. తల్లీ, తండ్రీ, సంపాదించిన కొద్ది డబ్బుతో వాళ్ళకు పెట్టి తాము పస్తు పడుకునేవారు. ఆ రాజ్యంలో చాలమందిపరిస్థితి ఈవిధంగానే వుంది.

ఆ ముగ్గురు అన్నదమ్ములు, తమ తల్లితండ్రులు పడే కష్టాలను చూసి సహించలేక తాముగూడ ఏదైన డబ్బు సంపాదిద్దామని బయలుదేరేరు. దారిలో వారికి దొంగలను పట్టుకున్న వారికి బహుమానము లియ్యబడును. అని చాల చోట్ల ప్రకటనలు కనబడ్డాయి. ఆ ముగ్గురికి మంచి ఉపాయం తోచింది. వారు అక్కడ ఉన్న చెట్టు క్రిందకు చేరి ఈవిధంగా ఆలోచించడం మొదలుపెట్టేరు.

వారిముగ్గుర్లో పెద్దవాడైన రాముడు "తమ్ముళ్లూ, మన రాజ్యంలో దొంగలను పట్టుకున్న వారికి, రాజుగారు ధనం బహుమతి చేస్తామని ప్రకటించారు. మన వాళ్లకే కష్టాలూ లేకుండా చూడాలి. కాబట్టి మీరు నన్ను పట్టుకొని, రాజుగారికి దొంగ అని చూపించండి. ఆ డబ్బుతో మీరు హాయిగా జీవించవచ్చు అన్నాడు.

అప్పుడు చిన్నవాడైన గోవిందుడు "అన్నయ్యా నువ్వు పెద్దవాడివి. ఎక్కడైన పనిచేసి డబ్బు సంపాదించవచ్చు. నేను యింట్లో కూర్చొని మీరు తెస్తున్న దానిని తినడంతప్ప యింకేమి చేయలేను. అందువల్ల మీరు నన్ను తీసికొనివెళ్లి రాజుగారికి దొంగ అని అప్పగించండి" అన్నాడు.

ఆ మాటలు విని కృష్ణుడు "రాముడన్నయ్యా, గోవిందు తమ్ముడూ, మీ



రిద్దరూ వెళ్ళవద్దు. నువ్వు పెద్దవాడివి. డబ్బు సంపాదించి తెస్తావు. గోవిందంటే అమ్మకు ప్రాణం. నేనుండి మాత్రం ఏం చేస్తాను. నావల్ల అమ్మకీ, నాన్నకీ ఏమీ లాభం లేదు. కావున నన్ను దొంగ అని రాజుగారికి పట్టి, యియ్యండి" అన్నాడు.

చివరికి ఆ ముగ్గురూ కలిసి కృష్ణుణ్ణి దొంగ అని రాజుగారి కప్పగించడానికి నిశ్చయించుకున్నారు. కృష్ణుడి కాళ్లు, చేతులు కట్టి రాజువద్దకు తీసికొనిపోయి దొంగ అని చూపించారు.

రాజుకు ఆ కుర్రదొంగను చూడగానే చాల కోపం వచ్చింది. కృష్ణుడి రెక్కలు విరిచికట్టి యాభై కొరడా దెబ్బలు కొట్టించాడు. కాని కృష్ణుడు కిక్కురు మనలేదు. అంతటి చిన్నవాడైనా, తను బాధపడినా తన తల్లితండ్రులు సుఖస్తారదే చాలని సంతోషంతో ఆ బాధ భరించాడు. రాజు కృష్ణుడిని చెరసాలలో పెట్టి ఆ అన్నదమ్ములకు కావలసినంత డబ్బిచ్చి పంపేశాడు.

కృష్ణుడి వంటిమీది దెబ్బల్ని, కాకే రక్తాన్ని చూడగానే వారిద్దరికీ కంటినీరు గిర్రున తిరిగింది. కాని తమ తల్లి తండ్రులకోసం అక్కడ దుఃఖం ఆపుకొని యింటికి వెళ్ళేరు. రాజుకు వారిని చూడగానే చాల ఆశ్చర్యం కలిగింది. తమ కళ్ళనుండి రెండు నీటిబిందువులు రావడం, రాజు గుర్తిస్తాడేమో ననివారు భయపడి వెంటనే కన్నీటిని తుడిచేసుకొని తమ విచారం ఆపుకోడం రాజుకు చాల వింతగా తోచింది. ఇందులో ఏదో మర్మం ఉందని ఆ రాజు అనుమానపడి వారిని మారువేషంతో వెంబడించాడు.

రాజు వారింటిదగ్గిరకు వెళ్లేటప్పటికి యింటిలోనుండి ఘొల్లున ఏడుస్తున్న ఏడుపులు వినబడ్డాయి. రాముడు గోవిందుడు జరిగిన సంగతి నింట్లో చెప్పి ఆ డబ్బును తమ తల్లిదండ్రుల కిచ్చారు. దాంతో వారందరూ ఘొల్లున ఏడవడం మొదలెట్టేరు.

తర్వాత వారనుకుంటున్న మాటలనుబట్టి తెలిసింది రాజుకు వాళ్ల తల్లితండ్రులు పడే బాధలు చూడలేక డబ్బుకోసం తమ తమ్ముణ్ణే తనకు వారప్పగించారని. రాజు, కృష్ణుడి సహనం, త్యాగం తల్లిదండ్రులయందలి భక్తి చూసి చాల సంతోషించాడు. యింకా ఏం జరుగుతుందో చూద్దామని అక్కడే ఆగి వాళ్ల మాటలను వింటున్నాడు. చీకటిపడింది. రాజుకు అక్కడ నుంచుంటే గుడిసెలో ఏం జరుగుతున్నదో తెలియలేదు, అతడు మెల్లిగా గుడిసెలో కొచ్చి ఆ బీదవాడిని తన నా రాత్రి అక్కడ ఉండనియ్యమని అడిగేడు. ఆ బీదవాడికి తన పడుతున్న కష్టాలు బాధలు తెలుసునుగాబట్టి రాజును లోపలికి వచ్చి అక్కడే పడుకో మన్నాడు.


అది చలికాలం. చలి ఎముకలను కొరికేస్తున్నది. దోమలు చాల ఎక్కువగా ఉండి జుమ్మని ముసురుతున్నాయి రాజుకు ఆ బీదవాడు ఒక నులకకుక్కి నిచ్చాడు. రాజు దానిమీద పడుకున్నాడు. పాపం ఆ బీదవాడికి నిద్ర పట్టటం లేదు. ఇద్దరు కుర్రాళ్లూ మాత్రం కదలకుండా పడుకొని వున్నారు. దోమలెక్కువయాయి. వాటి బాధ భరించడం చాల కష్టంగా వుంది. బీదవాడికి ఒక కునుకు పట్టింది. రాముడు లేచాడు. మెల్లిగా తన తండ్రి ఒంటినిండా దోమలు కుట్టడంచూశాడు. సహించలేక తన తండ్రిమీద పడుకున్నాడు. దోమలు రాముడిని కుట్టటం ప్రారంభించాయి, అతనితండ్రిని వదిలి. ఆ బీదవాడు హాయిగా నిద్రపోయ్యాడు. మరి కొద్దిసేపటికిగోవిందుడు లేచాడు. తన తల్లిబాధ చూడలేక అక్కడే దోమలను విసురుతూ కూర్చున్నాడు.

తెల్లవారింది. కృష్ణుడికి నిద్దర లేదు రాముని వంటినిండా దోమలు కుట్టేశాయి. వంటినిండా దోమలు కుట్టడంవల్ల దద్దుర్లు అపరిమితంగా ఉన్నాయి. రాజు వారి భక్తికి ఆశ్చర్యపడ్డాడు. వెంటనే వెళ్లి తన సేవకునిచేత ఆ కుటుంబాన్ని తన సభకు పిలిపించాడు. ఆ సభలోనివారందరికీ, ఆ రాముడు గోవిందుడు చేసిన పనిని చెప్పి వాళ్ళను వారి తల్లితండ్రులయందలి భక్తికి చాల పొగిడేడు. తర్వాత కృష్ణుడిని చెరనుండి విడిపించి అతని త్యాగానికీ సహనానికీ మెచ్చుకొని, తాను చేసిన పనికి చాల విచారించాడు. సభికులందరూ వారిని చూసి ఆశ్చర్యపడ్డారు. రాజు ఆ అన్నదమ్ములకు వేలకొలది ధన మిచ్చి హాయిగా ఉండమని పంపించేశాడు.

ఆ సోదరుల తల్లితండ్రులమీది భక్తికి రాజు, తన రాణికోరికమీద కోటకు మధ్యగా, పాలరాతితో వారి బొమ్మలను చేయించి క్రింద "మాతృపితృభక్తి గల సోదరులు" అని వారి జీవితచరిత్ర వ్రాయించాడు.

కథ కంచికీ మన మింటికీ

రూపాయ విలువ తగ్గింపువల్ల
ఖరీదు 5% పెరిగింది.
అయినా మునుపటి ధరలకే ఇవ్వబడుతున్నవి.



5 రాళ్ల క్రోంకేసు	రు 35/-	రోల్డుగోల్డు	రు 40/-
7 ,,	,,	రు 40/-	,, ,,	రు 48/-
15 ,,	,,	రు 55/-	,, ,,	రు 70/-

నెం 10A తొమ్మిది రాళ్ల రు 14/8-
మేలురకం రు 16/- అలారం టైంపీసు రు 13/-
మంచివి రు 16/- రిపీటర్ రు 18/-

ఒకేసారి 3 వాచీలు కొనిన రూపాయికి 2 అణాలు వంతున కమీషన్ యివ్వబడును.

H. DAVID Co ,
Post Box No. 11424, Calcutta.

కుష్ఠు * బొల్లి
వగైరా మేహమచ్చలు, సెగ, పవాయివ్యాధులకు, గ్యారంటీ-చికిత్స. క్యాటలాగుఉచితం
(వి.వి. రెడ్డి, ప్రొప్రయిటరు. బి. రెడ్డి & కో. రిజస్టర్డు) గోపాలపురం, తూ॥గో॥జిల్లా.

౧ వ రంగము

(రాజకళింగగంగు ప్రాసాదద్వారం)

మల్లన్న: ఇదిగో భీమన్నా! ఇప్పుడే చెప్తున్నాను ఈయన మహారాజు. మునుపు నువ్వు చూసినవాళ్ళంతా మన్నెదొరలు. నువ్వు నీ మామూలు వెంకితనానికి పోక, కాస్త శాంతంగా వినయంగా ఉండాలి.

భీమన్న: (కోపంగా) ఏమిటే వాళ్ళంతా మన్నెదొరలూ వీడు మహారాజూనా! నా మొగం రాజు. మనం చేస్తే రాజూ-లేకపోతే వాజూను-ఊరుక్కే నన్ను వాగించక-నానోరు అసలే మంచిది కాదు.

మల్లన్న: (విసుగుతో) అబ్బబ్బ! ఎక్కడ చచ్చేదయ్యా నీతోటి-అయితే ఇంటికే పోదాం పద! తీరా అక్కడికిపోయి అల్లరిపడటం దేనికి?

భీమన్న: పద పోదాం! ఈ త్రాష్టులందర్నీ చూసేదేమిటి! నువ్వు రమ్మన్నావు కదా అని బయలుదేరానుగాని, లేకపోతే ఇంతోటి రాజూ నాకు దొరక్కపోయాడట-అయినా నాకు ఈ రాజులూ వాజులూ ఎందుకూ, ద్రాక్షారామభీమేశ్వరుడే ఉన్నాడు నన్ను అన్నివిధాలా కనిపెట్టి చూసేందుకు.

మల్లన్న: అరి భగవంతుడా! ఎక్కడి పిచ్చివాడు దొరికాడురా! మూడురోజులుపట్టి ఇంట్లో పస్తులు పడుకొంటూ, ద్రాక్షారామభీమేశ్వరుడే ఉన్నాడంటూ మొండిగా కూర్చుంటాడు ఎల్లా చచ్చేది.

భీమన్న: ఔను భగవంతుడు కాక నా దరిద్రం ఈ వాజులంతా తీరుస్తారా ఏమిటి? పద పోదాం.

మల్లన్న: (బతిమాలుతూ) భీమన్నా! నీ కాళ్ళు పట్టుకొంటాను. నాకోసం కాస్త, ఎల్లాగో, పదినిమిషాలు బిగబట్టుకొని, కోపతాపాలు తెచ్చుకోకుండా, నెమ్మదిగా ఉండు. ఈ కళింగగంగుకు కవిత్వం అంటే అభిమానం. కాస్త మంచితనంగా రాజమర్యాదలు చూపించి, రెండు పొగడ్తపద్యాలు చెప్పావంటే చాలు, ఆ జన్మాంతమూ, మన రెండు సంసారాలుకూడా సుఖంగా సాగుతాయి. బాబ్బాబు, నాకోసమైనా కాస్త నామాట విను. బాబువు కాదూ.

భీమన్న: (మెత్తబడి) సరేలేపద - కానీ ఇప్పుడే చెప్తున్నాను. నా కా మర్యాద లేమో తెలియవు. అవన్నీ నువ్వే చేసుకో - నన్ను నువ్వు పద్యాలు చదవమన్నప్పుడు చదువుతాను.

మల్లన్న: పోనీలే అంతే చాలులే - ఈ నౌకరుచేత మనం వచ్చామని కబురంపిస్తాను. (నౌకరుతో) అబ్బాయీ! వేములవాడ భీమకవిగారు వచ్చారని రాజుగారితో మనవి చేస్తావా?

నౌకరు: ఇక్కడే ఉండండి. చెప్పివస్తాను. (నౌకరు లోపలికి వెళ్తాడు)

భీమన్న: కబురెందుకూ- సరాసరి లోపలికి పోక - ఇక్కడ ఈ గుమ్మంముందు మనకీ కుక్క కాపలా ఏమిటి?

మల్లన్న: (విసుగుతో) మరి రాజమర్యాదలన్నీ నన్నే చూడమన్నావు గదయ్యా - కబురంపందే, అనుమతి లేందే రాజాస్థానంలోకి వెళ్ళటం మర్యాద కాదు. ఒక్క అరగంట ఓపిక పట్టి నామాట వింటూ బాబూ.

నౌకరు (ప్రవేశించి) - రాజుగార్కి ఇప్పుడు తీరిక లేదు తర్వాత రమ్మన్నారు.

భీమన్న: (రౌద్రంతో) - ఏమిటీ వేములవాడ భీమకవి వస్తే! ఈ తరాజుకు, చూడటానికి తీరిక లేకపోయిందీ - హూ - చూస్తాను పద.

మల్లన్న: ఆగు భీమన్నా తొందరపడకు - (నౌకరుతో అనునయంగా) ఏమయ్యా రాజుగారు తొందరపనిలో ఉన్నారా?

భీమన్న: తొందర లేదు గిందర లేదు - పదా లోపలికి పదా.

నౌకరు: అయ్యా అయ్యా ఆగండి - అల్లా వెళ్ళకూడదు.

మల్లన్న: భీమన్నా! భీమన్నా! ఆగు.

భీమన్న: (నౌకరుతో కోపంగా) అడ్డు వచ్చావంటే ప్రాణాలు నిలవ్ జాగ్రత్త. దా మల్లన్నా ఎదురు చెప్పకుండా లోపలికి రా - (లోపలికి నడుస్తాడు) - ఏడీ ఈ రాజు?

బాలానందం: నాటిక:

★ కవి రాక్షసుడు ★

శ్రీ వి. డి. ప్రసాదరావు

మల్లన్న: జయ! కళింగ గంగ్రాజ మహారాజులకు జయం.

కళింగగంగు: ఈ బ్రాహ్మ లెవరు - ఎందుకొచ్చారు?

మల్లన్న: మహారాజా వీరు వేములవాడ భీమకవీంద్రులు. ద్రాక్షారామభీమేశ్వరవరప్రసాదజన్ములు - కవిరాక్షసులని బిరుదు గలవారు - మీరు కవితావినోదులని విని—

కళింగ: వినోదులేమిటి! మేము వినోదులం కాము - విదూషకులం గాము- అయినా ఏమిటీ తోసుకురావటం - ఇప్పుడు తీరుబడి లేదుపొమ్మనలే?

మల్లన్న: మహారాజా మొన్న మీదర్శనానికి రాగలమని చెప్పుకొంటే రమ్మన్నారు.

కళింగ: అంటే!-ఇప్పుడు పొమ్మన్నంటున్నాం పొండి - అడుక్కుతినేవాళ్ళకు ఇల్లా తోసుకొచ్చే అంత పొగరా?

భీమన్న: ఆ! అడుక్కుతినేవాళ్లా! అడుక్కుతింటూనే పోతావు జాగ్రత్త.

సభాసదులు: (ఆ! ఆ! ఎంత మాట అని కల్లోలము)

మల్లన్న: హుష్ భీమన్నా ఊరుకో.

కళింగ: (నవ్వుతూ) ఓహో తిట్లు కూడా సాగిస్తున్నావే - నువ్వు తిట్టుకవివికూడానే ఏమిటి - నిన్నేనా - విధవాపుత్రు డంటారు - చాల్చాలుగాని దేహశుద్ధి అయేలోపల అవతలికి నడు.

భీమన్న: (రౌద్రంతో) ఏమిరా నీ పొగరు-నాలుకూళ్ళకు రాజయావో లేకో శాపానుగ్రహదక్షుడయిన వేములవాడభీమననే తిరస్కరిస్తావుగా - ఇదిగో నా దెబ్బ కాసుకో - (కోపంతో పద్యం చదువుతాడు)

"వేములవాడభీమకవి
వేగమె చూచి కళింగగంగు తా
సామము మాని కోపమున సం
దడి దేరిన రమ్ము పొమ్మనెన్
మోమును చూడ దోష మిక
ముప్పదిరెండు దినంబు లావలన్
జాముని కరమం దతని
సంపద శత్రుల జేరుగావుతన్."

(సభలో, "ఆ! ఆ! కవిరాక్షసుడు ఎంత మాటన్నాడు అయ్యో అయ్యో" అని కలకలము)

కళింగ: (వికటంగా నవ్వుతూ) ఇంకేం తిట్టేశావుగా, పో! ముప్పైరెండురోజులు గడువుకూడా పెట్టుకొన్నావెందుకూ ఇప్పుడే అనక-చాల్చాలుగాని అవతలకు నడు ఒరేయ్-వీడిని బైటికి గెంటేయండ్రా.

భీమన్న: (కోపంతో ఇకిలిస్తూ) ఎవడురా రాక్షసుడిదగ్గరకు రాగలవాడు!-ఈ రాజుతో పాటు దారిద్ర్యం తెచ్చుకోవాల్సినవా డింకా ఎవడన్నా ఉన్నాడా - ఓయి కళింగగంగూ - అనుభవిస్తావుకానీ-నే వెళ్తున్నా-దా మల్లన్నా పోదాం.

మల్లన్న: అరి భగవంతుడా - ఎంత పని అయింది? (నిష్క్రమణ.)

౨ వ రంగము

భీమకవి యిల్లు, రాత్రివేళ

మల్లన్న: భీమన్నా; పాపం ఆ కళింగగంగు ఓడిపోయి పారిపోయాడట - రాజ్యం శత్రురాజులపాలైంది!

భీమన్న: ఆ! ఆ! నిజంగానా - పాపం, ఎంతపని జరిగింది!

మల్లన్న: నువ్వు ఎన్ని అక్షరాలు పలికావో అన్నీ జరిగాయి. భీమన్నా జనాన్ని ఇల్లాగు శాపాలు పెట్టాంటే ఏమయిపోతారు చెప్పు?

(బైట "మాధాకబళం అమ్మా" అని కేక)

భీమన్న: (జాలిగా) నిజం! మల్లన్నా! ఎన్నిమాట్లో అనుకొంటాను - అసలు కోపమే తెచ్చుకోను అని. కాని తీరా ఇట్టే కోపం ముంచుకొచ్చేస్తుంది. అప్పుడు ఒళ్లు తెలియకుండా ఏదో మాట అనేస్తాను. అది కాస్తా జరిగి ఊరుకుంటుంది. భీమేశ్వరా! నా కోపానికి ఇంతపాపం సమకూర్చవద్దు తండ్రీ అని దేవుడికి మొఱపెట్టుకొంటాను. కాని నా కోపాన్ని నేను జయించలేకుండా ఉన్నాను.

మల్లన్న: అయినా నాదే తప్పులే! నువ్వు రానంటూన్నా అమర్యాద జరిగేచోటికి నిన్ను లాక్కువెళ్ళడం నాదే తప్పు.

భీమన్న: కాదయ్యా! నువ్వు ఉపకారమే తలపెట్టావు. నేను ముక్కోపినైతిని! సరే ఇంకనుంచీ ఈ కోపం జయించుకొనేదాకా ప్రజల్లోనే తిరగను.

(బైట దభేలుమని చప్పుడు)

భీమన్న: అయ్యో పాపం! ఎవరో పాతర గోతిలో పడ్డట్టున్నారు. అది పూడ్పిద్దామనుకొన్నాను. ఇంతవరకూ తీరనేలేదు.

మల్లన్న: ఆ! ఇందాకటి మాధాకబళం వాడే అయిఉంటాడు.

భీమన్న: అయితే పాపం ముసలివాడో అంగుడో పద చూద్దాంపద - (ఇద్దరూ గుమ్మంలోకి వస్తారు)

(గోతిలోనుంచి కళింగగంగు కంఠం)- అహా! కాలిదివిటీ వేసేవాడుకూడా లేకపోయాడే!

భీమన్న: ఇదేమిటి! మాధాకవళానికి వచ్చి కాలిదివిటీ వేశావాడు. అంటాడు - మల్లన్నా దివిటీ తే - ఎవరో పెద్దబతుకు బతికినవాడై ఉంటాడు! ఎవరునాయనా నువ్వు.

కళింగగంగు: నేను! హు! వేములవాడ భీమకవి చేసిన జోగిని.

మల్లన్న: ఆ! ఆ! రాజకళింగగంగులే! ఈ వేషమేమి ప్రభూ? అయ్యోపాపం!

భీమన్న: మల్లన్నా చెప్పలేదా నా వాక్కు ఊరికే పోదని. పాపము ఈ రాజు కెంత దుర్దశ వచ్చిందో! అయినా శాపం ఇచ్చేందుకున్న సామర్థ్యం, అనుగ్రహం చూపేందుకు లేదా! రాజా! దా! లోపలికి రా! సేదదేర్చుకొందువు గాని, రా.

కళింగ: ఎందుకుబాబూ? ఏదో నా కర్మకు నీ మాటతోడయింది. ఆనాటి నా చర్య తోడయింది. దీనికి ఎవరుచేసేది ఏముంది?

భీమన్న: ఆ! అంతేనా! నా మాట అంటే ఎరుగవా?

బిసరుహగర్భు వ్రాతయును
విష్ణుని చక్రము వజ్రివజ్రముల్
కౌసలను రామబాణము, యుం
ధిష్ఠిరు కోపము మాని శాపముల్
మసకపు బాముకాటును గు
మారుని శక్తియు గాలు దండమున్
బశుపతి కంటిమంటలును,
పండితవాక్యము రిత్తవోవునే.

కళింగ: పోదుస్వామీ పోదు. పోదనేందుకు నేనే సాక్షి.

మల్లన్న: భీమన్నా రాజకళింగగంగులు చిన్న పొరపాటుకు పెద్దశిక్ష అనుభవిస్తున్నారు.

భీమన్న: (పశ్చాత్తాపంతో) నిజమే మల్లన్నా. మహారాజా...

కళింగ: నన్ను పోనియ్యండి స్వామీ! మహారాజా అని ఎందుకు ఉడికిస్తారు - ఎప్పటికేది గతో అది ఉండనే ఉంది.

భీమన్న: రాజకళింగగంగూ-అధైర్యపడకు ఇదిగో నా మాట.

"వేయి గజంబు లుండె పది
వేల తురంగము లుండె నాజిలో
రాయల గెల్చి సజ్జనగ
రంబున పట్టముకట్టుకో వడిన్
రాయకళింగగంగకవి
రాజు భయంకరమూర్తి చూడ దా
బోయిన మీనమాసమున
పున్నమ పోయిన షష్టినాటికిన్."

కళింగ: (సంతోషముతో) కవివర్యా! ఎంత దయార్ద్రహృదయుడవయ్యా! నమస్కారము - నీమాటచొప్పున నాకు రాజ్యము ప్రాప్తిస్తుంది.

మల్లన్న: మహారాజా! శత్రురాజులు, మీకథ పగటివేషం కట్టించి ఆనందిస్తున్నారట.

కళింగ: అల్లాగా, చూస్తాను. కవివాక్కు నాకు అండగా ఉంటే ఎంత పనైనా చేస్తాను. ఆ పగటివేషంలోనే కళింగగంగు వేషంతో బయల్పడి, ఆరాజును నరికి రాజ్యం కైవసం చేసుకొంటాను. కవివర్యా ఆశీర్వదించండి-నా కృషి సఫలం కావాలని.

భీమన్న: పోయిరా నాయనా! శుభము కల్గుగాత. శీఘ్రమే అభీష్టప్రాప్తిరస్తు.

మల్లన్న: తథాస్తు. (నిష్క్రమణ)

———

సర్వోత్కృష్టమైన

"కానన్ దేవన్"

తేయాకు మాత్రమే త్రాగండి.

KANAN DEVAN TEA

Kanan Devan Tea

Quality Production

చీఫ్ ఏజంటు: కర్నూలు, అనంతపురం, కడప & చిత్తూరు జిల్లాలకు

కె. ఎ. జోషి, అనంతపురం.

టోకు వ్యాపారస్థులకు విశేష సౌలభ్యము

వివరములకు నేడే వ్రాయండి.

కృష్ణాగోదావరి జిల్లాల దుస్థితి

(9-వ పేజీ తరువాయి)

సముద్రమునకు, మధ్యనున్న ఉప్పుటేరు తగినంత లోతు, వెడల్పు లేనందువలనను, వంకరటింకరగా నున్నందునను, వరదనీరు సముద్రములోనికి, చీమ నడకను పోవుచుండుటచే, గుడివాడ, కైకలూరు, భీమవరం ఏలూరుతాలూకాలలోని పల్లపు మాగాణులలో నిలచిన, నీరు బయటకు పోకున్నది. చిన్ననాటినుండి అతి మమకారముతో నొక్క కుటుంబమున పెరిగిన యాత్మీయుల శవములనైన దహనసంస్కారము చేయనోచక హతభాగ్యులైన తలిదండ్రులు కన్నీరు విడుచుచు వరదప్రవాహము లోను కాలువలలోను చాపలలో జుట్టియు జుట్టకయు విడుచుచుండుట, తుపానుబాధితులగు గ్రామీణుల అసహాయస్థితిని జాటుచున్నది.

కృష్ణాజిల్లా మెట్టతాలూకాలలో చెరువులు తెగిపోవుటవలన వానిక్రింద సాగగు మాగాణికి తీరని నష్టము వాటిల్లినది. నూజివీడుప్రాంతములో గొప్ప విలువగల మామిడితోటలకు తుపానుదెబ్బ తగిలినది. ఏలేరుచెరువు తెగి వరద నీటితో ఏకమై 30 నిండుప్రాణములను బలిగొన్నది. వీరపల్లికి జెందిన బ్రహ్మాండమగు చెరువుకట్ట, నలువైపుల తెగి వరిపంటను నాశనము చేసినది. దీని మహాప్రవాహమువలన బెజవాడ పోవు రోడ్డు, చాల చోట్ల నాశనమైనది. ఏలూరునుండి విజయవాడ వచ్చుదారిలో కల పుట్రగు, బొమ్ములూరువద్ద, పంటలకు రోడ్డునకు తీరని నష్టమును కలిగించినది. తేలప్రోలు వీరాదికి వరదప్రవాహము పొంగిపొరలి 20 మంది మనుష్యులను బలిగొన్నది.

పశ్చిమగోదావరిజిల్లా

కైకలూరునుండి రైలులో మేము, భీమవరము వెళ్లితిమి. రైలుకట్ట పొడవున, రెండువైపులగల గ్రామములలోని పేదలయిండ్లన్నియు కూలిపోయినవి. పైరులన్నియు జలమయమై యున్నవి. భీమవరములో గాలిదెబ్బకు నష్టపడిన హరిజనవాడను చూచితిమి. చినఅమిరం, పెదఅమిరం, జక్కరం, కాళ్లకూరు, కాళ్ల, జువ్వలపాలెం, చూచుకొనుచు, యేలూరుపాడు చేరితిమి. కాలినడక నా గ్రామము పోయి ఉప్పుటేరు పోటువలన, నష్టపడిన భూములను అరటితోటలను జూచి, కాలినడకనే, ఏలూరుపాడులాకుల వద్దకు పోయితిమి. ఉప్పుటేరు, కొల్లేరు, గుడివాడ, కైకలూరు తాలూకాల బుడమేటి వరద నీరు, హెచ్చుగా వచ్చి చేరుచుండుటవల్ల ప్రవాహం పెరుగుదలను గాంచితిమి. మధ్యాహ్నము చటినుండి పాలకొల్లేరుమున్నగు గ్రామములలో సర్వనాశనమైన వందలకొలది యకరముల అరటితోటలను జూచితిమి.

తిరిగి భీమవరము చేరి ఆ సాయంత్రము కారులో విస్సాకోడేరు, శృంగవృక్షం, వీరవాసరం, జల్లిపాడు, కోడేరు, లంకలకోడేరు, పాలకొలు, జూచుకొనుచు నరసాపురం చేరితిమి. దారిపొడుగున గల అరటితోటలు సంపూర్ణముగను, అంతులేని కాపు కాచి, గెలలతో నిండియున్న కొబ్బరితోటలు నేలగూలియున్నవి. పాలకొల్లునకు చుట్టును, నరసాపురము చుటును, నున్న గ్రామములకు సంభవించిన అరటి, కొబ్బరితోటల నష్టము అపారము. వరిపైరునష్టము అంచనా వేయలేనంతగా సంభవించినది. నరసాపురముతాలూకాలోని మొగలతుర్రుఫిర్కా అంతయు దెబ్బతిన్నది. ఆ తాలూకాలో గోదావరితీరము నంటియున్న ప్రకాశరావుపాలెం, మైనవానిలంక, తుపానుదెబ్బకు, గోదావరి వరద సముద్రపుపోటుతో లేచిన తాటిచెట్టెత్తు తరంగమునకు కొట్టుకొనిపోయినవి. వేములదీవి, బియ్యపుతిప్ప, నామరూపములు లేకుండ గోదావరీనదీగర్భములో కలసిపోయినవి. వేములదీవిలో మాత్రమే 27 మంది తుపాను కారణముగా జలదేవతకు బలియయిరి. ఆ గ్రామాధికారి కుటుంబమంతయు మృత్యుముఖమున బడిపోగా అతడు ఏకాకియై విలపించుచున్నాడు.

సముద్రకెరటము వచ్చినపుడు యిద్దరు దంపతులు నిండు యవ్వనములో నున్నవారు తమ పూరింటితో సహా తాటిచెట్టెత్తున నీటిపై దేలి తాటిచెట్టు యాకునుబట్టి భర్త వేలాడుచూ భార్యచేతిని గట్టిగ పట్టుకొనెను. ముందుకు త్రోసుకుపోయిన సముద్రకెరటము వెనుదిరిగి వచ్చునపుడు వురవడిలో గుంజుటచే భార్య భర్త చేతినుండి జారిపోవుచున్నంత యాపె చీరను గట్టిగా పట్టుకొనెను. చీర జారిపోవుచుండ, తన బొడ్డులోనున్న తమ యావజ్జీవితసంపాదన రు. 500 గల సంచిని ఆసన్నమృత్యుముఖమున బడిపోవుభార్య భర్తకందించలేక సముద్రగర్భమున గలసిపోయెను. భగ్నహృదయుడగు నా భర్త తాటిచెట్టును కౌగలించుకొని చలిచే బిగదీసుకునిపోయి మరునాడు సంరక్షింపబడెను. చిహ్నమేని లేకుండ తుడిచిపెట్టుకుపోయిన తన గ్రామ మీచ్చటనే యుండెడిదని తన గృహమిచ్చటనుండెడిదని, వచ్చువారికి చూపించుచూ, తన్ను దిక్కుమాలిన పక్షిగ జేసిపోయిన, తన యిల్లాలి చీరను చూపించుచు అతడు విలపించు దృశ్యము యెట్టి కర్కశహృదయునకేని జాలిని కలిగింపక మానదు. నరసాపురములో గొట్టుముక్కల వెంకన్న (ఎం. ఎల్. ఎ.) గారితో కూడి, నష్టపడిన హరిజనవాడను వీక్షించితిమి. ఆసుపత్రికి పోయి తన యిరువురుకుమాళ్లు సముద్రకెరటమునకు బలి కాగా, యిల్లు విరిగిపడుటచే, యెముకలు విరిగి చికిత్స పొందుచున్న వితంతుమాతను గాంచితిమి. 2-వ తేదీ రాత్రికి పశ్చిమగోదావరి పర్యటన ముగించుకొని నరసాపురము వద్ద గోదావరిని దాటి బంతిలో 4 మైళ్లు పయనించి రాజోలుతాలూకాలోని సఖినేటిపల్లి చేరితిమి.

తూర్పుగోదావరిజిల్లా

ఆ రాత్రి సఖినేటిపల్లిలో యుండి గోదావరి వరదవలన, సముద్రపు తుపాను కెరటము తాటిచెట్టు ప్రమాణమున లేచి గోదావరీతీరమునగల పంటల నన్నింటిని నష్టపరచిన విధమును రైతుల నుండి తెలుసుకొంటిమి. వేములదీవి ప్రాంతములో గోదావరివరద సముద్రకెరటము కలసి వచ్చినపుడు పూరియిల్లు ఒకటి జలోపరిభాగమున కొట్టుకొనిరాగా రెండు సంవత్సరముల బాలుడొకడు ఒక మహావృక్షము తొర్రలో యిరుకుకొని పోగా వానిపైన చెత్తాచెదారము పడి తుపానగాలినుండి, చలిగాలినుండి సురక్షితముగ నుండె. మరునాడు గ్రామీణులచే సంరక్షింపబడెను. సఖినేటిపల్లిగ్రామవాస్తవ్యు లొకరికి కొబ్బరిచెట్లు పడిపోవుటవలన 2 లక్షలు ఆదాయము నంటగలసినది. 28 వ తేదీ అర్ధరాత్రి వేళ అంతర్వేదివద్ద సముద్రము ఒకటి రెండు మైళ్లు వెనుకకు పోయి, మిణుగురు పురుగులవంటి వెలుగుతో బ్రహ్మాండమగు వేగముతో తాడిచెట్టు యెత్తు వచ్చి రాజోలుతాలూకాలో రాజోలు, కడలి, ఫిర్కాలను నాశనము చేసినది. సముద్రములో నున్న లక్షోపలక్షల పిట్టలు రకరకములు తుపానుదెబ్బకు నాశనమై సముద్రపుటొడ్డు పొడుగున గుట్టలుగుట్టలై తేలుకొన్నవి. పంటలు, తోటలు, యిండుపోయిన నిరుపేదలగు సముద్ర, నదీతీరప్రాంతీయులు తినుటకు బియ్యము లేక యీ చచ్చిన పక్షులను కాల్చుకుని తినుచుండుట గమనించితిమి.

3 వ తేదీన మలికీపురం, లక్కవరం, చింతలపల్లి, శివకోడు చూచుకొని, రాజోలు చేరితిమి. ఈ ప్రాంతములలోగల అరటితోటలు లక్షలకొలది విలువగల కొబ్బరితోటలు పడియుండుట చూచితిమి. పడక నిలిచియున్న లక్షలకొలది కొబ్బరిచెట్ల తలలు విరిగిపోయి, గాలి తాకిడికి మొవ్వులు చివికిపోయినవి. ఇరుసుమండలో ఒక బక్కచిక్కిన శెట్టి బలిజరైతు, తుపాను అణగిన మరునాడు దడదడలాడు గుండెతో తన కొబ్బరితోటను చూచుకొన వెళ్లెను. తన తోటలోని 85 కొబ్బరిచెట్లు అంతులేని గెలలతో నేలకొరిగియుండుటను తనకు జీవనోపాధి నీయగల 4 యకరముల తేతపూసకుతోట నేలకొరిగియుండుట చూచి బావురుమని యేడ్చి భగ్నహృదయుడై జీవితమునకు రోసి సమీపస్థ వృక్షమునకు వురిపోసుకొని ఆత్మహత్య గావించుకొనెను. ఆ మధ్యాహ్నము మలికిపల్లి, పొన్నమండ, గోగులమ్మ, మగటపల్లి, కడలి, కాండ్రేనపాడు, ముత్యాలపాలెం, జగ్గన్నపేట, గెద్దాడ, తాటిపాక, వాడ్రేవుపల్లి, నాసుల్లంక, పాచెర్లపూడి, మొండెపులంక, గన్నవరం చూచుకొని క్రొత్తపేట చేరితిమి. యీదారిపొడుగున లక్షలకొలది విలువగల కొబ్బరితోటలు సర్వనాశనమైనవి. అరటితోటల సంగతి నుడువబనియే లేదు. వరిపైరంతయు సముద్రపు విషపుగాలిచే మాడిపోయినది. కొన్నిచోట్ల నీట మునిగినది. క్రొత్తపేటనుండి ముంగండ, అంబాజీపేట, కొత్తబండారులంక, మొండిలంక, పాతబండారులంక చూచుకొనుచూ, అమలాపురము చేరితిమి. అక్కడినుంచి 10 మైళ్లదూరములో నున్న చల్లపల్లి వెళ్లితిమి. తుపానువలన దారిపొడుగునా గల కొబ్బరితోటలు, అరటితోటలు, వరిపైరు సర్వనాశనమయినది. తిరిగివచ్చి అమలాపురంనుండి 40 మైళ్లు రోడ్డుపొడుగున నున్న గ్రామముల నన్నింటిని వాని నష్టమును గమనించుచూ పయనించితిమి. మాజీవ్యవసాయమంత్రి బిక్కిని వీరాస్వామిగారికి కొబ్బరితోటల నష్టమువలన వారు అంచనా వేసిన లక్షలకొలది లాభము గాలిలోని కర్పూరమైనది. 3 వ తేదీ రాత్రి పేరవరం చేరి రైతులద్వారా వారి కష్టనిష్ఠురములను తెలుసుకొంటిమి. క్రొత్తపేటనుండి బొబ్బర్లంక వరకు గల గ్రామము లన్నియు కొలదిగనో గొప్పగనో తుపానుదెబ్బతిన్నవి. పేరవరం రైతుల మెట్టపైరు లన్నియు, పుగాకు పైరు సర్వనాశనమయినట్లు—లంకభూములకు వారు ప్రభుత్వమునకు లక్షయాభై వేలు చెల్లించవలసియుండుననియు. తమ దుస్థితిని నివేదించిరి.

రాజమండ్రి వచ్చి మేము విశాఖజిల్లా పర్యటింపదలచి స్టేషనుకుపోయి విచారింప రైళ్లు నడచుటలేదనియు తునివద్ద రైలురోడ్లు తదితర మార్గములు తెగిపోయినట్లు తెలిసి విజయవాడ వచ్చితిమి.

ప్రభుత్వ కర్తవ్యము

తుపాను వరదలదెబ్బ హెచ్చుగా నున్నచోట నూటికి 80 వంతులు నష్టమయినది. తక్కువగానున్నచోట నూటికి 50 వంతులు, మొత్తం మీద నాలుగుజిల్లాలలో య. 1 కి కనీసం 5 నుండి 8 బస్తాలవరకు ధాన్యం నష్టమయినది. పశుగ్రాసము తీరని నష్టమునకు గురియాయినది. పెద్ద పెట్టుబడులతో, అప్పులతో, హెచ్చు కూలీతో మాగాణి సాగుచేసిన మధ్యతరగతి రైతు చిన్నరైతు చేయు ఆర్తనాదము వర్ణనాతీతము. ప్రభుత్వము వీరికి తక్కావిఋణములు ఎరువులు, విత్తనములు, సప్లయిచేయుట జరూరు. నాల్గుజిల్లాలలో బియ్యం లేక ప్రభుత్వం ఇచ్చు బియ్యం రేషను చాలక నిరుపేదలు పస్తులతో మలమల మాడిపోవుచున్న దృష్టాంతములు అసంఖ్యాకములు. ప్రభుత్వము తుపానుపీడితప్రాంతమంతటికి, ధారాళముగ బియ్యము సప్లయిచేయుట అవశ్యకర్తవ్యము. బుడమేరుప్రాజెక్టును ఇప్పటికైనా యథార్థముచేయుట ప్రభుత్వ తక్షణకర్తవ్యము. రాజోలుతాలూకాలో సముద్రతీరప్రాంతమునకు సంబంధించియున్నంతవరకు గోదావరికి కట్టపోయించుట అత్యంత ఆవశ్యకము. కొబ్బరితోటల రైతులకు తదితర బాధితులకు ప్రభుత్వము శిస్తురెమిషను పశునష్టములకై దీర్ఘవాయిదాఋణములు సమకూర్చి వారిని కనిపెట్టుట అవసరము.

మద్రాసు ప్రభుత్వప్రధాని కుమారస్వామి రాజాగారు తుపానునుగురించి విలేఖరుల వ్రాతలు అత్యుక్తితో కూడియున్నవనుట సబబు కాదు. వారు స్వయముగ తుపానుబాధితప్రదేశమునకు పోయి కండ్లార చూచిన అపారముగ సంభవించిన పశు, గృహ, గ్రాస, సస్య, ప్రాణనష్టమునకు నిర్విణ్ణులు కాకమానరు. నగరములలో పట్టణములలో నున్న, వ్యాపారులు, శ్రీమంతులు, మద్రాసుగవర్నరు పేరిట, భూరివిరాళములను బంపి ప్రకృతిప్రకోపమునకు ఆహుతియైన దీనజనాళి నుద్ధరింపబూనుట అవశ్యకర్తవ్యము.

ఆంధ్రదేశంలో తుపాను, వరదలు

(10-వ పేజీ తరువాయి)

లక్షలాదిగా వచ్చే పరీజపిట్టవలనా తినివేయబడి కోసేతరుణమునకు ఏమీ మిగులదనీ, చెప్పుకున్నారు. ఆగడాల్లంక గ్రామానికన్నా పల్లపు ప్రాంతంలో ఉండే చెట్టన్నపాడు ప్రజలు, తమ గ్రామంలో నిల్చునెందుకు స్థలం లేకుండా మునిగిపోయినందున తామంతా పోతునూరు వచ్చివేశామనీ, నిరాధారులుగా యున్నామనీ అన్నారు. అధికార్లు ముందుగా పోతునూరు శివారు గ్రామమైన కేదారం గ్రామం చూశారు. యిచ్చటకూడ పంట యావత్తు నీటిలో మునిగిపోయింది. ఇండ్లు చాలభాగం నీటిలో ఉన్నవి. ప్రజలలో చాలమంది యితర చోట్లకు వెళ్ళారు. యిచట ప్రజలకు అధికార్లు రొఖ్ఖం, బియ్యమూ, చీరెలూ పంచిపెట్టారు. అటు తర్వాత ఆగడాల్లంక గ్రామం వెళ్ళారు. ఇచటకూడా యిండ్లు పూర్తిగా కూలిపోయి నష్టపడిన కుటుంబానికల్లా రు 10/- చొప్పున రొఖ్ఖం పంచిపెట్టారు. 5 బస్తాల బియ్యంకూడా పంచిపెట్టారు.

ఈ విధంగా అతి కష్టపరిస్థితులలో బ్రతుకుతున్న యీ తరుణంలో అధికార్లీ విధంగా సహాయం చేసినందుకు ప్రజలు చాలా సంతసించారు. ప్రభుత్వం ఏవిధంగానైనా తమ్మిలేరు, బుడమేరు ప్రాజెక్టులను నిర్మించి, ఉప్పుటేరును వెడల్పు చేసి, 4, 5 సంవత్సరముల కొకపర్యాయం తమకు ప్రమాదం కలిగిస్తున్న కొల్లేటి ముంపుబాధనుండి తప్పించే ప్రయత్నం చేయవలసిందిగా వారు అధికార్లను కోరారు.

రాత్రి 8 గంటలకు తిరుగుప్రయాణంలో వస్తుంటే, స్వచ్ఛమైన వెన్నెలలో దిశావలయం వరకూ వ్యాపించియున్న జలరాశిలో చంద్రబింబం ప్రతిఫలించడం చూస్తే ప్రకృతి రామణీయకత బాగానే కన్పడింది గాని, ఆ జలరాశి అడుగున, వేలకొలది ఎకరాల పొలం ఉండి లక్షలకొలది ప్రజల కాహారము యివ్వగల పంట మునిగి నశించిపోతున్నదనే భావం మనస్సుకు తట్టగానే, ఎంతవానికైనా, హృదయవేదన కలుగకమానదు. అన్నింటికన్న మెరకన ఉన్న ఆగడాల్లంక గ్రామస్థితియే ఈలా గుంటే, యింకా కొల్లేటి లోలోపల పల్లపు ప్రాంతంలో ఉన్న యితరలంక గ్రామాలలో స్థితిగతులెలా ఉన్నయో ఊహింపవలసినదే.



(ఫోటో) అయ్యదేవర కాళేశ్వరరావుగారు ఆం॥రా॥ కాంగ్రెస్ సమావేశంలో పాల్గొనేందుకు వస్తున్నారు.

రుద్రమదేవి

(6-వ పేజీ తరువాయి)

కారులకు పరీక్ష కప్పగించి మరల గ్రహించిరి. ఇరువురు గణపతిదేవులకును మహాసభకును వీరోచితవందన మాచరించిరి. వా రొకరి ముఖము లొకరు చూచుకొనలేదు. ఒకరి దేహభంగి యొకరును ఒకరి ఖడ్గధారణభంగి యొకరును చూచుకొనిరి. రుద్రమది సనాతనాంధ్రనైఖరి. చాళుక్యవీరభద్రేశ్వరునదో, సనాతననైఖరి యేగాని యం దొక నవ్యత రుద్రమకు గోచరించెను. ఆ నవ్యతపై రుద్రమమనస్సు లగ్న మయ్యెను. ఆమెకు ఆ నవ్యతయే కలవరము కలిగించెను. ఇటు తనకును ఆ వీరనారివృద్ధప్రాచీననైఖరి యాందోళనము కలిగించెను.

ఇద్దరి ఖడ్గములును కలసినవి. ఆ కలయికలోననే వీరభద్రేశ్వరుడు దుగుసుగా ప్రవర్తించెను. రుద్రమదేవి నిపుణముగా కలిపెను. కొన్ని ఖడ్గభ్రమణము లైనవి. ముమ్మారు మధ్యవర్తులు క్రీడాయుద్ధ మాపి వీరభద్రేశ్వరుని అక్రమమార్గము నిరూపించి యతని సరిదిద్దుకొమ్మనిరి. రుద్రమ చిరునవ్వుతో మధ్యవర్తుల యనుజ్ఞ నిరీక్షించుచుండెను.

"ఇత డింత మూర్ఖముగా క్రీడించుచున్నా డేమి?"

"ఇత డిది క్రీడాయుద్ధముగా నెంచుచున్నట్లు లేదే?"

"నియమోల్లంఘనము చేయకున్న దోష మేమి? ఖడ్గయుద్ధము చెమ్మచెక్కవలె నుండునా?"

ఈ విధముగా ప్రేక్షకులు పరిపరివిధముల వీరభద్రేశ్వరుని యుద్ధమునుగూర్చి పలుకుచుండిరి. కాని యతనికి జయమొందవలె నను కాంక్షయేకాని వే రూహ లేకుండెను.

కొంతవడి రుద్రమ జయించున ట్లుండును. కొంతవడి తాను జయించున ట్లుండును. ఇద్దరును పరిశ్రాంతి నొందిరి. రుద్రమకు కేవల మది క్రీడగా నుండెను. అందుచే నామె కది యొక క్రీడావిశేషముగానే ఉండెను. మరి వీరభద్రేశ్వరునకో! అందులో నాతని జీవితసర్వస్వము కేంద్రీకృతమై యుండెను. ఈ క్రీడాయుద్ధములో నత డుత్తీర్ణుడు కానిచో జీవించి లాభ మేమి? ఆ రాత్రియే యత డాత్మహత్య కావించుకొనియుండును. అందుచే నలసిపోయిన యాతని యవయవములకు ఆతడు ప్రయత్నపూర్వకముగా అతని యంతరాంతరములనుండి యొక శక్తిని క్షణక్షణ ముద్బుద్ధము చేసికొనుచుండెను. అతడు విదేశములలో నలవరచుకొన్న నైపుణి యేమియు నచలమగు శ్రీరుద్రమఖడ్గవిద్యయెదుట పనికిరాలేదు. అధైర్యము కలిగెను.

వీరభద్రేశ్వరుడు కాలు నిలువద్రొక్కుకొనలే కుండెను. చూచువారి కతడు తూలిపడుపోవుచున్న ట్లుండెను. చేయి వడకుచున్న ట్లుండెను. రుద్రమదేవిహస్తమును శరీరమును ఏమరుపాటు లేకుండెను.

ఆ సమయములో వీరభద్రేశ్వరుడు మరల నొకసారి తన యంతరాంతరములలో దాగియున్న యాత్మశక్తిని జగిమచే నుద్బుద్ధ మొనర్చుకొనెను. అతని ఖడ్గాగ్రము నందలి సిందూరము రుద్రమదేవివక్షస్థల మంటి రంజిత మొనర్చెను.

చూచువా రది యెట్లు జరిగెనో తెలిసికొనలేకపోయిరి. వారి కన్నులనే వారు నమ్మలేకపోయిరి. వీరభద్రేశ్వరుడు శ్రాంతుడై తూలిపడిపోయెను. రుద్రమదేవి చిరునవ్వుతో నిలిచియే యుండెను. కాని రుద్రమ విజిత యయ్యె ననియు వీరభద్రేశ్వరుడు జయించె ననియు మధ్యవర్తులు ప్రకటించిరి.

ఆ ప్రకటనతో మరల తనకు తెలివి వచ్చెను. దేహము నెట్లో నిలువరించుకొని గణపతిదేవుల పాదపీఠమునొద్దకు పోయి యాతడు వందన మాచరించెను. యథార్థముగా జయించినది రుద్రమగానే ప్రాకృతులకు గోచరించినది. కాని క్రీడాయుద్ధవిదులకు వీరభద్రేశ్వరుడు జయించె ననుటలో సందేహము లేదు.

ఆపిమ్మట రెండు దినములకు చాపవిద్యాకౌశలపరీక్ష జరిగెను. మరల నందును నట్లే వీరభద్రేశ్వరుడు జయ మందె నని పరీక్షాధికారులు ప్రకటించిరి. అంతట శ్రీ గణపతిదేవుల యనుజ్ఞతో రుద్రమదేవి వీరభద్రేశ్వరుని కంఠమును ఇప్పపూలమాలతో నలంకరించెను. తన కా మహాభ్యుదయక్షణము నేడు ప్రవర్తించుచున్నట్లే తోచెను. అదియు చైత్రశుద్ధదశమి తనకే కాక అప్పుడు అది. చూచినవారి కందరకు కాకతిసామ్రాజ్యలక్ష్మియే యతని వరించినట్లు మూపట్టెను.

రాజపుత్రిక తన కంఠసీమను హారముతో నలంకరించినందుకే మాత్రమును అతడు పులకితుడు కాలేదు. కాని యప్పు డా కూడిన రాజకమంతయు నప్పుడు చేసిన జయఘోష కాతడు పులకితు డయ్యెను!

అప్పటినుండి యాతడు విశేషకాలము రాజధానీనగరముననే గడపసాగెను. శీఘ్రముగనే అతడు గణపతిదేవుని కుడిభుజమయ్యెను. సామంతుల కాతనిపై నసూయ కలుగుచుండ వారి నాదరబహుమానములచే నాతడు సత్కరించి యందర మైత్రి నేర్పుగా సంపాదించుకొనుచుండెను.

రుద్రమదేవివలన నాతనికి ముమ్మడమ్మ యను పుత్రికమాత్రమే కలిగెను పుత్రసంతానము కలుగు నను నాశ క్షీణింపజొచ్చెను. అంతట నాతడు తన సంస్థానపాలనభారము చిన్నకుమారు డగు మురారిదేవునకు అప్పగించి జ్యేష్ఠపుత్రు డగు హరిహరదేవుని రాజధానీనగరమునకు రప్పించి చక్రవర్తికొలువులో చేర్పించెను. హరిహరదేవుడు రుద్రమను నిజమాతవలె గౌరవించుచు నామెకును గణపతిదేవులకును ప్రజలకును ఇష్టు డయ్యెను. హరిహరదేవుడే గణపతిదేవునియనంతరమున చక్రవర్తి యగు నను భావము అందరకు దృఢపడుచుండెను.

ఇది యంతయు వీరభద్రేశ్వరుని మనోవీధిలో చిత్రపరంపరవలె భాసించెను. మహారాజ్యకాంక్షతో వంశక్రమాగత మగు తన కులగర్వమునే తాను పరిత్యజించెనే! దేనికై తా నా త్యాగ మొనర్చెనో ఆ ఫలము అనుభవించు సమయ మాసన్న మైనది నేడు! అది యందుకొనబోవుచుండగా నే డాకస్మికముగా భంగమైనది!

కాటికి కాళ్లు చాపుకొనియున్న యొక వృద్ధరాజు ఒకానొక సన్న్యాసి యాదేశముతో ఒక అబలను సాధనముగా చేసికొని తనకు ప్రాణప్రియ మగు జీవితాదర్శమును భగ్న మొనర్తురా? అత డే అది నమ్మలేకపోయెను.

రుద్రమదేవికి యౌవరాజ్యాభిషేకము చేయుట ప్రస్తుతము హరిహరుని త్రోసివేసి కాలాంతరమున ప్రతాపరుద్రదేవుని చక్రవర్తిని చేయుటకే యని తా నంతమాత్ర మూహింప లేకున్నా డా?

తన కిప్పుడు షష్టిపూర్తి యైనను దేహదార్ఢ్యముగాని బుద్ధికుశలతగాని యేమాత్రము తగ్గలేదు. మహావాహిని నింకను నిపుణతతో నడుపగలడు! రాజ్యతంత్రమును పటుత్వముతో నిర్వహింపగలడు! మరి యిప్పుడు తన కర్తవ్య మేమి?

అతడు నిజమందిరమునకు వచ్చినప్పటినుండియు పరమశాంతముగా ప్రవర్తించుచున్నను, అంతరంగమున తీవ్రముగా యోజించుచుండెను. తన సంకల్పమును వృథ కాకుండ చేయు నుపాయ మేమి? తనకు నిశ్చయముగా సహాయభూతు లగు మిత్రు లెవరు? తన్ను ప్రతిఘటించు శత్రువు లెవరు? ఈ వివాదమున తటస్థు లెవరు? ఉభయుల బలాబలము లెట్లున్నవి?

సభారంగమునను ఇందులో కొన్ని విషయములు స్పష్ట మయ్యెను. గణపతిదేవుని రాజ్యప్రారంభకాలమున ఆతని సామ్రాజ్యమూలస్తంభములై నిలిచిన పిల్లలమర్రిరెడ్లకీనాడు ఆస్థానములో నాదరము తగ్గినది. ఇప్పటికి కొంతకాలముగా పద్మనాయకులపై చక్రవర్తిపక్షపాతము అతిశయించినది. పద్మనాయకుల ప్రాపు తనకు ప్రాపించదు. ఈ పిల్లలమర్రి రేచర్లరెడ్డి దండనాథులు ఉపయోగపడుదురు. వారు మంచి శూరులు, యోధులు. కాని వారికి వారి పూర్వు డగు రుద్రదండనాథుని సమర్థత లేదు.

మరి సభకు రాకున్న అన్నయమంత్రియు కొలని రుద్రుడునో? ఆ బ్రాహ్మణులపై నాశ పెట్టుకొనరాదు. వారు ఎంత చదువుకొన్నను పూర్వాచారపరాయణులు! ఎంత సమర్థు లైనను ఆశావిహీనులు! ముదిరాజుచిత్తచాంచల్యమునే వారు తల దాల్చెదరు.

ఇక ప్రబలు రగు కాయస్థసేనానులు అంబదేవుడును జన్నిగదేవుడును ఉన్నారు. త్రిపురాంతకుడును ఉన్నాడు. వా రీ సభ కేలనో రాలేదు. వారు రాకుండుటకు కారణమునుగూడ తెలిపియుండలేదు. ముదుసలిరాజుకు వారిపై నాగ్రహ మంకురించినది. వారును ఏదో ఉద్దేశము లేక యిట్లు కారణము తెలుపక రాకుండరు. వారు చారులవలన రాజధానిరహస్యములను తెలిసికొని సమయానుకూలముగా ప్రవర్తింప నెంచియుందురు. వారి యాశలతో తన యాశలు ప్రతిఘటింపకుండునట్లు చూడవలెను. అది దుర్ఘటము!

కాని యిప్పుడు కర్తవ్య మేమి?—కర్తవ్య మేమి?

పూజ్యు డగు వీరభల్లటదేశికునికి సభాముఖమున ఆనాడు తనకై పరాభవ మైనది. పాపము, న్యాయ మాడిన యా మహానుభావునికి రాజసభలో అవమానమా? ఆయనను విస్తారగౌరవముతో రాజధానిలో జైను లందరు పూజించుచుండిరి. రాజధానిలోననె కాక రాజ్య మంతటను వ్రాయసకాండ్రు ప్రధానముగా జైనులే. మహారాజుల శైవాభిమానము చాలకాలముగా జైనులకు కష్టము కలిగించుచున్నది. కాని వారి యసమ్మతి యాగ్రహముగా రూపొందుటకు ఇంతవరకు నవకాశము కలుగలేదు. ఈ అవకాశము పురస్కరించుకొని వ్రాయసకాండ్రలో రాజకార్యములపై ద్వేషము కలిగించిన దండనాథులందరు కలసియు నేమియు జేయజాలరు. అందులో ఈ పద్మనాయకులకు చాలమందికి కత్తి పట్టుటయే తెలియునుగాని గంటము మొదలేదినో తుద యేదియోకూడ తెలియదు. వ్రాయసకాండ్రను తానుకూడగట్టుకొనుట ప్రథమకర్తవ్యము.

ఇదిగాక రాజ్యమునకు వెలుపల ఒకవైపున చోళులు, ఒకవైపున కొప్పెరుంజింగడు, ఒకవైపున దేవగిరియాదవులు, ఒకవైపున కళింగులు నున్నారు. వీ రెవ్వరైనను కాకతీయరాజ్యమును మ్రింగుటకు కుతూహలముతో నున్నవారే!

వీరభద్రరాజు నిద్రించుటకు బోయినట్లే శయనమందిరము ప్రవేశించెను. కొంతవడి యం దుండి కుడ్యమున వ్రేలుచున్న గణపతిదేవుల చిత్రపట మొకటి యించుక ఎత్తి యొక బెట్టు నొక్కెను. వెంటనే యొక లోహపుతలుపు ప్రక్కకు పోయి దారిచేసెను. అతడు లోనికి బోయి మరియొక్క బెట్టు నొక్కగా నాపటము క్రిందగోడ యథాప్రకారము మూసికొనెను.

అత డా దారిని కొంత దవ్వేగి యొక రహస్యాగారమును జేరెను. అది విశాలమైనది కాకున్నను పాతికమంది సుఖముగా కూరుచుండుట కనువుగా నుండెను. అచ్చట గాలి బాగుగా నాడకున్నను ఉడ్డుకుడుచుకొనునట్లు లేదు. వెలుతురుమాత్రము దివిటీలవలన పుష్కలముగా నున్నది.

అతడు వెళ్లునప్పటికే పలువు రందు సమావిష్టులై యుండి యాతని రాకకై నిరీక్షించుచుండిరి. అందులో పిల్లలమర్రిరెడ్లు ముఖ్యులు. రేచర్ల కామయ, నామయ, మల్లయ యను సోదరులును, గణపిరెడ్డి మల్రెడ్డి యను సోదరులును కలరు. రాజబంధువులలో గణపతిదేవుని మేనగోడలు పెనిమిటి ధాన్యకటకవాసి యగు కోట కేతరాజు ఒక్కడే యచట కలడు. ఆనెగొందిపాలకుడు రామదేవరాయలును ఆ చేరినవారిలో నుండెను.

వీరభద్రరాజు "బొల్లా!" యని పిలిచినంతనే మైలారు భటు డొకడు ప్రత్యక్షమై "'స్వామీ' ఏమి యాజ్ఞ?" అని యడిగెను.

"వీరభల్లటదేశికులకు రమ్మని విజ్ఞప్తి చేయలేదా?"

"వా రీ రాత్రి విశేషానుష్ఠాన మున్న దని సెలవిచ్చిరి."

"మంచిది!"

ఎవరును గుసగుసలుకూడ నాడుటలేదు. చేరినవా రందరికి మనస్సులు ఉద్విగ్నము లైయుండెను. ముందు వారందరు ఖడ్గములు ఒరలలోనుండి ఒక్కసారి బయటికి తీసిరి. తీసి వాని నన్నిటిని ఏకముఖముగా కలిపిరి. అవి యన్నియు నాలుకలు తెరచిన పాములవలె మెరసి యేకమై నాగపాశముగా విద్యోతించెను. ఎన్నియో విద్యుల్లతలు ఒక్కచో గలసి యాదరముతో పరస్పరమాలింగనము చేసికొన్నట్లే భాసించెను. అన్నియు కలసి అనేకశిఖల వెలుగుచున్న యగ్నిహోత్రుని మూర్తితోవలెనే అవి పొడగట్టెను.

అది నోటితో మాటలు చెప్పని యొక మహాప్రమాణము. శస్త్రజీవులకు వారి శస్త్రమే ప్రత్యక్షదైవము. ఆ ప్రత్యక్షదైవము నెవరిది వా రచ్చో నేకముఖముగా

(20-వ పేజీ చూడుడు)

కులాసాకబుర్లు :

"చెక్కిళ్ల చెక్కుళ్లు"

[జి. యన్. సూరి]

ఇది శాస్త్రజ్ఞులమహాయుగం. వాళ్లు జోక్యం కలుగచేసుకోనని విషయం లేదు. అయిన వాళ్లలో వివాహాలు మొదలుకొని ఆటంబాంబుల వరకూ వారి అన్వేషణకు సరికావలసినదే. వారి ముద్రపడవలసినదే. వారి మొహరుఉంటేనే గాని చాలామణికి అవకాశం లేదు. ఏపదార్థాలు ఈ కళేబరాలకు ఆహారయోగ్యాలో వాళ్లు నిర్ణయించాలి. ఎటువంటి పక్కమీద ఏవిధంగా శయనించాలో వాళ్లు శెలవియ్యాలి. ఆఖరుకు పళ్లు ఎట్లా తోముకోవాలో వాళ్లే చెప్పాలి.

ఈమధ్య పనిలేని అమెరికన్ శాస్త్రవేత్తలు కొందరు క్షురకర్మమీద సంకురుమయని నడిపించారు. రకరకాల గడ్డాలవారినీ పోగుచేశారు. పేడిమూతివాళ్లు, పిల్లిగడ్డాలవాళ్లు, మేకగడ్డాలవాళ్లు, బిరుసుగడ్డాలవాళ్లు మొదలైన నానావిధమబుకాలవారికీ జీతాలు ఇచ్చి తమ కార్ఖానాలలో మకాములు ఏర్పరచారు. క్షౌరుగుడు వ్యవహారంలో ఆరితేరిన పనివాళ్లను పిలిపించారు. నాటుకత్తులు, మడతకత్తులు, గండ్రకత్తులు, మొండికత్తులు, సేఫ్టీకత్తులు మొదలైన ఆయుధసామగ్రిని సమకూర్చారు. అనేకవిధాల నీళ్లు, సబ్బులు, బ్రష్షులు, పేస్టులు తెప్పించారు. ఒక్కొక్కక్షికి ఒక్కొక్క అస్త్రాన్ని ఇచ్చి గడ్డాలమీదికి ఉసికొల్పారు.

క్షవరానికి ముందు ప్రతిగడ్డాన్నీ పరీక్ష చేశారు. కొలతలు తీశారు. నిమిరి చూశారు. గొరుగుతున్నప్పుడు ఆ యజ్ఞపశువుల ముఖారవిందాలు ఏవిధంగా మారుతున్నయ్యో గమనించారు. క్రతువు పూర్తికాగానే తిరిగి కొలతలు తీశారు. మళ్ళీ నిమిరిచూశారు. హాయిగా ఉన్నదా అని ప్రశ్నించారు. చిట్టాలు తయారు చేశారు. ఈ విధంగా కర్మకాండ కొన్ని వారాలు జరిపి సుఖక్షవరప్రక్రియను నిర్ధారణ చేసి లోకానికి అందచేశారు.

సుతిమెత్తని సుఖక్షవరం కావాలంటే గడ్డానికి సబ్బునురుగును పట్టించి, బ్రష్‌తో మర్దించి ఆరు గంటలసేపు నాననివ్వాలిట. ఆపైన మొండిబారని పదునుకత్తిని చేత పట్టాలిట. చర్మానికి ఇరవై ఐదు డిగ్రీలు వాలేట్లు ఆ యుధాన్ని ఉంచి పట్టి ఒడుదొడుకులు లేకుండా సూటిగా నడిపించాలిట. నెత్తురు కంటబడేదాకా వాలు ఎదురులు దోకాలిట. అట్లా చేస్తే రోమశేషం లేకుండా పోతుందిట! ఈ విధానం ఇంతశ్రమపడి, శ్రమపెట్టి కనిపెట్టినందుకు వచ్చే సంవత్సరం నోబెల్ బహుమానాన్ని ఈ శాస్త్రజ్ఞులకు ఇచ్చితీరాలి.

శిఖండి గాని ప్రతి మగవాడికీ తెగని సమస్య క్షవరకల్యాణం. ఎవడి లెక్కన వాడి గడ్డం ప్రపంచంలో కల్లా బిరుసైన పదార్థం. ఇతరుల ఘనతను మిగతా ఏ విషయంలోనైనా ఒప్పుకుంటాడుగాని గడ్డం బిరుసుతనంలోమాత్రం ఒప్పుకోడు. నాకు ఏ బ్లేడ్ అయినా ఒక క్షవరానికిమించి రాదు అని ఒకడంటే, చెంపకు ఒక్కొ త్తబ్లేడు ఉంటేనేగాని నాగడ్డం తెగదంటాడు మరొకడు. ప్రొద్దున నిద్దురలేవగానే గడ్డం చేసుకోటం కనిపెట్టినవాడిని తిట్టిపొయ్యని నవనాగరికుడు ఉండడు.

ఎవడికి వాడు మంగలిగా మారిపోయినతరువాత ఈ వృత్తిలో ఉన్నవాళ్లకు ప్రాధాన్యత తగ్గిపోయిందిగాని పూర్వపు రోజులలో మంచి పనితనం ఉన్నవాడికి లాభసాటిగా ఉండేది. రసజ్ఞులు మడిమాన్యాలను ఇచ్చేవాళ్లు. రాయలవారు ఒకనాడు ఆస్థానమంగలికి కబురంపి ఆతడు వచ్చేటప్పటికి కుర్చీలో కునుకుపోయినాడుట. రాజుగారిని నిద్రలేపకుండా ఎంతో ఒడుపుతో గులాబిరెక్కలాగా నునుపుగా క్షవరంచేసి పనివాడు వెళ్లిపోయినాడుట. రాయలవారు కొంతసేపటికి నిద్రలేచి వాడు ఇంకా రాలేదా అని గడ్డు ఉరిమి కేకవేశారుట. అంతట దాసీలు జరిగిన సంగతి విన్నవించి పన్నీరుస్నానానికి వేంచేయమని మొత్తుకున్నారుట. చక్రవర్తి ఆశ్చర్యంతో గడ్డం తడువుకుని మహదానందంతో రెండు మత్తకోకిలలను ఆశువుగా చెప్పి, పనివాడిని పిలిపించి పది ఊళ్లు ఈనాములు ఇచ్చారుట.

కాలేజీలో చదువుకునే రోజులలో మాకు ఒక సహాధ్యాయి ఉండేవాడు. ప్రతిరోజూ తెల్లవారగానే మంగలికత్తిని టపటపమని దరువులమీద పదునుపెట్టి బడివేళఅయేదాకా సాము చేస్తూనే ఉండేవాడు. కాని పరిక్షలు ప్రారంభం కాగానే పాదిని భద్రంచేసేవాడు. ఎన్నిరోజులు పరిక్షలు జరిగితే అన్నిరోజులూ గడ్డం పెంచేవాడు. ఆ తరువాత ఫలితాలు వచ్చేనాడు క్షవరం చేసేవాడు కాడు. ఎందుకురా ఈ గడ్డపుసమ్మె అని ఎవరైనా అడితే అప్పుడు క్షవరం మానకపోతే క్షవరంఅవుతుందిరా అనేవాడు. ఇప్పుడు వాడు స్లీడరీకం చేస్తున్నాడు. ఇప్పటికీ పెద్దకేసుఉన్నరోజున కత్తిని తాకినపాపాన పోడు.

మావూరి మునిసిపల్ వైద్యశాలలో డాక్టరుగారు ఒకరుండేవారు. ఆయనకు క్షవరం అంటే సరిపడేదిగాదు. తరచుగా గొరిగితే గడ్డం పాడైపోయి తన తెల్లనిముఖం నీలిబారుతుందని హడలిపోయేవాడు. అందువల్ల వారానికి ఒక్కసారి మాత్రం చేయించేవాడు. ఒకరోజు అందంకోసం ఆరురోజులు మునీశ్వరు డయేవాడు. ఈతడవ కొడుకా కూతురా అని గడ్డంపెంచుతున్నందుకు స్నేహితులు ఎగతాళిచేసేవాళ్లు.

ఇప్పటి కవిశ్రేష్టులలో ఒక సోకుదారి కవివరేణ్యుడున్నాడు. ఎన్నాళ్లు చూసినా ఒకే మాదిరి కనబడుతాడు. పిల్లలు పెద్దవాళ్లయినారు; పెద్దవాళ్లు పండి రాలిపోయినారు. ఆయనలో మాత్రం ఏ మార్పు రాదు. తుమ్మెదరెక్కలాగు ఉంటవి. జులపాలు, నేరేడుపండులాగా నిగనిగలాడుతుంది గడ్డం. ఇంటిదగ్గర ఆయన ఉన్నంతసేపూ పక్కనే సేఫ్టీరేజరు సిద్ధంగా ఉంటుంది. వచ్చినవారితో కబుర్లు చెపుతూ ఇట్టే గడ్డం తవిడిమాస్తాడు. వెంటనే వాలుగా, ఎదురుగా, ఏటవాలుగా నీళ్లు అయినా రాయకుండా బరికి పారేస్తాడు. అది కేవలం అంతులేని క్షవరం. కవిత్వానికి కావలసిన ఇన్‌స్పిరేషనును ఈవిధంగా హుషారుచేస్తాడేమో ఆయనకే తెలియాలి.

మోడుతగలని సాపుక్షవరంకోసం అనేకమంది నానాయాతనలూ పడతారు. కనిపించిన సబ్బు నల్లా కొంటారు. ప్రకటనలను చూసి అడ్డమైన క్రీములను వాడుతారు. స్నోలను రుద్దుతారు. లోషన్లతో తడుపుతారు. ఆబ్లేడు కాదని ఈబ్లేడూ, ఆకత్తి కాదని ఈ కత్తీ మారుస్తారు. అంతాయింతా కనికరం లేకుండా తమ స్వంతగడ్డాలను చేతులారా చిత్రికపట్టి మెరుగుకాగితం అరగదీస్తారు. పటికరాతిని ప్రయోగిస్తారు. దయ్యమంత ముఖం కనబడే అద్దాలను ఉపయోగిస్తారు. అప్పటికీ తృప్తిపొందక అవకాశం దొరికినప్పుడల్లా గడ్డాన్ని గురించి విసుకుపుట్టేవరకూ ఏకరువు పెడతారు. వారి క్షోభ చెప్ప శక్యంగాదు. ఈ తిప్పలు పడలేకనే మన ఋషులు గడ్డాలను పెంచారు. ముస్లిములు దాడీని సాగుచేశారు.

ఇటువంటి బుద్ధిమంతులకు పాశ్చాత్యశాస్త్రజ్ఞులు తారకమంత్రం ఇప్పుడు ప్రసాదించారు. ఇక కృతార్థులు కాగలరని ఊహించుకోవచ్చు. ఇదివరకు ఉన్న సరుకు సరంజామాకు ఈ కొత్త ప్రక్రియను అనుసరించి ఒక ప్రొట్రాక్టరును గూడా చేర్చవలసిఉంటుంది. అది లేకపోతే ఇరవై అయిదు డిగ్రీలకు సరిగ్గా కత్తివాలిందీ లేనిదీ చూడడం కష్టం. అందంయావత్తూ నున్నని గడ్డంమీదనే ఆధారపడి ఉంటుందని నమ్మినవాళ్లు ఇటువంటి పరికరాలను సంపాదించి రోజుకు కొన్ని గంటలసేపు సాము చేయటానికి వెనుకాడగూడదు. కష్టే ఫలే అని మన వాళ్లు ఊరికే అన్నారా మరి!

రుద్రమదేవి

(19 వ పేజీ తరువాయి)

న్యాసముచేసిరి. అందుచే నీవిధముగా కత్తులు కలిపినవారు మరల తిరిగిపోమనియు నొకరి కొకరము ఆప్తమిత్రులముగా నుందు మనియు తీవ్రముగు ప్రమాణము చేసి రన్నమాట! ఈ ప్రమాణము చేసినతరువాతి నా సభారహస్యము బయటికి పోరాదు. అందులో నెవరైన నే కారణముచేనేని వెనుకంజ వేసిరేనియు ఈ రహస్యము రహస్యముగనే యుండితీరును!

అంతట సంభాషణ ప్రారంభమయ్యెను. నూతను డగు నొక విచిత్రపురుషుడా సంభాషణ మారంభించెను. అతడు చాలకాలమునుండి పశ్చిమపు సరిహద్దున గ్రామములలో పర్యటించుచుండెను. అతని పే రెవరికి దెలియదు. అతడు మహాభక్తుడు, మహాయోగి, సకలధర్మవేత్త, మహాతపస్వి యని ప్రజలలో నమ్మకముండెను. అతనికి వేదశాస్త్రములే గాక యంతకంటె క్షుణ్ణముగా జైనబౌద్ధగ్రంథములును కొరానును బైబిలునుకూడ వచ్చును.

ఆ సభ రాత్రి మూడుజాములవరకు సాగెను. తెలుగుసామ్రాజ్యమును నాలుగువైపులనుండి ముంచివేయుటకు విజృంభించుచున్న నాలుగు సేనావాహినులకును యథాశక్తిగా చేయూతి యిచ్చుటకు ఆ రహస్యసభలో నిర్ధారణ జరిగినది. అందులో వారు ఎవరెవరే కార్యము సాధింపవలెనో విభజించుకొనిరి. ఇట్లు వచ్చెడి శత్రువాహినులకు ఎదురులేకుండుటకు రాజధానీనగరమునను కల్లోలములు ప్రేరేచుటకును నిశ్చయించిరి.

ముందు కార్యభార మూనుటకు ఉద్యుక్తులూగినవారు పల్లలమర్రిరెడ్లు. వారు కొప్పెరుంజింగని కూతగా నుండ నియ్యకొనిరి. కోటకేతరాజును రామదేవరాయలును చోళసైన్యములకు సహాయము చేయుట కొప్పుకొనిరి. కళింగబలములకు మురారిదేవుడు తోడుగా నంగీకరించెను. హరిహరదేవుడు దేవగిరి కేగ నియమితు డయ్యెను. వీరభద్రేశ్వరుడు స్వయముగా రాజధానీనగరమున నుండి నూతనవిచిత్రపురుషునితోడను జైనామాత్యులతోడను అంతఃకలహములు రేపు పాలు పంచుకొనెను.

ఆ సభావసానమున ఆ మహాలయామావాస్యాపరరాత్రవేళ ఆ కూడిన వీరులందరు కాకతీయసామ్రాజ్యమున కంతటికి శ్రీహరిహరదేవరాయలను మహారాజుగా చేసి యతని యాజ్ఞలకు విధేయులై యుండుటకు ప్రతిజ్ఞలు ప్రమాణపూర్వకముగానొనర్చిరి.

అజ్ఞాతకులగోత్రనాము డగు నా నూతనమహాయోగి బొల్ల డందిచ్చినవారితో నాతనికి పట్టాభిషేక మొనర్చెను. అత డప్పు డుచ్చరించిన మంత్రములును అతని సమస్తచర్యలవలెనే అభినవములు. ఆ అభినవత్వములో నొక చిత్రశక్తి ద్యోతమయ్యెను. హరిహరదేవరాయ జయజయ! యను శబ్దములతో నా రహస్యసభ ముగిసెను.

చలనచిత్ర సమీక్ష :



న్యూ థియేటర్సు వారి "ఛోటా భాయ్" లో మొలీనా, పకూర్.

న్యూ థియేటర్సువారి "ఛోటా భాయ్"

శరత్ బాబు రచించిన బెంగాలీ నవల 'రామేర్ సుమతి' కి శ్రీ శివరామశాస్త్రిగారి "రాముని బుద్ధిమంతనం" ఆంధ్రదేశానికి చిరపరిచితమే. ఈ నవలలోని ఇతివృత్తాన్ని న్యూ థియేటర్సువారు "ఛోటాభాయ్" అనే హిందీచిత్రంలో కెత్తారు. కార్తీక ఛటర్జీ దర్శకత్వం కింద వంగదేశపు పల్లె జీవనం కన్నులకు కట్టినట్లుంది. రాముడుగా పకూర్, రాముని సవతి అన్న భార్యగా మొలీనా కథాంశాన్నీ నవలాకారుని ఆశయాన్నీ అవగాహన చేసుకుని మనోజ్ఞంగా నటించారు. ఇప్పుడీ చిత్రం చెన్నపట్నం 'సాగర్' టాకీసులో ప్రదర్శించబడుతోంది.

నారసింహ లేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము, వి క్కా శ, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును కాంతిని వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

పి. సి. ఏ. & కంపెని. పెరిదేపి-నెల్లూరు జిల్లా

బ్రాంచి: 7 సీను మొదలివీధి, మద్రాసు.

మనరాష్ట్రం : మనదేశం :

ఈ నాటికి మనకొకరాష్ట్రం, మనజాతి సర్వతోముఖవికాసానికి అవకాశం లభించనున్నది

ఆంధ్రదేశానికి శుభదినం సమీపిస్తోంది. భారతీయ రిపబ్లిక్ అవతరణతోపాటు ఆంధ్రరాష్ట్రం అవతరించనున్నది. తమిళ్నాడుకాంగ్రెస్, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్, మద్రాసు ప్రభుత్వాలు మూడు పట్టాభి-పటేల్-నెహ్రూ కమిటీనివేదికను ఆమోదించాయి. ఈ మాసం మూడోవారంలోనే 1935 భారతరాజ్యాంగ శాసనం ప్రకారం గవర్నర్ జనరల్ ఆర్డినెన్సు రాగలదు. నూతన రాజ్యాంగ చట్టంలో ఆంధ్రరాష్ట్రం ప్రత్యేకరాష్ట్రంగా పేర్కొనబడగలదు. జనవరి 26 తో ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం అధికారం స్వీకరిస్తుంది.

నలభైఏళ్లుగా ఆంధ్రరాష్ట్రనిర్మాణోద్యమం నడిచింది. స్వర్గీయ శ్రీ కొండ వెంకటప్పయ్య పంతులుగారు ఈ ఉద్యమాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ సంస్థ భాషారాష్ట్ర నిర్మాణ సూత్రాన్ని బలపరిచింది. ఆతరువాత కాంగ్రెస్ వ్యవహారాలనిమిత్తం ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ ప్రత్యేకంగా ఏర్పడింది.

పరాయి పాలకులు మనకు రాష్ట్రం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పుడు, దేశస్వాతంత్ర్య సమరంకోసం ఆ తరుణాన్ని విడిచిపెట్టారు. జాతీయ స్వాతంత్ర్యమే సిద్ధించినట్లయితే ప్రజాస్వామ్యవిధానానికి పునాదియైన భాషారాష్ట్ర పరిపాలనావిధానం అమలు జరుగుతుంది అనే విశ్వాసంతో ఆంధ్రులు అనేక అవకాశాల్ని జారవిడుచుకున్నారు. తీరా స్వాతంత్ర్యం లభించినతరవాత అనేక కొత్తసమస్యలు వచ్చిపడ్డాయి. దేశైక్యత భగ్నమయ్యేప్రమాదం పొంచి చూస్తోంది. ఈ సమయంలో విద్వేషాలకూ వైషమ్యాలకూ తావియ్యరాదని జాతీయ నాయకులు కృషిచేశారు. తత్ఫలితంగా భాషారాష్ట్రనిర్మాణం వాయిదా పడిపోయింది. ఆంధ్రుల సముచితకాంక్షను గుర్తించిన కేంద్ర నాయకులు ఆంధ్రుల కొక్కరికీ ఇప్పుడు ప్రత్యేకరాష్ట్రం ఇవ్వడానికి అంగీకరించారు. అయితే వైషమ్యాలు పెరగకుండా జాగ్రత్త వహించాలనీ, వైషమ్యాలు పెరిగే పక్షంలో ఆంధ్రరాష్ట్రనిర్మాణం సాధ్యపడదనీ స్పష్టపరిచారు. ఎక్కడెక్కడ తగవులున్నాయో అక్కడక్కడ సర్వజనామోదమయిన నిర్ణయాలు చేసి సర్వభాషాపక్షాలకూ అంగీకారయోగ్యమైన రీతిని ఆంధ్రరాష్ట్రాన్ని నిర్మించుకోవలసిందని గాంధీమహాత్ముడాదేశించారు. మహాత్ముని ఆదేశం ఫలోన్ముఖం కానున్నది. వాదగ్రస్తమైన ప్రాంతాల్ని విడిచి మిగిలిన నిర్వివాదమైన ప్రాంతాలతోనే రాష్ట్రాన్ని నిర్మించుకోడానికి సర్వపక్షాలవారూ అంగీకరించారు.

ఇట్టి శుభనిర్ణయానికి రాష్ట్రపతి డా॥ పట్టాభిగారిని ఆంధ్రదేశమంతా అభినందించాలి. సమయోచితంగా నాయకత్రయని వేదికకు వ్యాఖ్యాన మిచ్చి, ఆంధ్రుల సందేహాలను తీర్చి ఏకగ్రీవామోదానికివారవకాశం కల్పించారు. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సమావేశమయ్యేముందు చెన్నపట్నంలో ఈ వ్యాఖ్యానం ప్రకటించారు. చెన్నపట్నాన్ని పరిసరద్విభాషాప్రాంతాలతో చేర్చి ప్రత్యేకరాష్ట్రంగా నిర్మించడానికి అగ్రనాయకత్రయం అభ్యంతరం చెప్పడం లేదన్నారు. చెన్నపట్నంగురించి ముందుముందు ఎటువంటి నిర్ణయం జరిగినప్పటికీ అక్కడ నివశిస్తున్న ఆంధ్రుల్నిగురించి ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధవహించరాదనే నిషేధమేమీ లేదని చెప్పారు. భారతదేశంలో మిగత ద్విభాషా ప్రాంతాలన్నిటినీ ఒక సరిహద్దు నిర్ణయసంఘం పరిశీలించేసమయంలోనే, చెన్నపట్నం విషయంకూడా నిర్ణయించబడుతుందని చెప్పారు. అది బొంబాయినగరభవిష్యన్నిర్ణయంతోపాటైనా జరుగవచ్చు లేదా పదేళ్లలో మిగతా భాషారాష్ట్రాల సమస్యను పరిష్కరించే సమయంలోనైనా జరగవచ్చు.

ఈ వ్యాఖ్యానాన్ని ప్రకాశంగారు, రంగాగారు, రాయలసీమనాయకులు మొత్తం ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్‌సభ్యులు ఆమోదించారు. చెన్నపట్నంగురించి మొదటినుంచి న్యాయమైన హేతువులవల్లనే పట్టుదలతో ఉన్న రాయలసీమవారుకూడా ఆంధ్రరాష్ట్రనిర్మాణావకాశాన్ని తల్చుకుని మనస్సు మార్చుకున్నారు. నాయకత్రయని వేదికను అంగీకరించరాదని ఆంధ్రరాష్ట్రకాంగ్రెస్ సమావేశంలో పోరాడాలనే ఉద్దేశంతో వచ్చినవారుకూడా, రాష్ట్రనిర్మాణావకాశానికి ఆంధ్రులు పొందుతున్న ఆనందోత్సాహాలుగమనించి, తామూ వారితో కలిశారు.

ఆంధ్రకాంగ్రెస్‌నాయకుల మధ్య ఏకాభిప్రాయం కలగడం, ప్రకాశంగారు ప్రతిపాదించిన తీర్మానానికి ఏకగ్రీవామోదం లభించడం తమిళులకే కాక ఆంధ్రకాంగ్రెస్ నాయకులకే ఆశ్చర్యం కలిగించింది. రాయలసీమ నాయకులు ప్రతిఘటిస్తారని ఆశించినవారు తెల్లబోయారు. రాయలసీమనాయకుల్ని సమ్మతింపచేసిన శ్రీకళా వెంకట్రావుగారి కృషి ప్రశంసనీయం. ఈ అదనులో వివిధ కక్షులమధ్య దైవికంగావచ్చిన ఐకమత్యం చెదిరిపోకుండానిలబెట్టుకోవాలని చాలమంది ఆశిస్తున్నారు. ఇది సాధ్యమో కాదో, సందేహమే కాని రాయలసీమవాసులకు కోస్తాజిల్లాలవారి మైత్రి సహకారులలో విశ్వాసం కలిగింది.

రాయలసీమ కోస్తాసీమ భిన్నంకావనీ, ఏకఖండమేననీ, ఇరుప్రాంతాలవారూ తెలంగాణావారూ చేరికలిసినప్పుడే ఆంధ్రజాతికి సమగ్రస్వరూపం ఏర్పడుతుందనీ ఏప్రాంతంవారూ మరిచిపోరాని విషయం.

భాషారాష్ట్ర విభజనసూత్రంలో విశ్వాసం లేనివారికి ప్రజాస్వామ్య విధానంలోనే విశ్వాసం లేదని చెప్పాలి. చెన్నరాష్ట్ర పరిపాలనావిధానం ఏరీతిగా జరుగుతోందో గమనించినవారికి భాషారాష్ట్రవాదం బోధపడుతుంది.

ప్రభుత్వకార్యకలాపాలన్నీ ప్రాంతీయ భాషలలో నిర్వహిస్తేగాని ప్రజలకు పరిపాలనాయంత్రాంగం సన్నిహితం కాజాలదని మద్రాసు రాష్ట్రం నిరూపిస్తోంది. భాషావైషమ్యాల ఫలితంగా ఆంధ్రదేశంలో ఆర్థికాభివృద్ధికార్యక్రమాలన్నీ కుంటుపడుతున్నాయి. ఈ వైషమ్యాలను తొలగించడానికి సర్వవర్గామోదమైన విభజనొక్కటే మార్గమని మద్రాసు ప్రభుత్వం క్రింద ఉద్యోగం చేస్తున్నవారికి తెలుసును.

ఇంక ఏ కొత్తసమస్యలూ వచ్చిపడకుండా వెంటనే రాష్ట్రపరిపాలనను విభజించడం మంచిదనీ, జనవరి 26 వ తేదీవరకూ వేచివున్నట్లయితే ఈలోగా పరిపాలనాయంత్రాంగం స్తంభించిపోగలదనీ అనేకమంది అభిప్రాయపడుతున్నారు. కేంద్రకాంగ్రెస్, భారతప్రభుత్వం ఈ విషయాన్ని పరిశీలించి వెంటనే తగు నిర్ణయం చెయ్యడం మంచిది.

సహాయనిరాకరణోద్యమంలోనూ, హరిజననిధివసూలులోనూ ఆంధ్రదేశం అపారకృషి చేసిందని గాంధీమహాత్ముడొకప్పుడు ప్రశంసించారు. ఆంధ్రదేశంపట్ల తనకు ప్రత్యేకాభిమానం ఉన్నట్లుకూడా గాంధీజీ కొన్ని వ్యాసాలలో వ్యక్తపరిచారు. అట్టి ఆంధ్రదేశం గాంధీ మహాత్ముని ఆశయాలను సఫలం చెయ్యగలదని భారతదేశం ఆశిస్తుంది. [సీతారాం]

పండిత జవహర్‌లాల్ నెహ్రూ

(9-వ పేజీ తరువాయి)

సాన్నీ, శక్తినీ సమకూర్చేవి. నెహ్రూ చాలా ఎక్కువగా చదువుతుండేవాడు. కాని, ఆ చదువులోనే, మా నిత్యకృత్యాల్లో పాల్గొనే తీరిక చేసుకొనేవాడు. తోటపని అంటే అతనికి సరదా. తన పాకశాస్త్రప్రావీణ్యతను కోడిగుడ్లు వేయించటంవరకే ఉగ్గడించుకొనేవాడు. అతని పరిచయం ఆనందదాయం - మైత్రిలో ప్రాణమిచ్చే సాహసి అతను. ఎవళ్లమీద అన్నా వేళాకోళాలు విసిరితే విని పసిపిల్లవాడిలాగా ఆనందించగలిగేవాడు—తన ఒక్కడిమీదతప్ప-అయితే, తనమీద వేళాకోళాలను భరించగల సద్ధర్ములు మనలోమాత్రం ఎంతమంది ఉన్నారు? పైకి అంత తొందరపాటువాడుగా కనిపిస్తున్నా చాలా ఓరిమికలవాడు. అదీకూడా- అతి ఓరిమి.—"నే చెప్పిందే వేదం" అన్న పద్ధతిలో సామాన్యంగా మాట్లాడే తీరు- ఇంతటి ఓరిమినీ కప్పిపుచ్చి వేస్తుంది. అప్పుడప్పుడు కన్పించే, ఆ ఉద్రేకమూ, పొంగులూ అన్నీకూడా, లోపలి మెత్తదనాన్ని- నిజానికి నీరసగుణాన్ని - కప్పిపుచ్చేందుకు ఎరువు తెచ్చుకొన్న కవచాలుమాత్రమే. ఆజన్మభోగిగా జన్మించి, పొగడ్తలఘోషలలో పెరిగినవానిలో, అతనిలో ఉన్నంత స్వల్పమాత్రంగానైనా బడాయి లేకుంటేనే వింత అనిపించేదేమో!

ముప్ఫైఏళ్లక్రిందటకూడా అతను అచ్చంగా ఇప్పటిలాగే ఉండేవాడు. ఆ మనోజ్ఞత్వమూ, ఆ దిలాసా, ఆ ప్రజాస్వామ్యాభిమానమూ, ఆ నిరంకుశభావమూ, ఆ నిస్సంగత్వమూ, ససంగిత్వమూ, రాద్ధాంతసిద్ధాంతములలో ధిక్కారభావము, కార్యాచరణలో అనుకూలవర్తనమూ, అప్పటికీ ఇప్పటికీ అతనిలో ఒకేమాదిరిగా ఉన్నాయి. అతనిమనస్సు నూత్నవిషయగ్రహణానికి సదా సంసిద్ధము. నూత్నభావాలు, కొత్త శబ్దజాలాలు అతిసులభంగా అతన్ని ఆకర్షిస్తాయి. ఆరోజుల్లో, రెండుతత్వాలుమంచిప్రాబల్యంలో ఉన్నాయి. అటు యూరప్‌లో సామ్యవాదము. ఇటు ఇండియాలో గాంధీతత్వము. సహజసిద్ధంగానే ఈ రెండు తత్వాలకూ తలఒగ్గాడు. రెండూ కొత్తవే. రెండూ ప్రచండమైనవే. ఈ రెంటినీ సమన్వయం చేయటం ఏనాడూ సాధ్యంకాలేదు.

ఇప్పటికిన్నీ, రెంటిలోనూ సామరస్యం, విడనాడి ప్రవర్తించినంతలో తప్ప అతనికి చిక్కలేదు. ఈ అతివిషయగ్రహణశక్తీ, అతనిలో సుగుణమూ, దోషమూకూడా వర్తిస్తోంది. ఒకవైపున కొత్త కొత్త విషయాలను వెంటనే స్వీకరించి వివిధవర్గాల ప్రజకు ప్రబోధకరంగా విజ్ఞాపించగల సామర్థ్యాన్ని కలుగచేస్తోంది. కాని మరొకవైపున క్రియాసామర్థ్యానికి అడ్డులగులుతూ అస్థిరచిత్తుణ్ణి చేస్తూంది. అతన్ని హామ్లెట్‌తో పోల్చారంటే ఆశ్చర్యం ఏమీ లేదు.

నెహ్రూ స్నేహపాత్రుడు. కాని స్తోత్రప్రియుడు. బాపూకూడా స్తోత్రప్రియుడే కావచ్చును. కాని స్తోత్రపాఠమేదో, కానిదేదో గాంధీజీ ఇట్టే పసిపట్టగలిగేవాడు. జహ్వారు కా పని చేతకాదు.

పాశ్చాత్యపద్ధతిలో, నీటుగా గోటుగా కనిపించి, చాకచక్యం ప్రదర్శించే పూతమెరుగులకు ఇట్టే భ్రమసిపోతాడు. ఇతరులను ఇంత భ్రమింపచేయగల్గిల వ్యక్తి, ఇతరులను చూసి తానేభ్రమసిపోవటం నిజంగా వింత విషయమే. "టైము న్యూస్" అనే అమెరికా పత్రికలో పండిత నెహ్రూ ప్రవృత్తిని వివరిస్తూ వ్రాసిన ఒక వ్యాసంలో "ఇవాళ అతని ఆప్తమిత్రులంతా, ఢిల్లీలోని విదేశీయుల పేటలలో ఉన్నారు. బ్రిటిషుయూనివర్శిటీ డిగ్రీలు, బ్రిటిషువారి ప్రభుత్వకాలంలోకన్న ఈనాడు ఎక్కువ చలామణిలో ఉన్నాయిఅనే ఢిల్లీలో అంటున్నారు" అన్న వ్రాతనుచూసి, ఆశ్చర్యపోయాను. ఈ సంగతి నాకు తెలియనే తెలియదు. అతడుబహు కార్యనిమగ్నుడై ఉండడం వల్ల నేను అతన్ని కలుసుకొనేఅవకాశంఅరుదుగా ఉంటూవచ్చింది.

నెహ్రూ మన ప్రధానమంత్రి ఒకవిధంగా అతడు ప్రధాన మంత్రి అవటం అనివార్యమయింది. ప్రజాసామాన్యానికి, అతనియందు నమ్మకంఏర్పడింది. బాపూజీకి అతనంటే చాలా మక్కువ. నమ్మకమూ ఎక్కువే. అంతర్జాతీయంగా అతనుపేరుప్రఖ్యాతులు గౌరవం పొందినవాడు. క్రొత్తగా స్వాతంత్ర్యం లభించిన భారతీయులమైన మనము, మనవాడు పాశ్చాత్యలోకంలో ప్రశంసింపబడుతున్నాడంటే ఉబ్బితబ్బిబ్బైపోయాము.

అల్పసంఖ్యాకవర్గాలు, అతని మతప్రమేయరహితవ్యవహారవిధానాన్ని చూసి అతన్ని విశ్వసించాయి. తమ సంస్కృతి అతనిలో జీర్ణమయినందుకు బ్రిటిష్‌వారు సంతోషించారు. సామ్యవాదులు అతను తమలోవాడే అనుకొన్నారు. అతని బెదిరింపులు ఏపాటివో ధనికులకు తెలిసినవిషయమే. ఈ విధంగా, అతన్నే కోరుకోవటంవల్ల పరస్పరవిరుద్ధశక్తులన్నీ కూడా, సంతృప్తిపడ్డాయి. నెహ్రూ మన ప్రధానమంత్రి అయినందుకు నాకు చాలా సంతోషమే. కాని, నిర్దాక్షిణ్యమైన పద్ధతుల ననుసరించి, కఠినచిత్తంతో, వజ్రసంకల్పంతో, నిర్వహించవలసిన బ్రహ్మాండమైన వ్యవహారభారము అతనిపైనుంది. అందుకే నెహ్రూకోసం నేను విచారిస్తాను.

కొన్ని ఏండ్లక్రింద మోడరన్ రివ్యూపత్రికలో, మారుపేరుతో, ఆయన తన స్వభావాన్ని విమర్శిస్తూ ఒక వ్యాసం వ్రాశాడు. అందులో తన్నుగురించి ఇల్లా వ్రాశాడు. తన సంకల్పములు జరిగితీరవలెననే అత్యావేశంలో, తను సహింపరాని విషయాలను నిర్మూలించి క్రొత్తవాటిని నిర్మించవలెననే మహోత్సాహంలో, ఈ తాబేటినడకల ప్రజాస్వామ్యసంస్కరణ విధానాలను అతను ఎంతమాత్రము సహించలేడు. ప్రజాస్వామ్యస్థూల స్వరూపాన్ని నిలబెట్టినా, తన యిష్టానికి అది లొంగితీరేటట్లు చూస్తాడు" అని వ్రాశాడు. నిజంగా ఆమాటలు నిజమే అయితే ఎంత బాగుండునా అని నేననుకొంటాను. దురదృష్టవశాత్తూ, అతని సంకల్పమే పైవాటికి లొంగిపోతోంది. మునుపు అతను అసహ్యించుకొన్నవాట్లనుగాని, లేదా ఈనాడు అతను అసహ్యించుకొంటున్నవాట్లను గాని వేటినీ తుడిచిపెట్టలేకపోయాడు.

నేడు విదేశాలలో మూటగట్టుకొనివచ్చిన పేరుప్రతిష్ఠలతో స్వదేశానికి తిరిగివచ్చాడు. అతన్ని ప్రేమిస్తాము. అతని ప్రభావం ఖండాంతర విస్తృతినందినందుకు గర్విస్తాం. కాని ఇంద్రధనుస్సులోని రంగులవలెనే, ఈ పేరు ప్రతిష్ఠలు శాశ్వతాలుకావు. జవహరులాల్ నిజమైన ఘనత భారతదేశప్రత్యక్షవ్యవహారరంగంలో వేరుదన్ని నిలచిననాడే దానికి శాశ్వతత్వముంది. ఇన్నాళ్లూ, విరివిగా ధీరోదాత్తంగా చేసిన వాగ్దానాలన్నింటినీ చెల్లించవలసిన సమయం వచ్చింది. పరిపాలనాచక్రంలోని అసమర్థత అక్రమవర్తనను అతను తొలగించవలసిఉంది. వ్యాపారరంగంలో బ్లాక్‌మార్కెటు నిర్మూలించవలసివుంది. ప్రభుత్వం అన్నమాటను చెల్లిస్తుందనే నమ్మకం ప్రజల్లో కల్గించాలి. ఏ విషయములైతే ప్రభుత్వము చేయలేదని ప్రజలు నిస్పృహులై ఉన్నారో, వాటిని నెరవేర్చగల్గుటకు, సమర్థుడైన సహచరుడు సర్దారు పటేల్ అతనికి అండగా ఉన్నాడు. నెహ్రూ గతచరిత్ర ఉజ్జ్వలం, అతను తలచుకొంటే ఉజ్జ్వలభవిష్యత్తు ముందున్నది. ఆ పంట పండించుకోగల్గేందుకు అతనికి చిరంజీవిత్వము లభించుగాక! అతని జన్మదినమున నా శుభాకాంక్షలు.

విజ్ఞానవిశేషాలు :

ఆటంబాంబు రహస్య కథ

శ్రీ భైరవభొట్ల రామబ్రహ్మశాస్త్రి

ఈ రోజుల్లో ఏమూల జూచినా, ఏ రాజ్యములో చూచినా, ఏ దేశంలో చూచినా ఆటంబాంబుసంగతి వినని వారుండరు. కాని యీ విన్నవారందరు ఆటంబాంబుకి యెంత గొప్ప నాశనశక్తి ఉన్నదో దాన్ని గుఱించి చెప్పేవారేకాని, ఆటంబాంబు ఎట్లా తయారయిందో దాన్ని యేవిధంగానైనా లాభయోగ్యముగా చేసికొనవచ్చునో లేదో చెప్పేవారు తక్కువ.

ఆటంబాంబునుగుఱించి తెలిసికొనబోయే ముందు అణువుల నిర్మాణమునుగుఱించి కొంత తెలిసికొనవలెను. ఒక అణువులో మధ్యలో కొంత పదార్థము ఒక ముద్దవలె నుండును. దీనిని "న్యూక్లియసు" అందురు. దానిచుట్టూ కొన్ని వలయము లుండును. ఇందు "ఎలక్ట్రానుల"న బడునవి తిరుగుచుండును. "న్యూక్లియసు" పదార్థము "ప్రోటాను"లతోను "న్యూట్రానుల"తోను సమ్మిళితమైయుండును. ప్రోటానులకు న్యూట్రానులకు బరువుకలదు. ఎలక్ట్రానులకు లెక్కలోనికి వచ్చునంత బరువు లేదు. ఒక పదార్థముయొక్క అణువులన్నింటిలోని న్యూక్లియసులు ఒకే మోస్తరుగా నుండవు. కొన్నింటిలో న్యూట్రానులెక్కువగాను, కొన్నింటిలో తక్కువగా నుండును.

ఉదాహరణకు ఆమ్లజనిఅణువును పరీక్షించుదాము. ఇందు న్యూక్లియసులో 8 ప్రోటానులు, 8 న్యూట్రానులు గలవు. కావున దీని అణువు బరువు 16 అని తేల్చబడినది. అనగా దీని అణువు బరువు ఉదజనిఅణువుబరువుకన్న 16 రెట్లు ఎక్కువ అన్నమాట. కాని అనేకఆమ్లజని అణువులను పరిశీలించినచో కొన్ని అణువులను పరిశీలించినచో కొన్ని అణువులలో 9 న్యూట్రానులు మఱికొన్నింటిలో 10 న్యూట్రానులు గూడా ఉండుట గలదు. అవి ఆమ్లజనియొక్క రూపాంతరాణువులు. ఒక అణువుల ప్రోటానుల సంఖ్యనుబట్టి ఆ పదార్థనిర్ణయము జరుగునుగాన, ఆ అణువులుగూడ ఆమ్లజనిఅణువులే అని తేల్చవలసియున్నది. కాని 9 న్యూట్రానులుగల ఆమ్లజనిఅణువుయొక్క బరువు 17, మఱి 10 న్యూట్రానులుగలదాని బరువు 18. శాస్త్రజ్ఞులు ఇట్టివానిని అణురూపాంతరములు (*Isotopes*) అందురు. అనేకపదార్థములకు ఇట్టి అణురూపాంతరములు గలవు. అనగా దాదాపు ఏ పదార్థపు అణువును పరిశీలించినను అందలి న్యూక్లియసులో కొన్ని యెక్కువో కొన్ని తక్కువో న్యూట్రాను లుండును.

అణువుశక్తికి యురేనియమను ఖనిజము ప్రధానము. జపానులో హిరోషిమావద్ద పడిన అణుబాంబులోని యురేనియము అణువులో 92 ప్రోటానులు గలవు. ఇందు సామాన్యముగా 146 న్యూట్రాను లుండవలెను. కాని దానిలో 143 మాత్రమే గలవు. కొబట్టి దానిని u-235 అందురు. (92 + 143.) దీని న్యూక్లియసు త్వరగా రెండు శకలము లయిపోవును. ఈ రెండు ఒకదానివద్ద … యింకొకటి అప్రతిహతవేగముతో విడిపోయి, … పోవును. ఈ రెంటిలోనుకలిపి మొత్తముమీద u-235 అణువులో నుండవలసిన ప్రోటానులు, ఎక్కువసంఖ్యన్యూట్రాను లుండును. అనగా ఒక శకలమునందు 56 ప్రోటానులు, 82 న్యూట్రాను లుండు ననుకొందము. బేరియము (*Barium*) అణువులో గూడా ఇదే సంఖ్యలో ప్రోటానులు, న్యూట్రాను లుండును. కాబట్టి యీ శకలము బేరియ మయిపోయిన దన్నమాట! అపుడు రెండవ శకలములో 36 ప్రోటానులు, దాదాపు 48 న్యూట్రాను లుండును. "క్రిప్టాను" అనే వాయుపదార్థాణువులోగూడా ప్రోటానులు, న్యూట్రానులు ఇదేసంఖ్యలో నుండును. అందుచే యీ రెండవ శకలము "క్రిప్టాను" వాయువుగా మారినది.

ఈ 235 అణువు ఈవిధముగా మధ్యకు బ్రద్దలయినపుడు అపారమయిన అనంతమయిన శక్తి ఉత్పన్నమగును. ఈ శక్తి అయస్కాంతముయొక్క విభేదధృవాలమధ్య నున్న ఆకర్షణ వంటిది. సమధృవాలమధ్యగూడ ఇంతే శక్తి యుండును. అయితే ఇవి ఒకదానినుండి ఒకటి విడిపోవును. ఇట్టి ఆకర్షణశక్తిలో ఎంతోకాలము నుండి బంధింపబడిన విభేదధృవాలతో నున్న న్యూక్లియసులోనుండి ఒక్కసారి ఇది బ్రద్దలగుటచే నిజముగా అత్యద్భుతమైన శక్తి వొడముసు. ఉదాహరణకు ఒక పౌనుబరువుగల యురేనియము - 235 పదార్థాణువులనన్నింటిని ఛేదించినచో 28,00,000 పౌనుల బొగ్గును కాల్చిన శక్తి యుద్భవమగును. ఒక u-235 అణువును బ్రద్దలుచేస్తే వెలువడే న్యూట్రానులు అన్నిదిశలకు విపరీతవేగముతో బోవును. ఇవి చిన్న చిన్న న్యూక్లియార్ గుళ్ళుగా తయారగును. ఇంత విపంతవేగముతో విడిపోయి ప్రక్క నున్న యింకొక అణువునకు తగిలి దానిని ఛేదించును. అందులోనుండి వెలువడ్డ న్యూక్లియార్ గుండ్లు వాటిప్రక్క నున్న అణువులను ఛేదించును. ఈ విధముగా ఒక్క అణువు బ్రద్దలయినచో దాన్ని చుట్టుప్రక్కల నున్న అణువులన్నీ బ్రద్దలగును. ఇదంతయు క్షణమాత్రములో జరిగిపోవును.

ఈవిధముగా u-235 అణువుల ననేకలక్షలను దగ్గరకు తీసి ఒక చిన్న కుప్పగా అదిమి చేసినచో అవన్నీ బ్రద్దలగుటకు ఒక సెకండుగూడ పట్టదు. అప్పుడు ఆ అన్ని అణువులలోనుండి ప్రభవించు శక్తి ఒక మహానగరమునే కాదు, ఒక పెద్ద జిల్లానైనను నామరూపాదులు లేకుండ జేయగల్గును.

ఈవిధముగా గొలుసువలె జరుగు క్రియను కొంత నిరోధించినచో అనగా న్యూక్లియార్ గుండ్ల వేగమును మందగించినచో, ఆ యనంత శక్తిని మన కుపయోగకరమార్గములో బెట్టవచ్చును. ఇట్టి నిరోధమువల్ల మెల్లమెల్లగా వెలువడు శక్తినే మానవుడు ఇంతకుముందు కలలోనైన నూహించియుండడు! ఇట్టి మహాశక్తిని సద్వినియోగముచేసికొని మానవుడు కనివిని యెఱుంగని వింతలను చూడగలడు, వినగలడు, చేయగలడు. ఇట్టి శక్తి నుపయోగించుకొని రాకెట్టువిమానాలలో భూలోకమునుండి చంద్రలోకానికి, చంద్రలోకమునుండి కుజమండలమునకు, అచ్చటనుండి బుధలోకమునకు కొద్దిగంటలలో వెళ్ళిరావచ్చును. ఆ యా లోకవాసులతో నిరంతరమైత్రిని నెఱపికొనవచ్చును. ఆ లోకములలోని సర్వవిశేషములను గ్రహింపవచ్చును. మనకు ప్రస్తుతము ఆహారపదార్థములు కొఱతపడియున్నవి గదా! ఒక్క పౌండు యురేనియము 235 శక్తితో కొన్ని లక్షల ఎకరములను ఒక్క రోజులో దున్ని వేయవచ్చును. చంద్రమండలమునంతయు 2 పౌనుల u-235తో 3 రోజులలో దున్ని వేయవచ్చును. ఇంక మన పంటలకు కొఱత యెక్కడిది? ఈ అణుశక్తిమాహాత్మ్యము విస్మరించి పూర్వము వినాయకుడు భూప్రదక్షిణచేయుటకు కుమారస్వామితో పోటీచేయలేక తల్లిదండ్రులచుట్టును తిరిగినాడు. లేనిచో ఈ u-235 అణుశక్తి నుపయోగించి ఒక రాకెట్టులో భూమండలముచుట్టూ ఒక్క సెకండులో ఒక వెయ్యిసార్లు తిరిగిరాలేకపోయినాడా? ఒక అరపౌండు యురేనియముశక్తితో మద్రాసు రాజధానికి కావలసిన విద్యుచ్ఛక్తినంతయు 3 గంటల పాటు సరఫరాచేయవచ్చునుగదా! మన మనుమలు, మునిమనుమలు మిత్రలాభము గ్రహించినవారైనచో ఈ శక్తిని సద్వినియోగముచేసికొని భూలోకమును అపరస్వర్గముగా నొనరించుకొందురు. లేనిచో ఇంతటితో కలియుగాంతమునుకొనవలసినదే!

లేఖలు

ఆదిమవాసులు - ఉద్యోగవసతులు

ఆర్యా!

భారతదేశానికి అసలుదారులైన ఆదిమవాసులు అనాదినుంచికూడా సమాజంలో అట్టడుగున బడి బానిసలకంటెకూడా అతినికృష్టమైన జీవితం వెళ్ళమారుస్తున్నారు. అనాదినుంచి, సామ్రాజ్యవాదులైన పరాయి తెల్లదొరల హయాంమువరకు ఏ ప్రభువూ యీ అనాథల ఆలనాపాలనా చూచినపాపాన పోలేదు.

కాని 1947 ఆగష్టు 15 తో పరాయి ప్రభుత్వం అంతరించి, ప్రభుత్వయంత్రం కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ జాతీయనాయకుల హస్తగతం కావడంతో, దేశంలోని అన్ని వర్గాలవలె ఆదిమవాసులుకూడా ఇక తమ దుర్భర బానిసజీవితం అంతరించి, స్వేచ్ఛ, అభివృద్ధితో కూడి మానవత్వం కల నిజమైన మానవజీవితం గడపవచ్చునని ఎంతో ఆశించారు. కాని యీ అనాదీయుల ఆర్థిక, సాంఘిక, రాజకీయ, విద్యా, వైజ్ఞానికరంగాల్లో ప్రభుత్వంవారు చేయవలసినంత సహాయం యీనాటికీ చేయక పోవడంవల్ల, వీరు ఆశించింది ఫలించలేదు, ఫలించదు అని నిర్ధారణగా నమ్మవలసివస్తోంది.

అయితే, విద్యావిషయకంగామాత్రం కొద్దిపాటి వసతి కలుగజేశారు. ఏమంటే ఆదిమవాసులు, కొండజాతులవిద్యార్థులు హైస్కూళ్లలోను, కాలేజీలలోను, గతంలోవలె జీతాలు చెల్లించనవసరం లేకుండా ఉచితంగా చదువుకొనే యేర్పాటు చేశారు. అయినా ప్రభుత్వంవారు ఇటీవల తయారుచేసిన ఆదిమవాసుల జాబితాలో కొన్ని ఆదిమజాతులు చేర్చబడలేదు. అంచేత ఈ సహాయం అలా దిగజార్చబడ్డ జాతులకు దక్కటం లేదు. అదిన్నీగాక. ప్రాథమిక విద్య మొదలు ఉచితనిర్బంధ విద్యావిధానం ప్రవేశపెట్టి అమలుజరిపినట్లయితే యింకా ఎంతో బాగుండేది. అయినా ఈపాటి సౌకర్యమైనా కలుగజేసినందుకు ప్రభుత్వంవారికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

కాని విద్యావిషయకంగా ఆదిమవాసులకు ఈమాత్రపు ప్రత్యేక వసతులు కలుగజేసిన ప్రభుత్వంవారు, ఉద్యోగరీత్యాకూడా ప్రత్యేక సౌకర్యాలు కలుగజేయకపోవడం విచారకరంగా ఉంది.

సమాజంలో అతిహీనంగా చూడబడుతున్న హరిజనసోదరులకంటెకూడా వెనకబడివున్న ఆదిమవాసుల్ని కమ్మ, కాపు, రజక యిత్యాది అభివృద్ధిచెందిన కులాలతోకూడిన కలగూరగంపలాంటి వెనుకబడిన జాతుల జాబితాలో అలాగే ఉంచి, అథఃపతితులైన ఆదిమవాసుల్ని అభివృద్ధిచెందిన పైవర్ణాలవారిని- యిద్దర్నీ- ఒకే తక్కెటలో తూస్తున్నారు.

ఉద్యోగవిషయాల్లో, మైనార్టీలుతరగతులు, వెనుకబడినజాతులు, మహమ్మదీయులు, క్రైస్తవులు, బ్రాహ్మణ బ్రాహ్మణేతరులు అనే తరగతులక్రింద సీట్లను పంపకం చేసి, ఆ పంపకంలో వెనుకబడిన జాతులవాటాక్రింద వచ్చిన 2 సీట్లను ప్రస్తుతం వెనుకబడినజాతులుగా గుర్తించబడుతున్న 145 జాతుల్ని పంచుకోమని వారిలో వారికి పోటీ పెట్టారు.

గజెటెడ్ ఉద్యోగాలవిషయంలో పోటీపరీక్షల పద్ధతి పెట్టారు. ఇందులోనూ అభ్యర్థియొక్క మెరిట్‌కే ప్రాధాన్యత - యిస్తున్నారు. అదిన్నీగాక మదరాసులాంటి దూరపు పట్టణాలను ఈ పరీక్షలకు కేంద్రాలుగా యేర్పాటు చేస్తున్నారు. ఇదంతా డబ్బుతో కూడిన పని. అంచేత కన్నకన్నవారి కాళ్ళుబట్టి ఏదోరకంగా నొన్నతవిద్య చదువుకొన్న ఆదిమవాసుల్లోని పట్టభద్రులు పైపోటీలలో పాల్గొనలేక, పాల్గొన్నా నెగ్గలేక పోవటం జరుగుతోంది. అంచేత పెద్ద ఉద్యోగాలపై ఆశ వదలుకొని చివరకు ఏ గుమాస్తాగిరన్నా చూచుకొందామని ప్రయత్నిస్తే, ఆ గుమాస్తాగిరి దొరకటంకూడా బ్రహ్మప్రళయంగా ఉంది.

ఆదిమవాసులకు దినదినగండం నూరేండ్లాయుష్యం. అట్టి పరిస్థితుల్లో విద్య పొందటం - అందులోనూ, ఉన్నతవిద్య - పునర్జన్మయెత్తటమే. అంచేతనే ఆదిమవాసుల్లో యీనాడు విద్యావంతుల సంఖ్య బహుస్వల్పం. అందులోనూ పట్టభద్రుల్ని వేళ్ళమీద లెక్కబెట్టవచ్చు. అయినా, ఉద్యోగవిషయాల్లో వారికేలాంటి వసతులు లేకపోవడంవల్ల, చదువుకొన్నా ప్రయోజనం లేదనే నిస్పృహ కలుగుతోంది. దేశంలోని ప్రతీఒక్కరూ స్త్రీపురుషభేదం లేకుండా అన్ని జీవనవసతులు, అభివృద్ధిచెందడానికి అన్ని అవకాశాలు కలిగివున్నప్పుడే గదా దేశసౌభాగ్యం, దేశాభ్యుదయం. కాగా దేశానికి మూలపునాదులైన ఆదిమవాసులు అనాదిలోవలె అనాథలుగా వున్నంతకాలం స్వరాజ్యం సురాజ్యం కాజాలదు. అంచేత,

*ఆదిమవాసులకు ఉద్యోగవిషయకంగా ప్రస్తుతం ఎటువంటి వసతులూ లేవు. ఈ పరిస్థితిని పూర్తిగా తలక్రిందులు చేయాలి.

*వెనుకబడినజాతుల జాబితానుండి ఆదిమవాసుల్ని వేరుచేసి, ఆదిమవాసులు అందరూ కలిసి వచ్చేటట్లు, ఆదిమవాసుల జాబితాను తయారుచేసి, వీరికై ఒక ప్రత్యేకశాఖను నెలకొల్పాలి.

*కమ్యూనల్ జీ. వో. ప్రకారంగానూ, కాంపిటేటివ్ పరీక్షా పద్ధతిద్వారానూ కాక విద్యావంతుడైన ప్రతీఆదిమవాసికీ గజెటెడ్, మరియు నాన్‌గజెటెడ్ సర్వీసుల్లో చదువు పూర్తికావడంతోనే వెంటనే ఉద్యోగం ఖచ్చితంగా యివ్వాలి.

*కాగితాలమీద ప్రకటనలు, తీర్మానాలద్వారా గాక నిర్ణయాలను ఆచరణలో పెట్టినప్పుడే ఆదిమవాసులు అభివృద్ధి చెందగలుగుతారు.

అంచేత నా యీ సూచనలను సావధానంగా పరికించి, ఆదరించి అమలుపరచవలసిందిగా ప్రభుత్వంవారికి విజ్ఞప్తి చేస్తున్నాను.


ఇట్లు :

పొన్నా కోటేశ్వరరావు.

మద్రాస్, ఆర్గనైజర్, రాష్ట్రఎరుకలమహాసంఘం.

స్విస్‌పనితనముయొక్క అందమైన నమూనా

దివ్యమైన తరుణము



ఒకసారి తెప్పించిచూడండి


మన ప్రియమైన బాపూజీ స్మారకార్థము డయల్‌మీద మహాత్మగాంధి ఫోటో కలిగిన రిస్టువాచీలు యిపుడే స్విజర్లండునుండి దిగుమతిచేసియున్నాము. ప్రతి వాచీకి ప్లాస్టిక్ బాండ్ కలదు. ఒకరికి రెండువాచీలుకంటె యెక్కువ పంపబడవు. ఖరీదు రు. 15/8/. సుపీరియర్ రు. 18/8. బెస్టు రోల్డుగోల్డు రు. 20-8/- రేడియం డయలుతో రు. 22/8/- సుపీరియర్ రు. 25/- బెస్టు రోల్డుగోల్డు రు. 32/8/0.

MODEL WATCH Co,
Post Bag No. 6705, Calcutta 7.

పండిట్ నెహ్రూ అమెరికా పర్యటనలో తుదిఘట్టాలు



కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో అక్టోబరు 31 న పండిట్ నెహ్రూ అత్యంత ప్రధానమైన ఉపన్యాసం చేశారు. ఆ సందర్భంలో తీసిన ఫోటో. ఫోటో ఐ. యస్. పి.




ప్రిన్సిటన్ విశ్వవిద్యాలయమునకు వెళ్లినపుడు భారతప్రధాని పండిత నెహ్రూ ప్రసిద్ధశాస్త్రవేత్త ఆల్బర్టు ఎన్‌స్టిన్‌ను చూడబోయెను. వారిద్దరు సంభాషించుట ఈ చిత్రములో కానవగును.



కాలిఫోర్నియా విశ్వవిద్యాలయాన్ని సందర్శించి దాదాపు 10 వేల మంది విద్యార్థుల సమావేశంలో పండిట్ నెహ్రూ ఉపన్యసించారు. ఉపన్యాసానంతరం అధ్యక్షుడు స్ప్రౌలు, స్ప్రౌలు సతీమణి, గవర్నర్ ఎరల్ వారెన్ ప్రభృతులతో పండిట్ నెహ్రూ.



భారతప్రధాని నెహ్రూగారు శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్లినప్పుడు కాలిఫోర్నియా గవర్నరు స్వాగత మిచ్చారు. చిత్రంలో నెహ్రూ గారితో కాలిఫోర్నియా గవర్నరు (కుడివైపున) ఉన్నారు.



శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారతీయులతో అక్టోబరు 31 న భారత ప్రధానమంత్రి పండిట్ నెహ్రూ ఇష్టాగోష్ఠిగా సంభాషిస్తున్న దృశ్యం.
ఫోటో ఐ. ఎస్. పి.

Regd, M. No. 4479

ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము

ప్రథమ ద్వితీయ సంపుటములు

ప్రథమసంపుటమునందు డిమ్మీ ౪-వ ఆకృతియందు ౬౦౦ పుటలు గలవు. ఇందు 'అ' నుండి "అధ్వర్యు" వరకును గల విషయము గలదు. త్రివర్ణపటములుగా' ఇతర పటములు ౧౨౫, వివిధవిషయములు ౪౦౦ కలవు.

రెండవ సంపుటమునందు డిమ్మీ ౪-వ ఆకృతియందు ౬౦౦ లకు మించిన పుటలు కలవు. "అఙ" మొదలుకొని "అశ్విని" వరకు గలవిషయము గలదు. త్రివర్ణపటములు ౧౦ వానిలో ౨ అమరావతీస్తూపమునకును, ౨ అనాహతమునకును చెందినవియు, ౬ దేశచిత్రపటములును గలవు. ఇవిగాక మరి ౫ సాదాదేశపటములు కలవు. ప్రాచీనాంధ్రుల కళాసంపదను వ్యక్తముచేయు అమరావతీస్తూపమును గురించిన గొప్ప వ్యాసమునందు అమరావతీశిల్పమునకు సంబంధించిన హాఫ్‌టోన్ బొమ్మలు రమారమి ౧౦౦ ను, వేషభూషాదుల వెల్లడించు బొమ్మలు ౫౦ వఱకును గలవు. మరియు అభినయ మను వ్యాసమున భరతశాస్త్రము నందలి వేఱు వేఱు హస్తములను సూచించు బొమ్మలు ౫౭ ను, 'అనాహతము' నందు షట్చక్రాదుల చిత్రములును గలవు. ఇట్లు ఆ యా వ్యాసములకు చెందిన చిత్రములును మొత్తముమీఁద ౨౫౦ కి పైగా నున్నవి. వివిధ విషయముల సంఖ్య ౪౦౦ వరకు నుండును. సంపుటము చక్కని స్వదేశీచర్మముతోడను, బంగారు రేఖలతోడను సంపుటీకృతము. ప్రతి సంపుటమును ౬౦౦ పుట లుండును.

ప్రతి సంపుటము వెల రూ. ౧౦.

పోస్టు ఖర్చులు: రూ. ౧-౮-౦.

రైలు ద్వారా దగ్గర రహోట్లకు ఖర్చులు అ. ౧౨.

మేనేజరు,

ఆంధ్రవిజ్ఞాన సర్వస్వ కార్యాలయము,

నెం. 7, తంబుశెట్టివీధి, మదరాసు 1.

కళాప్రపూర్ణ కీ॥ శే॥ కాశీనాథుని నాగేశ్వరరావుగారి
ఉత్కృష్టరచన



ఆంధ్రవాఙ్మయ చరిత్ర

సరికొత్తపద్ధతిని, సంగ్రహరూపంలో నడిచిన సమగ్రసమీక్ష. వెయ్యేండ్ల వాఙ్మయచరిత్రకు విశుద్ధదర్పణం. పాత చరిత్రల నన్నిటిని అవలోడన చేసి, సమన్వయించి క్రోడీకరించిన సినలయినచరిత్ర. శాసనాలలోనూ వాటిలోనూ అవ్యక్తస్వరూపంలో ఉండి ఉండి, నన్నయధర్మమా అని ఒక్క ఊపున దివ్యాకారంతో బైటపడి, నానాటికి నవనవోజ్జ్వలంగా వికసించిన మన వాఙ్మయం పోయిన పలుపోకడలను పోడిమితో చూపెట్టజాలిన ఉత్తమ గ్రంథం.

వెల రు 2-0-0 లు, తపాలాఖర్చు 0-7-0 **ఆంధ్రగ్రంథమాల, పో. బా. 212, మదాసు**

ఉత్తమ శైవమత గ్రంథము:

పండితారాధ్యచరిత్ర

వెల రు 5-0-0 లు.

ప్యాకింగు పోస్టేజి రూ, 1—4—0.

పాల్కురికి సోమనాథకవి రచించిన ఉత్తమ ద్విపద కావ్యము. డా॥ చిలుకూరి నారాయణరావుగారిచే పరిష్కరింపబడినది. దీక్షా, పురాతన, వాద, మహిమ, పర్వతము లను అయిదు ప్రకరణములును ఒకే సంపుటమున గలవు. ఇంత నిర్దుష్టముగ ఈ గ్రంథము నిదివర కెవ్వరును ప్రచురించి యుండలేదు. నారాయణరావుగారు రచించిన అమూల్యమైన పీఠికకూడ కలదు.

ఆంధ్రగ్రంథమాల, పోస్టు బాక్సు నెం. 212, మదరాసు 1.

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press. 7 Thambu Chetty St., G. T. Madras